RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com




# వుదయం




గుంటూరు | 18-05-2026 సోమవారం | సంపుటి : 13 | సంచిక : 74 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on


## ఎగిసిపడుతున్న ఎండ వేడిమి

భానుడి భగ భగలు, వారం రోజులు ఇలాగే

సగటు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటే ప్రమాదం

వడగాలులు వీచే అవకాశం ఉంది : వాతావరణ శాఖ

తెలంగాణలోని కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్



**హైదరాబాద్, మే 17 (ఎఎంఎస్) :** మరో వారం రోజులపాటు తెలుగు రాష్ట్రాల్లో ఎండలు హోరెత్తయించనున్నాయి. ఈ నెల 19- 24వ తేదీ మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. సగటు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటే ప్రమాదం ఉందని, వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయటకు వెళ్లొద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఇవాళ తెలంగాణలో ఆదిలాబాద్, కుమురం భీం, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాలకు అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఇవాళ 16 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. ఆయా జిల్లాల్లో 41-44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. సోమవారం ఏడు జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

## అటవీ సంపదను దోచుకుంటున్నారు

హక్కుల సాధన కోసం ఆదివాసీల సుదీర్ఘ పోరాటం

అభివృద్ధి కంటే అణచివేతనే కొనసాగిస్తున్నారు

ఖనిజ సంపదను తరలించుకుపోతున్నారు

ఆదివాసీలను వదిలేశారు : ప్రొఫెసర్ హరగోపాల్



**హైదరాబాద్, మే 17 (ఎఎంఎస్) :** దేశ స్వాతంత్ర్యానికి ముందు నుంచే ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నారని

మిగతా 2లో

శాంతి ఒప్పందం త్వరలో కుదరకపోతే

# ఇరాన్‌కు దుర్భరమే

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

అబుదాబి బరకా అణు విద్యుత్ కేంద్రం సమీపంలో డ్రోన్ దాడి

రేడియేషన్ ముప్పు లేదన్న అధికారులు

లెబనాన్‌లో హిజ్బుల్లాపై ఇజ్రాయెల్ దాడి

వచ్చే వారం స్టాక్ మార్కెట్లను తిరిగి తెరవనున్న ఇరాన్ : ఇర్నా వార్తా సంస్థ



**వుదయం డెస్క్, మే 17 :** అల్ ధఫ్రా ప్రాంతంలోని బరకా అణు విద్యుత్ కేంద్రం లోపలి ఆవరణ వెలుపల, ఒక విద్యుత్ జనరేటర్‌పై డ్రోన్ దాడి జరగడంతో అగ్నిప్రమాదం సంభవించిందని అబుదాబి మీడియా కార్యాలయం ఆదివారం తెలిపింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, రేడియోలాజికల్ భద్రతా స్థాయిలకు ఎలాంటి నష్టం జరగలేదని, ప్లాంట్‌లోని కీలక వ్యవస్థలు సాధారణంగా పనిచేస్తున్నాయని ఫెడరల్ అథారిటీ ఫర్ న్యూక్లియర్ రెగ్యులేషన్ ధృవీకరించింది. శాంతి ఒప్పందం త్వరలో కుదరకపోతే ఇరాన్ చాలా దుర్భరమైన పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఒప్పందానికి చేసుకోవడంలో వారికి ఆసక్తి ఉంది, అని ట్రంప్ ఫ్రెంచ్ ప్రసార సంస్థతో జరిపిన ఒక టెలిఫోన్ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

### లెబనాన్‌లో హిజ్బుల్లాపై ఇజ్రాయెల్ దాడి

ప్రాంతీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, అక్టోబర్ 7 దాడులలో పాల్గొన్న ఇద్దరు హమాస్ కార్యకర్తలను హతమార్చినట్లు, దక్షిణ లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై విస్తృత దాడులు నిర్వహించినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళాలు తెలిపాయి. శనివారం నాడు తన అధికారిక టెలిగ్రామ్ ఛానెల్ ద్వారా విడుదల చేసిన ఒక ప్రకటనలో,

మిగతా 2లో



మాస్కోపై డ్రోన్ దాడిలో భారతీయ కార్మికుడు మృతి

ముగ్గురికి గాయాలు ● ధృవీకరించిన భారతీయ ఎంబసీ

2

### హొర్ముజ్‌పై ఎలా ఉంది

అమెరికా, ఇజ్రాయెల్‌లతో వివాదం ముగిసిన తర్వాత కీలకమైన హొర్ముజ్ జలసంధి గుండా రవాణా సజావుగా సాగుతుందని ఇరాన్ తెలిపింది. అయితే, ఇరు పక్షాలు తమ విభేదాలను పరిష్కరించుకోవడానికి గానీ, దానిని సాధించే మార్గాన్ని కనుగొనడానికి గానీ ఇంకా దగ్గర కాలేదని పేర్కొంది. సహజంగానే, ప్రస్తుత అభద్రతా పరిస్థితి పరిష్కారమైన తర్వాత, హొర్ముజ్ జలసంధిలో నౌకాయాన పరిస్థితులు సాధారణ స్థితికి వస్తాయి, అని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అన్నట్లు మెహర్ వార్తా సంస్థ ఉటంకించింది.

# ఎప్‌సెట్ లో హైదరాబాద్ విద్యార్థుల హవా

అత్యంత పారదర్శకంగా, రికార్డు కాలంలో ఫలితాలు విడుదల

● ఇంజినీరింగ్ విభాగంలో రిషికి ఫస్ట్ ర్యాంక్

● అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ముకరం అహ్మద్ ఫస్ట్



**హైదరాబాద్, మే 17 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో అధికారులు ఈ ఫలితాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన బటన్ నొక్కి ఫలితాలను, విద్యార్థుల సాధించిన ర్యాంకులను విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన ఎం. రిషి ఫస్ట్ ర్యాంకు, హైదరాబాద్ మూసాపేటకు చెందిన అన్ను రెండో ర్యాంకు , కడపకు చెందిన వంశీధర్ రెడ్డి మూడో ర్యాంకు సాధించినట్లు అధికారులు తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ముకరం అహ్మద్ (హైదరాబాద్) ఫస్ట్ ర్యాంక్, తాడూరి సాయి వెంకట్ (ఎల్బీనగర్) రెండో ర్యాంకు, సాహితి (రంగారెడ్డి) మూడో ర్యాంకు సాధించినట్లు అధికారులు వెల్లడించారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాలకు మే 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. ఇంజనీరింగ్ విభాగంలో మొత్తం 2,10,766 మంది విద్యార్థులు అప్లై చేసుకోగా.. 1,97,241 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇక అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 90,977 మంది దరఖాస్తు చేసుకోగా.. 84,954 మంది పరీక్షలు రాశారు. ఈ ఏడాది ఎప్‌సెట్ ప్రవేశ పరీక్షల్లో విద్యాశాఖ ఒక అరుదైన రికార్డును సృష్టించింది. పరీక్షలు ముగిసిన కేవలం ఆరో రోజే తుది ఫలితాలను, ర్యాంకులను ప్రకటించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షా విధానాన్ని (సిబిటి) మరింత ఆధునికీకరిస్తూ.. ఈ ఏడాది విద్యార్థులు పరీక్ష రాసిన వెంటనే ప్రాథమిక కీ ఆధారంగా వారి మార్కులు కంప్యూటర్ స్క్రీన్‌పైనే కనిపించేలా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ డిజిటల్ సంస్కరణల కారణంగానే ఎలాంటి ఆలస్యం లేకుండా.. అత్యంత పారదర్శకంగా, రికార్డు కాలంలో ఫలితాలు విడుదల చేసినట్లు ఎప్‌సెట్ కన్వీనర్ ఆచార్య కె. విజయకుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లో అగ్నిప్రమాదం



యూనిట్-3 టర్బైన్ డ్రైవెన్ బాయిలర్

ఫీడ్ పంప్ ఏరియాలో చెలరేగిన మంటలు

కాలిబూడిదైన కంట్రోల్ కేబుల్స్

**హైదరాబాద్, మే 17 (వుదయం ప్రతినిధి) :** నల్గొండ జిల్లా దామరచర్లలో నిర్మాణంలో ఉన్న ప్రతిష్టాత్మక యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ స్టేషన్ లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.

మిగతా 2లో

ఒక బాలికకు అన్యాయం జరిగితే

# ప్రభుత్వం మౌనమేల?

కాంగ్రెస్, బిజెపి కలిసి అన్యాయం చేయాలని చూశాయి

బీఆర్ఎస్, అనుబంధ సంఘాల పోరాటం వల్లే

బాలికకు కొంత న్యాయం జరిగే పరిస్థితి వచ్చింది

కేంద్రమంత్రి కుమారుడిపై లుక్‌ఔట్ నోటీసు ఇచ్చే పరిస్థితి

బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయండి

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, మే 17 (వుదయం ప్రతినిధి) :** బండి భగీరథ్ పై నమోదైన కేసుపై నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే ఆయన తండ్రి కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయకపోతే ఈ కేసు విచారణ సజావుగా జరిగే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పు చేసిన కొడుకుని తొమ్మిది రోజులు దాచి పెట్టారంటూ కేంద్ర మంత్రి సంజయ్‌పై నిప్పులు చెరిగారు. సంజయ్ లాంటి వ్యక్తి పదవిలో కొనసాగడం తెలంగాణకే కాదు.. భారత దేశానికి కూడా అవమానకరమన్నారు.

మిగతా 2లో

## బండి భగీరథ్ ను అరెస్ట్ చేయడం పోలీసులకు చేతకాలేదు

● భగీరథ్ ను వెతకడానికి పది టీమ్ లను పంపించామని చెబుతున్నారు

● ఆ పది టీమ్‌లు గోర్లు తీసుకుంటున్నాయా ?

● సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ



**హైదరాబాద్, మే 17 (వుదయం ప్రతినిధి) :** యువతులపై లైంగిక దాడులకు పాల్పడిన ఎవరెవరినో ఎన్ కౌంటర్ చేసిన రాష్ట్ర పోలీసులకు భగీరథ్ ను అరెస్ట్ చేయడానికి చేతకాలేదని సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ ఆరోపించారు. భగీరథ్ ను వెతకడానికి పది టీమ్ లను పంపించామని చెబుతున్నారని, ఆ పది టీమ్‌లు గోర్లు తీసుకుంటున్నాయా అని ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. భగీరథ్ ను చర్లపల్లి వద్ద అరెస్ట్ చేశామని పోలీసులు చెబుతున్నారని,

మిగతా 2లో

తెలంగాణ పోలీసుల పరిధిలోనే

# బండి భగీరథ విచారణ

● రాష్ట్ర ప్రభుత్వాలకు స్వతంత్ర వ్యవస్థ ఉంటుంది

● బండి సంజయ్ కేంద్రమంత్రి పదవిలో కొనసాగుతారా? లేదా చెప్పలేను

● సర్‌పై రాజకీయాలు తగవు : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

● సర్‌లో ఎక్కడ కుట్ర జరుగుతుందో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చెప్పాలి

● మాటలు కాదు.. పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలి



**హైదరాబాద్, మే 17 (వుదయం ప్రతినిధి) :** మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటోన్న బండి భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోయారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఈకేసు విచారణ ఏదైనా ఉంటే పూర్తిగా తెలంగాణ పోలీసుల పరిధిలోనే ఉంటుందని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బండి సంజయ్ కేంద్రమంత్రి పదవిలో కొనసాగుతారా..? లేదా అనే దానిపై తాను ఏమీ మాట్లాడలేనని చెప్పారు. పశ్చిమబెంగాల్ పర్యటనలో భాగంగా అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్‌లను ఆ రాష్ట్ర పోలీసులు గతంలో అడ్డుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వాలకు అంతటి స్వతంత్ర వ్యవస్థ ఉంటుందని.. భగీరథ విషయంలో ఎలాంటి విచా రణ అయిన చేయొచ్చని కిషన్‌రెడ్డి తేల్చిచెప్పారు.

**సర్ పై రాజకీయం..** కేంద్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన సర్ పై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కరికి ఒక్క ఓటు ఒక్క దగ్గర మాత్రమే ఉండాలని చెప్పుకొచ్చారు. ప్రింటింగ్ ఎర్రర్ కారణంగా ఒక్కొక్కరి ఓటు పది ప్రాంతాల్లో చూపిస్తోందని తెలిపారు.

మిగతా 2లో

జూన్ 2 నుంచి

## కొత్త పెన్షన్లు

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోంది

ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో అందించి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నాం : కార్మిక శాఖ మంత్రి వివేక్



**హైదరాబాద్, మే 17 (వుదయం ప్రతినిధి) :** ఈ ఏడాది జూన్ 2వ తేదీ నుంచి కొత్త పెన్షన్లను మంజూరు చేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ హయాంలో

మిగతా 2లో

విద్యామంత్రిని ఎందుకు

# తొలగించడం లేదు?

● ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు మౌనంగా ఉన్నారు

● 2024, 2026 పేపర్ లీక్ కేసులను ప్రభుత్వం నిర్వహించిన తీరులో సారూప్యత

● పరీక్షా పత్రాల లీకేజీలు వాటిని అరికట్టడంలో కేంద్రం విఫలమైంది

● పరీక్షా పత్రాల చర్చపై మీరెందుకని పదేపదే మౌనం వహిస్తున్నారు?

● నీట్ పేపర్ లీక్ తర్వాత ప్రధాని మోడీని ప్రశ్నించిన రాహుల్



**న్యూఢిల్లీ, మే 17 (వుదయం) :** నీట్-యూజీ పేపర్ లీక్ కేసు విషయంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ ఆదివారం మరోసారి డిమాండ్ చేశారు. ఈ విషయంపై ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. 2024, 2026 పేపర్ లీక్ కేసులను ప్రభుత్వం నిర్వహించిన తీరులో సారూప్యత ఉందని ఆయన ఎత్తిచూపారు. లీకులు, విచారణ, కమిటీ ఏర్పాటు, మంత్రి తన పదవిలోనే కొనసాగడం వంటి ఒకే తరహా ధోరణి కనిపిస్తోందని ఆయన అన్నారు. పరీక్షా పత్రాల లీకేజీలు పదేపదే జరుగుతున్నా, వాటిని అరికట్టడంలో కేంద్రం విఫలమైందని ఆయన ఆరోపించారు; ఈ విషయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మౌనం వహించడాన్ని ఆయన ప్రశ్నించారు.

మిగతా 2లో

సైబర్ భద్రత భవిష్యత్ ప్రపంచానికి

# అత్యంత అవసరం

అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం

టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా మరో భారీ అడుగు పడింది

ఈ ప్రాజెక్ట్ ద్వారా కమ్యూనికేషన్స్, సైబర్‌స్పేస్ భద్రత రంగాల్లో అత్యాధునిక పరిశోధనలు చేపట్టనున్నాం

అమరావతిని ప్రపంచస్థాయి కేంద్రంగా నిలబెట్టడమే ప్రధాన లక్ష్యం

అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందే అవకాశం

ప్రపంచ టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ సొసైటీ దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి కీలక ప్రకటన



**అమరావతి, మే 17 (వుదయం ప్రతినిధి) :** సురక్షిత కమ్యూనికేషన్లు, విశ్వాసనీయ డిజిటల్ మౌలిక సదుపాయాలు, సైబర్ భద్రత భవిష్యత్తు ప్రపంచానికి అత్యంత అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచ టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ సొసైటీ దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు. అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా మరో భారీ అడుగు పడిందని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా

మిగతా 2లో

# విద్యా మంత్రిని ఎందుకు తొలగించడం లేదు?

మొదటి పేజీ తరువాయి



నీట్ 2024: పేపర్ లీక్ అయ్యింది. పరీక్ష రద్దు కాలేదు. మంత్రి రాజీనామా చేయలేదు. సిబిఐ దర్యాప్తు చేపట్టింది. ఒక కమిటీని ఏర్పాటు చేశారు. నీట్2026: పేపర్ లీక్ అయ్యింది. పరీక్ష రద్దు అయ్యింది. మంత్రి మాత్రం ఇప్పటికీ రాజీనామా చేయలేదు. సిబిఐ మళ్ళీ దర్యాప్తు చేస్తోంది. మరొక కమిటీని ఏర్పాటు చేయనున్నారు, అని గాంధీ ఎక్స్‌పై పేర్కొన్నారు.
పదేపదే పేపర్ లీకులు జరుగుతున్నప్పటికీ జవాబుదారీతనం ఎందుకు నిర్ధారించలేదని ఆయన మోడీని ప్రశ్నించారు. మోడీ గారూ, దేశం మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతోంది, వాటికి సమాధానం చెప్పండి! పదేపదే పేపర్ లీక్‌లు ఎందుకు జరుగుతున్నాయి? ఈ పరీక్షా పత్రాల చర్చపై మీరెందుకని పదేపదే మౌనం వహిస్తున్నారు? పదేపదే విఫలమవుతున్న విద్యాశాఖ మంత్రిని మీరెందుకని తొలగించడం లేదు? అని గాంధీ ప్రశ్నించారు.
**నీట్ లీక్ కేసు 2026**.. నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ కేసుపై జరుగుతున్న దర్యాప్తులో పలు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. మే 3న జరిగిన పరీక్షకు ముందే ప్రశ్నలను లీక్ చేశారన్న ఆరోపణలపై, ఒక పదవీ విరమణ పొందిన రసాయనశాస్త్ర అధ్యాపకుడు పి.వి. కులకర్ణి, పూణేకు చెందిన వృక్షశాస్త్ర ఉపాధ్యాయురాలు మనీషా గురునాథ్ మంధారే అరెస్టు అయ్యారు. భారీ మొత్తంలో డబ్బుకు ప్రతిఫలంగా, నిందితులు ఎంపిక చేసిన విద్యార్థులకు ప్రశ్నలు, సమాధానాలను లీక్ చేశారని దర్యాప్తు అధికారులు ఆరోపించారు. ఈ కేసులో ఇప్పటివరకు ఐదు రాష్ట్రాలకు చెందిన తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ఆరు వేర్వేరు ప్రదేశాలలో జరిపిన సోదాలలో, దర్యాప్తుకు సంబంధించిన పత్రాలు, ల్యాప్‌టాప్‌లు, బ్యాంకు రికార్డులు, మొబైల్ ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు సమయంలో, వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా ప్రశ్నపత్రాలు లీక్ అయినట్లు పోలీసులకు తెలిసింది.
**నీట్ లీక్ కేసు 2024**.. 2024లో, నీట్ వైద్య ప్రవేశ పరీక్షకు సంబంధించి పేపర్ లీకేజీలు, అవకతవకల ఆరోపణలు వెలుగులోకి రావడంతో ఈ పరీక్ష తీవ్ర పరిశీలనలో పడింది. ముఖ్యంగా 67 మంది అభ్యర్థులు పూర్తి మార్కులు సాధించడంతో ఈ వివాదం మరింత ముదిరింది. పరీక్ష జరిగిన రోజే, బీహార్ పోలీసులు పేపర్ లీకేజీకి సంబంధించిన ఒక ముఠాను (నెట్‌వర్క్‌ను) గుర్తించారు. పరీక్షకు ముందే లీకైన ప్రశ్నపత్రాన్ని పొందేందుకు పలువురు అభ్యర్థులు రూ. 30 లక్షల నుండి రూ. 50 లక్షల వరకు చెల్లించినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఈ దర్యాప్తును తర్వాత సీబీఐకి బదిలీ చేయగా, పరీక్ష ప్రారంభం కావడానికి ముందే జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో ఉన్న ఒక పరీక్షా కేంద్రం నుంచి ఆ పేపర్‌ను అక్రమంగా సంపాదించారని సీబీఐ ఆరోపించింది. ఆ ఏజెన్సీ ప్రకారం, మధ్యవర్తులు, విద్యార్థులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌ల ద్వారా ఈ పేపర్‌ను పంపిణీ చేశారు. ఈ వివాదం, గ్రేస్ మార్కుల" కేటాయింపు, అసాధారణంగా అధిక మార్కుల విషయంలో విస్తృత విమర్శలకు దారితీసింది. జూలై 2024లో, ప్రశ్నపత్రం లీక్ అయినట్లు సుప్రీం కోర్టు నిర్ధారించినప్పటికీ, ఈ ప్రక్రియలో వ్యవస్థాగత లోపం జరిగినట్లు ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొంటూ పరీక్షను రద్దు చేయడానికి నిరాకరించింది.



### శాంతి ఒప్పందం త్వరలో కుదరకపోతే
## ఇరాన్‌కు దుర్భరమే

మొదటి పేజీ తరువాయి

గత రెండు వారాలుగా ఉత్తర గాజా స్ట్రిప్‌లో, హమర్ ఇయాద్ ముహమ్మద్ అల్మతూక్, ఖాలెద్ ముహమ్మద్ సలేం జౌదేగా గుర్తించిన హమాస్ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని రెండు ప్రత్యేక దాడులను నిర్వహించినట్లు ఐడిఎఫ్ తెలిపింది. సైన్యం ప్రకారం, ఆ ఇద్దరు వ్యక్తులు క్రూరమైన అక్టోబర్ 7వ తేదీ మారణకాండ సమయంలో ఇజ్రాయెల్ భూభాగంలోకి చొరబడ్డారు, ఇటీవల ఆ ప్రాంతంలో పనిచేస్తున్న ఇజ్రాయెల్ దళాలపై దాడులు చేయడానికి ప్రయత్నించారు. అమెరికా, ఇజ్రాయెల్‌తో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా నిలిపివేసిన తన స్టాక్ మార్కెట్‌ను, ఇరాన్ మంగళవారం నాడు తిరిగి తెరవనుందని ఇర్నా వార్తా సంస్థ తెలిపింది. వాటాదారుల ఆస్తులను రక్షించడం, భయాందోళనల కారణంగా జరిగే ట్రేడింగ్‌ను నివారించడం, మరింత పారదర్శకమైన ధరల నిర్ణయ పరిస్థితులకు వీలు కల్పించడం యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి స్టాక్ మార్కెట్ కార్యకలాపాలను నిలిపివేయడం వెనుక ప్రధాన ఉద్దేశాలు అని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ ఆర్గనైజేషన్ డిప్యూటీ పర్యవేక్షకుడు హమీద్ యారి పేర్కొన్నారు.

### బండి భగీరథ్ ను అరెస్ట్ చేయడం
## పోలీసులకు చేతకాలేదు

మొదటి పేజీ తరువాయి

మరోవైపు బండి సంజయ్ తానే తన కుమారుడిని పోలీసులకు అప్పగించానని చెబుతున్నారన్నారు. బండి సంజయ్ చెబుతున్నదాన్ని బట్టి పోలీసు వ్యవస్థ ప్రశ్నార్థకమైందని విమర్శించారు. భగీరథ్ ముద్దాయి అయ్యాడని ఈ కేసులో కోర్టు అసమర్థత కూడా కనిపించిందని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వెంటనే అరెస్ట్ చేసి ఉంటే ఈ గొడవ ఉండేదేకాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో తప్పు చేసిందని అన్నారు. నేడు మూడు వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. కేసు అయిన వెంటనే బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే ఇంత జరిగేది కాదన్నారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం, న్యాయవ్యవస్థ సైతం ముద్దాయిగా నిలిచిందన్నారు. దీనిపై వెంటనే తగిన విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

## జూన్ 2 నుంచి కొత్త పెన్షన్లు

మొదటి పేజీ తరువాయి

ఒక్క పెన్షన్ కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆదివారం మిర్యాలగూడలో పర్యటించిన మంత్రి వివేక్ వెంకటస్వామి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోడి రెక్క శౌరి అంత్యక్రియలో పాల్గొని నివాళులు అర్పించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో తమ ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో అందించి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. మిర్యాలగూడ, నకిరేకల్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేస్తామని.. ఇందుకు సంబంధించిన పనులను త్వరలో ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల రక్షణ కోసం ఆయా ఫ్యాక్టరీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఫార్మారంగంలో ప్రమాదాల నివారణకు నూతన విధివిధానాల ఏర్పాట్లకు తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

## ఒక బాలికకు అన్యాయం జరిగితే ప్రభుత్వం మౌనమేలా?

మొదటి పేజీ తరువాయి



కేంద్ర మంత్రి కొడుకు మైనర్ బాలికకు అన్యాయం చేశాడని విమర్శించారు. మైనర్ బాలిక తల్లిదండ్రుల్ని స్వయాన కేంద్ర మంత్రి భయభ్రాంతులకు గురిచేశారని గుర్తు చేశారు. ఆదివారం ఎల్ బీ నగర్‌లో నిర్వహించిన 'నా బూత్.. నా భవిష్యత్తు' కార్యక్రమంలో అయన మాట్లాడారు. ప్రధాని మోదీ 'బేటీ పడావో.. బేటీ బచావో' అంటున్నారన్నారు. కేవలం ఇది నినాదాలకే పరిమితమైతే న్యాయం జరగదని పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారి కేంద్రమంత్రి కుమారుడి మీద లుకౌట్ నోటీస్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ఆరోపించారు. హనీ ట్రాప్ అని, మీడియాను మనీ ట్రాప్‌లో వేసి.. సీఎం రేవంత్, కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఇద్దరూ మీడియాలో వార్తలు రానీవ్వకుండా చేశారని మండిపడ్డారు. కేంద్ర మంత్రి పదవి నుంచి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే తన మీద అఘాయిత్యం జరిగినా ముందుకు వచ్చే ధైర్యం ఏ ఆడబిడ్డ చేయదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే బండి సంజయ్‌ను కేంద్రమంత్రి నుంచి తొలగించి.. ఈ కేసు విచారణను నిష్పక్షపాతంగా జరిపించాలని కేంద్రానికి ఆయన స్పష్టం చేశారు. కేంద్రమంత్రి ఎన్ని రకాలుగా బెదిరింపులు, ఒత్తిళ్లు తెచ్చినా బాధిత బాలికకు తల్లి అండగా నిలబడిందన్నారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ఇద్దరూ కుమ్మక్కై ఆ అమ్మాయికి అన్యాయం చేయాలనుకున్నా.. ఆ తల్లిదండ్రులు వెనకడుగు వేయలేదని తెలిపారు. బాలిక తరపున పోరాటం చేసిన బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగానికి ఈ సందర్భంగా కేటీఆర్ అభినందనలు తెలియజేశారు. బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కూడా ఈ కేసులో చాలా గట్టిగా కొట్లాడారని గుర్తు చేశారు. బండి భగీరథ్ లొంగిపోయాడు, అరెస్టయ్యాడంటూ డ్రామా నడుస్తున్నదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు.

### సైబర్ భద్రత భవిష్యత్తు ప్రపంచానికి
## అత్యంత అవసరం

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి పోస్టు పెట్టారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ – ఏపీ, సీ – డాట్, భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ల విభాగం, అమరావతి క్వాంటం వ్యాలీ భాగస్వామ్యంతో దేశంలోనే మొట్టమొదటి 'క్వాంటం–సెక్యూర్ కమ్యూనికేషన్స్ టెస్ట్ బెడ్' ఏర్పాటు కానుందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా కమ్యూనికేషన్స్, సైబర్‌స్పేస్ భద్రత రంగాల్లో అత్యాధునిక పరిశోధనలు చేపట్టనున్నారని అన్నారు. ఏప్రిల్ 14వ తేదీన ప్రారంభించిన క్వాంటం కంప్యూటింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీల తర్వాత ఇది మరో కీలక మైలురాయి అని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ టెస్ట్ బెడ్ ద్వారా క్వాంటం కమ్యూనికేషన్ హార్డ్‌వేర్, ఫోటోనిక్, ఆప్టికల్ సిస్టమ్స్, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీలు, సురక్షిత నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలు, నెక్స్ట్ జనరేషన్ సైబర్ డిఫెన్స్ సొల్యూషన్స్‌పై పరిశోధనలు, పరీక్షలు నిర్వహించనున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమం 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యాలకు అనుగుణంగా స్వదేశీ సాంకేతికతల అభివృద్ధికి ఊతమివ్వనుందని సీఎం వ్యాఖ్యానించారు. ఆధునిక టెక్నాలజీలు, డీప్‌టెక్ ఇన్నోవేషన్, అధునాతన తయారీ రంగాల్లో అమరావతిని ప్రపంచస్థాయి కేంద్రంగా నిలబెట్టడమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, యువ ఆవిష్కర్తలకు ఈ ప్రాజెక్ట్ ద్వారా కొత్త అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. భవిష్యత్తు ప్రపంచాన్ని ప్రభావితం చేసే క్వాంటం టెక్నాలజీ, సైబర్ భద్రత రంగాల్లో రాష్ట్ర యువతకు ప్రత్యక్ష భాగస్వామ్యం కల్పించే వేదికగా ఇది నిలవనుందని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్‌కు సహకరిస్తున్న అన్ని సంస్థలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు, ఆవిష్కర్తలకు అభినందనలు తెలిపారు. అమరావతి క్వాంటం వ్యాలీ ప్రాజెక్ట్ దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## తెలంగాణ పోలీసుల పరిధిలోనే బండి భగీరథ విచారణ

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో సర్ షెడ్యూల్ వచ్చిందని ప్రస్తావించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని తాము తప్పుపట్టడం లేదని అన్నారు. ఓటర్ లిస్టు సరిదిద్దడంలో అందరి బాధ్యత ఉందని తెలిపారు. ఒక్కో పోలింగ్ బూత్ లెవెల్ ఆఫీసర్ ఒక్కో ఇంటికి మూడుసార్లు వెళ్తారని చెప్పారు. ఉద్యోగులపై నమ్మకం లేదు.. రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై నమ్మకం లేదని కిషన్‌రెడ్డి అన్నారు. ముస్లింల మీటింగ్‌కి వెళ్లి.. మీరంతా ముందుకు రావాలని సీఎంగా ఉండి రేవంత్‌రెడ్డి రెచ్చగొడుతున్నారని విమర్శించారు. సర్ చేసేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులేనని.. బీజేపీ కార్యకర్తలు కాదని స్పష్టం చేశారు. సర్‌లో కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ నేతలు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. సర్‌లో ఎక్కడ కుట్ర జరుగుతుందో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చెప్పాలని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ బాధ్యతారహితంగా మాట్లాడుతున్నాయని ఆగ్రహించారు. కేరళం, తమిళనాడులో బీజేపీ గెలవలేదు కాబట్టి అక్కడ సర్ బాగా జరిగిందని అంటున్నారని తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో బీజేపీ గెలిచింది కాబట్టి అక్కడ సర్ తప్పు జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

**పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలి**.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని... ఎలక్షన్ కమిషన్‌పై బురద జల్లవద్దని కిషన్‌రెడ్డి హితవు పలికారు. సర్ కాంగ్రెస్ హయాంలో కూడా జరిగిందని ప్రస్తావించారు. రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు ఉంటే... ఒక్కొక్కరిని వెతికి తొలగించాలని ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. విదేశీయులను తొలగిస్తే రాహుల్‌గాంధీకి వచ్చిన నొప్పేంటని ప్రశ్నించారు. పశ్చిమబెంగాల్‌లో సర్ జరిగినప్పుడు రాష్ట్ర ప్రభుత్వ సిబ్బంది ఉందని.. కేంద్ర సిబ్బంది కాదని తేల్చిచెప్పారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్థాయికి తాను దిగజారనని అన్నారు. బీఆర్ఎస్ మీద కాంగ్రెస్ దొంగ ఓట్లతో గెలిచిందా..? అని ప్రశ్నించారు మాజీమంత్రి కేటీఆర్ రెండుసార్లు గెలిచి మంత్రి అయితే అప్పుడు ఎలక్ట్రానిక్ మిషన్ మంచిదా..? అని నిలదీశారు. ప్రజలు చాలా తెలివైనవాళ్లని చెప్పారు. సర్‌నీ రాహుల్‌గాంధీ వ్యతిరేకించిన.. తెలంగాణలో వాళ్లే పూర్తి చేస్తారని తెలిపారు.

**రైతులను కాంగ్రెస్ మోసం చేస్తోంది**

రెండున్నరేళ్ల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతుల విషయంలో ఎక్కడ వేసినా గొంగళి అక్కడే ఉందని విమర్శించారు. రైతులకు అరకొర రుణమాఫీ.. లక్షలాది మంది రైతులు బ్యాంకుల దృష్టిలో డిఫాల్టర్స్ అయ్యారని చెప్పుకొచ్చారు. ధాన్యం కొనుగోలులో కేంద్రం అండగా ఉన్న... రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు వైఫల్యం చెందుతోందని ప్రశ్నించారు. కనీస మద్దతు ధరను కేంద్రం పెంచిన.. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఎందుకు ఇబ్బంది పడుతుందో అర్థం కాని పరిస్థితి ఉందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఎదురు దాడిపై దృష్టి పెడుతున్నారు తప్ప.. ఎందుకు ఆయా పంటలు కొనుగోలు చేయడం లేదో చెప్పట్లేదని ప్రశ్నించారు.

**సన్నవడ్లకు బోనస్ ఏది..?**

రూ.500 బోనస్ ఇస్తామని రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి పెద్ద పెద్ద ప్రకటనలు చేశారని కిషన్‌రెడ్డి అన్నారు. సన్నవడ్లకు కూడా బోనస్ పూర్తిగా ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. ధాన్యం కొనుగోలులో ప్రతి పైసా కేంద్రం ఇస్తోందని స్పష్టం చేశారు. అన్నదాతకు కావాల్సిన ప్రతి వస్తువును కేంద్రప్రభుత్వమే ఇస్తోందని తేల్చిచెప్పారు. అనేక విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం పచ్చి అబద్దాలు ఆడుతోందని ధ్వజమెత్తారు. వాళ్ల చేతకానీ తనం.. వాళ్ల వైఫల్యం ఇతరుల మీద రుద్ది.. వాళ్లు హీరోలం అవుదామని అనుకుంటున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## అటవీ సంపదను దోచుకుంటున్నారు

మొదటి పేజీ తరువాయి

పౌర హక్కుల ఉద్యమ నేత, ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివాసీల చరిత్ర అంతా పోరాటమయని చెప్పారు. అడవులను కాపాడేందుకు వారు ఇప్పటికీ పోరాటాలు చేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఐక్యత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ హరగోపాల్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట నారాయణ, ఆదివాసీ హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్, ఆదివాసీ సంఘాల నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. ఆదివాసీల పట్ల పాలకులు వివక్ష చూపుతున్నారని అన్నారు. అభివృద్ధి కంటే అణచివేతనే కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి హామీలు ఇచ్చారే కానీ, పాలకులు ఏనాడూ వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. అటవీ సంపదను దోచుకుపోతున్న వారే తప్ప, ఆదివాసీలకు భరోసా ఇచ్చే వారు లేకుండా పోతున్నారని చెప్పారు. ఖనిజ సంపదను తరలించుకుపోతున్నారే కానీ, అడవి బిడ్డల అభ్యున్నతిని విస్మరిస్తున్నారని హరగోపాల్ మండిపడ్డారు. పెట్టుబడిదారులకు పాలకులు కొమ్ముకాస్తున్నారని, ఆదివాసీలను అణచివేతకు గురిచేస్తున్నారని ఆగ్రహించారు. ఆదివాసీలందరూ ఎలాంటి స్వార్థం లేని వారని, అందుకే అడవులు అంతరించిపోకుండా కాపాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ఆదివాసీలు అందరూ సంఘటితమై పాలకులను నిలదీయాలని హరగోపాల్ పిలుపునిచ్చారు

### వయనాడ్‌ను మరిచిపోండంటూ
## రాహుల్, ప్రియాంకపై పోస్టర్లు

**కేరళ, మే 17 :** కాంగ్రెస్ సీనియర్ నేతలను లక్ష్యంగా చేసుకుని కేరళంలోని వయనాడ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సమీపంలో వెలిసిన పోస్టర్లు సంచలనమయ్యాయి. ప్రియాంక గాంధీ వాద్రా నియోజకవర్గమైన వయనాడ్‌లో ఈనెల 13న ఈ పోస్టర్లు వెలిసాయి. తిరువనంతపురం: కాంగ్రెస్ సీనియర్ నేతలను లక్ష్యంగా చేసుకుని కేరళంలోని వయనాడ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సమీపంలో వెలిసిన పోస్టర్లు సంచలనమయ్యాయి. ప్రియాంక గాంధీ వాద్రా నియోజకవర్గమైన వయనాడ్‌లో ఈనెల 13న ఈ పోస్టర్లు వెలిసాయి. ఆ సమయంలో కేరళం తదుపరి సీఎం ఎవరనే సస్పెన్స్ కొనసాగుతోంది. సీఎం అభ్యర్థిగా కేసీ వేణుగోపాల్‌కు వ్యతిరేకంగా ప్రియాంక, రాహుల్ గాంధీకి హెచ్చరికలు ఈ పోస్టర్లలో చోటుచేసుకున్నాయి. మిస్టర్ రాహుల్... కేసీ వేణుగోపాల్ మీకు బ్యాగ్ బ్యారర్ కావచ్చు. కానీ కేరళం ప్రజలు మిమ్మల్ని ఎప్పటికీ క్షమించరు' అని ఒక పోస్టర్‌లో రాసి ఉంది. అలాంటి నిర్ణయమే తీసుకుంటే (కేసీనే ఎన్నుకుంటే) వయనాడ్ మీకు మరో అమేథీ అవుతుంది.. అని 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ అమేథీలో ఓడిపోవడాన్ని పరోక్షంగా మరో పోస్టర్‌లో ప్రస్తావించారు. 'వయనాడ్‌ను రాహుల్, ప్రియాంక మరిచిపోవచ్చు, ఇక్కడి నుంచి మీరు మరోసారి గెలిచే ప్రసక్తే లేదు' అని ఇంకో పోస్టర్‌లో రాసి ఉంది.
**కేసు నమోదు :** సీసీటీవీ పుటేజ్ ఆధారంగా ఒక వ్యక్తి గోడలకు పోస్టర్ అంటించినట్టు గుర్తించామనీ, అతన్ని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. వయనాడ్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.సిద్ధిఖ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసారు. కేరళం తదుపరి సీఎం ఎవరనే సస్పెన్స్ మే 4వ నుంచి కొనసాగుతూ వచ్చింది. కేరళంలోని 140 సీట్లలో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ 102 సీట్లు గెలుచుకుంది. సీఎం అభ్యర్థి విషయంలో కేసీ వేణుగోపాల్, గత అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్, పార్టీ సీనియర్ నేత రమేష్ చెన్నితాల మధ్య పోటీ నెలకొంది. అయితే చివరకు సతీశన్‌ను సీఎం అభ్యర్థిగా మే 14న కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడంతో సస్పెన్స్‌కు తెరపడింది.

## మాస్కోపై డ్రోన్ దాడిలో భారతీయ కార్మికుడు మృతి

**ముగ్గురికి గాయాలు**

**ధృవీకరించిన భారతీయ ఎంబసీ**



**వుదయం డెస్క్, మే 17 :** మాస్కో ప్రాంతంలో జరిగిన డ్రోన్ దాడిలో ఒక భారతీయ కార్మికుడు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారని రష్యాలోని భారత రాయబార కార్యాలయం ఆదివారం ధృవీకరించింది. గాయపడిన కార్మికులను రాయబార కార్యాలయ అధికారులు ఆసుపత్రిలో పరామర్శించారని ఆ కార్యాలయం తెలిపింది. ఈరోజు ఉదయం మాస్కో ప్రాంతంలో జరిగిన డ్రోన్ దాడిలో ఒక భారతీయ కార్మికుడు ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు గాయపడ్డారు. రాయబార కార్యాలయ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి, ఆసుపత్రిలో గాయపడిన కార్మికులను పరామర్శించారు, అని రాయబార కార్యాలయం ఎక్స్‌పై చేసిన ఒక పోస్ట్‌లో పేర్కొంది. ప్రాణనష్టం పట్ల రాయబార కార్యాలయం సంతాపం వ్యక్తం చేస్తోంది. కార్మికులకు అవసరమైన సహాయాన్ని అందించడానికి కంపెనీ యాజమాన్యం, స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తోంది, అని అది తెలిపింది. రాత్రికి రాత్రే ఉక్రెయిన్ దాదాపు 600 డ్రోన్ దాడులకు పాల్పడిందని, ఈ దాడుల్లో నలుగురు మరణించినట్లు సమాచారం అందిందని రష్యా చెప్పిన కొన్ని గంటల తర్వాత ఈ నిర్ధారణ వెలువడింది. ఉక్రెయిన్‌పై రష్యా కొనసాగిస్తున్న దాడులకు ప్రతిగా జరిపిన ఈ కాల్పుల వర్షం పూర్తిగా సమర్థనీయమైనదని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ అభివర్ణించారు.

## యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లో అగ్నిప్రమాదం

మొదటి పేజీ తరువాయి



ప్లాంట్‌లోని యూనిట్–3 పరిధిలోని టర్బైన్ డ్రైవెన్ బాయిలర్ ఫీడ్ పంప్ ఏరియాలో ఆదివారం ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు, ఇంజినీర్లు భయాందోళనలకు గురయ్యారు. పంప్ వద్ద ఉన్న లూబ్రికేషన్ ఆయిల్ లీకేజీతోనే ఈ మంటలు అంటుకున్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. చమురు లీకేజీ కారణంగా మంటలు వేగంగా వ్యాపించడంతో ప్లాంట్ ఆవరణ అంతటా దట్టమైన నల్లటి పొగ అలుముకుంది. ప్రమాద తీవ్రతకు పంప్ పరిధిలోని కంట్రోల్ కేబుల్స్, కొన్ని కీలకమైన వాల్వ్‌లు పూర్తిగా కాలిపోయాయి. అయితే, అక్కడే ఉన్న అగ్నిమాపక యంత్రాలు, ప్లాంట్ సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపు చేయడంతో ప్రధాన యంత్రాలకు (మెయిన్ టర్బైన్లు, బాయిలర్లు) ఒక భారీ ముప్పు తప్పింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న జెన్‌కో ఉన్నతాధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, నష్ట తీవ్రతను అంచనా వేసేందుకు మరియు ప్రమాద గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు అంతర్గత దర్యాప్తుకు ఆదేశించారు

### కేబుల్ బ్రిడ్జిపై 100 కి.మీ వేగంతో
## డివైడర్‌ను ఢీకొట్టిన కారు

**హైదరాబాద్, మే 17 (వుదయం ప్రతినిధి) :** కేబుల్ బ్రిడ్జిపై ఆదివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. అతి వేగంగా వెళ్లిన ఓ కారు.. డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో కారు 100 కి.మీ వేగంతో ప్రయాణిస్తున్నట్లు తెలుస్తోంది. ఎయిర్ బ్యాగ్స్ తెరచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాద సమయంలో బ్రిడ్జిపై ఇతర వాహనాలేవీ లేకపోవడంతో ప్రమాద తీవ్రత తగ్గింది.



## మొయినాబాద్ జంట హత్యల కేసులో నిందితురాలు ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్, మే 17 (ఎఎంస్) :** మొయినాబాద్ జంట హత్యల కేసులో ప్రధాన నిందితురాలు కరీమాబేగం ఆత్మహత్యాయత్నం ఘటన కలకలం రేపింది. ఆబేదా బేగం, మహబూబాబీ.. తాండూరు పట్టణం ఇందిరమ్మ కాలనీలో ఉండే దంపతులు కరీమాబేగం, రెహమాన్, వీరి బంధువు నయీంకు వేర్వేరుగా కొంత డబ్బు అప్పుగా ఇచ్చారు. చాలారోజులు అవడంతో డబ్బులు తిరిగివ్వాలని వారిపై మహిళలిద్దరూ ఒత్తిడి తెచ్చారు. దీంతో వారిని చంపేయాలని కరీమాబేగం, రెహమాన్, నయీం పథకం వేశారు. డబ్బు ఇస్తామని నమ్మించి ముందుగా మహబూబాబీని మొయినాబాద్ సమీపంలోని తోల్కట్ట ఫాంహౌస్ వద్దకు తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేసి, అక్కడే గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఆ తరువాత ఆబేదాబేగంను కూడా అక్కడికే తీసుకెళ్లి అదేరీతిలో హత్య చేసి పాతిపెట్టారు. ఈ కేసులో కరీమాబేగంను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆదివారం కరణ్‌కోట్ పీఎస్‌లో విచారిస్తుండగా.. బాత్రూమ్‌కు వెళ్లిన ఆమె ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించారు. హుటాహుటిన ఆమెను చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

### 61 మంది మహిళలపై
## లైంగిక వేధింపులు
### భారతీయుడికి 13ఏళ్ల జైలు

**హైదరాబాద్, మే 17 (ఎఎంస్) :** లైంగిక వేధింపుల కేసులో ఆస్ట్రేలియాలో భారత సంతతికి చెందిన ఓ వ్యక్తికి 13 ఏళ్ల జైలు శిక్ష విధించారు. అంతర్జాతీయ మీడియా సంస్థల కథనం మేరకు భారత సంతతికి చెందిన 39 ఏళ్ల సుమిత్ సతీష్ రస్తోగి అనే వ్యక్తి 2011లో ఢిల్లీ నుంచి ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు. అక్కడ అడిలైడ్‌లో మసాజ్ థెరపిస్ట్‌గా విధులు నిర్వహించేవాడు. మసాజ్ కేంద్రంలో 2021 అక్టోబర్ నుంచి 2022 జులై మధ్య అతడి మసాజ్ సెంటర్‌కు వచ్చిన 61మంది మహిళలను లైంగికంగా వేధించాడు. 55మంది మహిళల ప్రైవేటు వీడియోలు రహస్యంగా రికార్డ్ చేశాడు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.సరైన పత్రాలు లేకుండానే సుమిత్ మసాజ్ సెంటర్‌ను నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నాటి నుంచి ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది. నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో తాజాగా దక్షిణ ఆస్ట్రేలియా జిల్లా కోర్టు అతడికి 13ఏళ్ల 10 నెలలు జైలు శిక్ష విధించింది.

## కొనుగోళ్లలో తెలంగాణ ప్రభుత్వం విఫలం

**బీజేపీ శాసనసభపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**హైదరాబాద్, మే 17 (వుదయం ప్రతినిధి) :** వరి, మొక్కజొన్న, జొన్న కొనుగోళ్లలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని బీజేపీ శాసనసభపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. పంటల కొనుగోళ్లు చేయకపోవడంతో ప్రతిరోజూ రైతులు ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు కనీసం 40శాతం కూడా పంటల కొనుగోళ్లు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. గురువారం నిర్మల్ జిల్లాలో రైతు ధర్నాలో మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. పంట కొనుగోళ్లలో జాప్యంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అకాల వర్షాలతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటలకు.. వాస్తవ పరిస్థితికి పొంతన లేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గన్నీసంచులను కూడా సరఫరా చేయలేని దీనావస్థలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని పూర్తి మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమ, తరుగు పేరిట రైతులను దగా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మహేశ్వర్ రెడ్డి కోరారు.

# బీపీ చెక్ చేసుకో... సైలెంట్ కిల్లర్‌ను ఓడించు

**మీ రక్తపోటును క్రమం తప్పకుండా పరీక్షించుకోండి... ఈ నిశ్శబ్ద హంతకుడిని ఓడించండి – ఔనూ పిలుపు"**



సూర్యాపేట జిల్లా మే 17(వుదయం):ప్రపంచ ఆరోగ్య సంస్థ, వరల్డ్ హైపర్‌టెన్షన్ లీగ్ పిలుపునిచ్చిన "కలిసికట్టుగా అధిక రక్తపోటును నియంత్రించండి: మీ రక్తపోటును క్రమం తప్పకుండా పరీక్షించుకోండి, ఈ నిశ్శబ్ద హంతకుడిని ఓడించండి" అనే నినాదంతో ఈ సంవత్సరం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని మే 17.05.2026 నజీబుల్లా స్టయిల్‌లో పట్టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గిరి నగర్ నందు అవగాహన సమావేశం నిర్వహించడం జరుగుతుందని జిల్లా వైద్య మరియు ఆరోగ్యాధికారి డా. పెండెం వెంకట రమణ, ఎంబీబీఎస్, డీసీహెచ్తెలిపారు.

**డీఎంహెచ్‌వో కీలక సూచనలు:**

1. ప్రతి ఒక్కరూ నిరంతరం రక్తపోటును పరీక్షించుకోవాలి. ముఖ్యంగా లి30 సంవత్సరాలు పైబడిన వారు సమీప ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు ఆరోగ్య ఉపకేంద్రాలలో ఉచితంగా అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు.
2. నియంత్రణ చిట్కాలు: ఉప్పు అధికంగా ఉన్న ఆహార పదార్థాలను తగ్గించడం, నడక-నిత్య వ్యాయామం చేయడం, ధూమపానం మరియు మద్యపానానికి దూరంగా ఉండడం, ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా రక్తపోటును నియంత్రించవచ్చని తెలిపారు.
3. ఉచిత మందులు: అన్ని ఆరోగ్య కేంద్రాలయందు రక్తపోటు సంబంధించిన మందులు ఉచితంగా అందజేయబడుతాయని, వైద్యుల సలహా, సూచనల ప్రకారం ప్రతి రోజు వాడాలని తెలియజేశారు. 4. ఆశా కార్యకర్తల పాత్ర: సంబంధిత ఆరోగ్య సిబ్బంది క్రమం తప్పకుండా మందులతో పాటు పాలో అప్ చేస్తూ, తరుచుగా రక్తపోటు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. 5. హెచ్చరిక: అవసరమైన వారిని వైద్యుని సలహా కొరకు ఉన్నత స్థాయి ఆసుపత్రికి రిఫర్ చేయాలన్నారు. నాణ్యమైన జీవితం కల్పించటం మానవుడి బాధ్యత అని జిల్లా వైద్య మరియు ఆరోగ్యాధికారి డా. పెండెం వెంకట రమణ సూచించారు.



# భద్రాచలం కేంద్రంగా ఆదివాసి న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

**మే 24న వాజేడు "ఆదివాసి మహా గర్జన" సదస్సును జయప్రదం చేయాలని పిలుపు**

భద్రాచలం, మే 17 (వుదయం ప్రతినిధి):ఆదివాసుల హక్కుల పరిరక్షణ, రాజ్యాంగబద్ధ రక్షణలు, భూహక్కులు, ఉద్యోగ అవకాశాలు, రిజర్వేషన్ల సాధనలో న్యాయ విద్య కీలక పాత్ర పోషిస్తుందని, అందుకే భద్రాచలం కేంద్రంగా ప్రత్యేక ఆదివాసి న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గోండ్వానా సంక్షేమ పరిషత్ (జిఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం భద్రాచలంలో జిఎస్పీ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించగా, ఆదివాసి నాయకులు, యువత, విద్యార్థులు, ప్రజా సంఘాల ప్రతినిధులు భారీగా పాల్గొన్నారు. సమావేశంలో మాట్లాడిన పూనెం సాయి దొర ఆదివాసి సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

షెడ్యూల్ ప్రాంతమైన భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులు ఇప్పటికీ ప్రాథమిక హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భూములు, అడవులు, నీటి వనరులు, ఉద్యోగ అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అనేక అంశాల్లో ఆదివానులు వివక్షకు గురవుతున్నారని ఆరోపించారు. ఈ సమస్యలన్నింటికీ చట్టపరమైన అవగాహనతోనే సమాధానం లభిస్తుందని, అందుకే ఆదివాసి యువతకు న్యాయ విద్య అందుబాటులోకి రావాలని అన్నారు. భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు అయితే ఏజెన్సీ ప్రాంత యువత దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే ఉన్నత విద్య అభ్యసించే అవకాశం లభిస్తుందని తెలిపారు. ముఖ్యంగా పేద ఆదివాసి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల న్యాయ విద్యను కొనసాగించలేకపోతున్నారని, స్థానికంగా కళాశాల ఏర్పాటు అయితే వందలాది మంది విద్యార్థులకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన చట్టాలు, 1/70 చట్టం, పజుూూా, అటవీ హక్కుల చట్టం, రిజర్వేషన్ చట్టాలు, జీవోలు వంటి అంశాలపై అవగాహన లేకపోవడంతో ఆదివానులు మోసపోతున్నారని, న్యాయ విద్య అభ్యసించిన ఆదివాసి యువత సమాజానికి రక్షణ కవచంలా మారతారని అన్నారు. భూముల ఆక్రమణలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ నిర్లక్ష్యం వంటి అంశాలపై చట్టపరమైన పోరాటాలు చేయడానికి ఆదివాసి న్యాయవాదులు అవసరమని స్పష్టం చేశారు. భద్రాచలం వంటి చారిత్రాత్మక, ఆధ్యాత్మిక, ఏజెన్సీ ప్రాంతానికి విద్యా పరంగా సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలలు, న్యాయ కళాశాలలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసి యువత, విద్యార్థులు, మహిళలు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజ భవిష్యత్తు కోసం జరిగే ఈ ఉద్యమంలో ప్రతి ఆదివాసి భాగస్వామి కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిఎస్పీ నాయకులు పూనెం ప్రతాప్, పూనెం వరప్రసాద్, సుధాకర్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



# మండల కాంగ్రెస్ అధ్యక్షుడిని ఘనంగా సన్మానించిన నాయకులు, కార్యకర్తలు

చర్ల ,మే 17(వుదయం):చర్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ చీమలమర్రి. మురళీ కృష్ణ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి కృష్ణ మాట్లాడుతూ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మి, బట్టి. విక్రమార్క, తుమ్మల. నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తెల్లం. వెంకట్రావు సిఫార్సు మేరకు మండల అధ్యక్ష పదవి ప్రకటించడం జరిగిందని. ఫార్టీ లో పదవులు ఒక్కరికే వస్తాయని, విధ్యార్ధి దశ నుంచి ఫార్టీ ని అంటి పెట్టుకున్న విజయ్ నాయుడు మండల అధ్యక్ష పదవి అర్హుడని జిల్లా ఫార్టీ గ్రహించింది కాబట్టే మండల అధ్యక్ష పదవి రావడం జరిగిందని తెలిపారు. ఫార్టీ అభివృద్ధి కోసం కష్టపడాలని, తారతమ్య భేదం లేకుండా అందరితో కలిసినప్పుడే ఫార్టీ కి మంచి రోజులు వస్తాయని ఈ సందర్భంగా తెలిపారు. చర్ల మండలంలో ఉన్న 26 పంచాయతీలో ఉన్న గ్రామాలను తిరిగి గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, రానున్న జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ నాకు ఈ పదవి రావడానికి కారణం అయిన పెద్దలు అందరికీ ఋణపడి ఉంటానని నా రాజకీయ గురువైన దుర్గా ప్రసాద్ తో పాటు నావెన్నంటే ఉన్న సహకరించిన చీమలమర్రి. మురళీ కృష్ణ సీనియర్ నాయకులు బండారు. రామకృష్ణ, జవ్వాది. రవికుమార్ లకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేసిన నాయుడు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుబాటులో ఉండి అందేలా చేస్తానని త్వరలో గ్రామ కమిటీ లు వేస్తానని కష్ట పడి ఫార్టీ కోసం పనిచేస్తున్న నాయకులను, కార్యకర్తలను గుర్తించి వారికి పదవులు వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చిన మండల అధ్యక్షుడు. అనంతరం మండల అధ్యక్షుడిని ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోలిన. లంక రాజు, ముమ్మినేని అరవింద్, దేవరపల్లి వఘ ఎంపిటిసి, బ్రహ్మానంద రెడ్డి,పాలెం. ఆలెం. ఈశ్వర్, బోళ్ళ. వినోద్ ఫార్టీ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు

# ఎఫ్‌సెట్‌లో రేస్ విద్యార్థుల సత్తా



కోదాడ మే 17(వుదయం):ఎఫ్‌సెట్ ఫలితాల్లో రేస్ కాలేజీ విద్యార్థులు మెరిశారు. పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. మొక్కా చరణ్ సాయి 380, ఐ.కృష్ణ చరణ్ 440, సిహెచ్ భాను శంకర్ 1775, డి విజయ్ చరణ్ 2135, సిహెచ్ ఉత్తేజ్ 5231, లేఖనా రెడ్డి 6749, కురువ నవీన్ 7354, వంగవీటి అక్షయ 8462, వెంకటదత్త కిరణ్ 9748 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కాలేజీ చైర్మన్ బాణాల వసంత రెడ్డి విద్యార్థులను అభినందించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# పశు ఔషధ బ్యాంక్‌కు దాతల సహకారం



కోదాడ ,మే 17(వుదయం):కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో నిర్వహిస్తున్న పశు ఔషధ బ్యాంక్‌కు దాతలు అందించిన సహకారం అభినందనీయమని అసిస్టెంట్ డైరెక్టర్ డా. పి.పెంటయ్య తెలిపారు. రూ.16 వేల విరాళాలతో డిస్కౌంట్ విధానంలో సుమారు రూ.70 వేల విలువైన శస్త్రచికిత్స పరికరాలు, అత్యవసర ఔషధాలు సేకరించినట్లు చెప్పారు. డా. మాడుపల్లి రవికుమార్, డా. అఖిల దంపతులు రూ.10 వేలు, ఈఈ చలమల్ల వెంకటలక్ష్మారెడ్డి రూ.5 వేలు, ఉపాధ్యాయుడు కుడుముల ఉపేంద్రయ్య రూ.1,000 విరాళం అందించారు. కార్యక్రమంలో డా. కే.వీరారెడ్డి, పోటు వెంకటేశ్వరరావు, రాజు, చంద్రకళ పాల్గొన్నారు.

# బిఎస్పి మండల అధ్యక్షుడు గా పాయల మోహన్ రావు నియామకం



చర్ల ,మే 17(వుదయం):చర్ల మండలం లోని సింగ సముద్రం గ్రామంలో బహుజన్ సమాజ్ పార్టీ మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. భద్రాచలం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, చర్ల మండల ఇన్ చార్జ్ చెన్నం మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దార్థ పూలే ,నియోజకవర్గ అధ్యక్షుడు కొప్పుల నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు కొప్పుల నారాయణ చర్ల మండల కమిటీ ని నియమించడం జరిగింది. మండల అధ్యక్షులుగా పాయల మోహన్ రావు ఉపాధ్యక్షులుగా ధ్రువ నర్సింహా రావు, ప్రధాన కార్యదర్శి చాపా భాస్కర్ రావు, కార్యదర్శి కాకా నర్సయ్య, కోశాధికారిగా పర్సిక చిన్నబ్బి లను నియమించడం జరిగింది. అనంతరం ఈ సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా ఉపాధ్యక్షులు యాసం సిద్దార్థపూలే మాట్లాడుతూ చర్ల మండలంలో ఉన్న పోలింగ్ బూత్ సెక్టార్ కమిటీలను, పోలింగ్ బూత్ కమిటీ లను నిర్మాణం చెయ్యడం జరిగిందని తెలిపారు . ఏర్పాటు చేసిన కమిటీలు రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా బహుజన్ సమాజ్ పార్టీ సిద్ధాంత పరమైన క్యాడర్ క్యాంపు నిర్వహించుటకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తడికల శివకుమార్, బొగ్గుల శ్రీరాములు. సోయం.శ్రీ రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు

# ఆర్థిక సహాయం కోసం ఎదురుచూపులు



చిలుకూరు మే 17:( వుదయం): మండల కేంద్రానికి చెందిన హెల్పింగ్ హాండ్స్ మెగా బ్లడ్ డొనేషన్ సంస్థల వ్యవ స్థాపకుడు కస్తూరి సురేష్ ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నాడు, ఇప్పటివరకు తాను ఎబి ప్లస్ బ్లడ్ ని 24 సార్లు డొనేట్ చేసి ఇంకా ఎవరైనా బ్లడ్ కావాలి అన్న కానీ డొనేట్ చేపిస్తున్నారు ఇంకా పేద కుటుంబం వారు హాస్పటల్లో డబ్బులకి ఇబ్బంది పడే వారికి మెగా బ్లడ్ డొనేషన్ ట్రస్టు మరియు హెల్పింగ్ హాండ్స్ ట్రస్టు అని రెండు వాట్సాప్ గ్రూపులను స్థాపించి గత ఎనిమిది సంవత్సరాల నుండి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తూ ఎంతో కొంత సహాయం అందించారు, సురేష్ కి పెద్ద ఆపద వచ్చింది ప్రస్తుతం హైదరాబాదులో నిమ్స్ హాస్పటల్లో చికిత్స పొందుతున్నాడు, అతని గుండెనుండి తన ఎడమ కాలు వరకు బ్లడ్ సర్కులేట్ కావడం లేదు చికిత్స జరుగుతుంది ఇప్పటివరకు 170000 ఖర్చు పైగా అయ్యింది ఇంకా లక్షల్లో వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది, చేతిలో చిల్లి గవ్వ లేకపోవడంతో కస్తూరి సురేష్ సరిత తమను ఆదుకోవాలని కోరారు,సహాయం చేసిన చేతులే ఇప్పుడు సహాయం కోసం ఎదురు చూస్తున్నారు, వైద్యం కోసం దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు సాయం చేయదలచిన వారు 9705715332 నెంబర్కు ఫోన్ పే చేయాలని కోరుతున్నారు,

# మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఉచిత చల్లటి త్రాగునీటి సేవలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,మే 17 (వుదయం ప్రతినిధి):వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో రామవరం జామియా మసీదు కమిటీ సభ్యులు మానవత్వాన్ని చాటుతూ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఉచిత చల్లని మంచినీటి సేవలను అందిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల కోసం వచ్చే ప్రజలు, రోగులు, వారి బంధువుల కోసం కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా చల్లని ప్యూరిఫైయర్ వాటర్ క్యాన్లను ఏర్పాటు చేశారు. గత కొన్ని రోజులుగా రోజుకు సుమారు 40 క్యాన్ల చల్లని నీటిని అందుబాటులో ఉంచుతూ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. అలాగే నీటి సరఫరా పర్యవేక్షణ కోసం ఒక సహాయకుడిని కూడా నియమించారు.

ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సేవలను అందిస్తున్నారు. మండుతున్న ఎండల్లో ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఉచితంగా చల్లని నీరు అందడంతో పలువురు కమిటీ సభ్యుల సేవా భావాన్ని అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, "ఎండాకాలం పూర్తయ్యేంతవరకు ఈ ఉచిత సేవ కొనసాగిస్తాం. మానవ సేవే మాధవ సేవ అనే భావంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. ఖురాన్‌లో చెప్పినట్లు భూమిపై ఉన్న వారిపై మీరు కరుణ చూపండి నేను మీపైన కరుణ చూపెడతాను సందేశాన్ని నమ్మి ఆచరణలో చూపించడమే మా ఉద్దేశం" అని తెలిపారు.

# ప్రాణాపాయంగా ఉంది

**బెనిఫిట్స్ డబ్బులు ఇవ్వండి ఆదుకోండి.!!**
**విలేకరుల సమావేశంలో రిటైర్డ్ హెచ్ఎం చెరుకుపల్లి వెంకయ్య ఆవేదన**



ఖమ్మం వుదయం బ్యూరో మే 17: ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ సంవత్సరం క్రితం పదవి విరమణ పొందిన తనకు ప్రాణాపాయ ఏమైనా క్యాన్సర్ తో పాటు ఇతర అనేక వ్యాధులు వ్యాపించాయని, చేతిలో చిల్లి గవ్వ లేక, ప్రభుత్వం నుంచి రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ డబ్బులు రాక చికిత్స చేయించుకునే పరిస్థితి లేకుండా పోయిందని రిటైర్డ్ హెచ్ఎం చెరుకుపల్లి వెంకయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట జడ్పీ జిహెచ్ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ సంవత్సర కాలం క్రితం రిటైర్మెంట్ అయ్యానని, రిటైర్మెంట్ అనంతరం ప్రభుత్వం నుంచి రావాల్సిన అనేక రకాల బెనిఫిట్స్ డబ్బులు దాదాపు 60 లక్షలు రావాల్సి ఉందని, నేటికీ కూడా డబ్బులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తన ఆరోగ్యం బాగోలేదని, గుండెకు రక్తప్రసరణ సక్రమంగా లేక రెండు స్టంట్ లు వేశారని, ఇవి కాక ఫ్యాంక్రియా , క్యాన్సర్ తోపాటు అనేక వ్యాధులు వ్యాపించినట్లు డాక్టర్లు నిర్ధారించడం జరిగిందని తెలిపారు. తన వద్ద ఉన్న డబ్బుతో చికిత్స కు ఖర్చు చేయడం జరిగిందని, ప్రస్తుతం క్యాన్సర్ కు, ఇతర వ్యాధులకు చికిత్స చేయాలంటే వైద్యులు దాదాపు 10 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపినట్లు వెల్లడించారు. హైదరాబాద్ లోని అనేక ఆసుపత్రులలోను ఖమ్మంలోని పలు ఆసుపత్రులలో చికిత్స కోసం వైద్యులను సంప్రదించటం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్నానని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, డీఈవో ఇతర ఉన్నతాధికారులు స్పందించి తనకు రావాల్సిన బెనిఫిట్స్ డబ్బులను సకాలంలో ఇప్పించి చికిత్సకు కావాల్సిన డబ్బులను అందించి తనకు ప్రాణ బిక్ష పెట్టాలని వేడుకున్నారు. ఈ విలేకర్ల సమావేశంలో ఎం ఆర్ ఇ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి గురు ప్రసాద్, జిల్లా అధ్యక్షులు మాడుపల్లి బాబు, అల్లంకి జయపాల్, ఎం ఈ ఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు తెల్లపూట జమాలయ, ఎం ఈ ఎఫ్ జిల్లా అధ్యక్షులు మేళ్లచెరువు బాబు, ప్రధాన కార్యదర్శి కోటపింజర రాము, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెరుకుపల్లి మురళి, కోశాధికారి దూరి జయరాజు, ప్రచార కార్యదర్శి తెల్లూరి యాదగిరి, టి జి పి ఓ ఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మన్నె గురుమూర్తి, ఎం ఈ ఎఫ్ జిల్లా జాయింట్ సెక్రెటరీ కోట ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఉచిత నిత్యవసర సరుకులు పంపిణి

**స్మైల్ ఆల్వేస్ ఫౌండేషన్ సభ్యులు**



దమ్మపేట మే (వుదయం ప్రతినిధి ):స్మైల్ ఆల్వేస్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మారుమూల గిరిజన గ్రామమైన పూసుకుంట ప్రాంతంలోని సుమారు 10 గ్రామాలలోని 400 కుటుంబాలకు ఉచితముగా 15 రోజులకు సరిపడ నిత్యవసర సరుకులు అయిన బియ్యం, పప్పులు, ఉప్పు, కారం పొడి, పసుపు, నూనె సామాగ్రిని పంపిణి చేయడమైనది. ఈ కార్య క్రమంలో సంస్థ ప్రెసిడెంట్ శ్రీ కోడి సుదామనుడు మాట్లాడుతూ గత కోవిడ్ సమయం నుండి ఈ ప్రాంత పేద గిరిజనులకు ప్రతి సంవత్సరం వేసవి కాలంలో మరియు వర్ష కాలంలో సహాయం చేస్తూ వస్తున్నాము. ఈ సహాయం వారికి ఆకలిని తీర్చడం కోసం, ఆరోగ్యాన్ని కాపాడటం కోసం ఎంతో ఉపయోగకరముగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రోగ్రాం – డైరెక్టర్ శ్రీ డా టి సైలస్ పాల్ మాట్లాడుతూ ఎంతో దూరం అయిన హైదరాబాద్ నుండి ప్రతి సంవత్సరం రెండు ,మూడు సార్లు ఈ ప్రాంత గిరిజను ప్రజలకు ఈ విధంగా సహాయం చేయడం మాకు ఎంతో సంతోషాన్నిస్తుంది అని తెలిపారు. స్థానిక ప్రతినిధి శ్రీ వెంకటేశ్వర్లు (ఎలీషా) మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఈ విధంగా గొప్పగా జరగడం ఒక పండుగలాగా అనిపిస్తుంది అని, సహాయం అందుకున్న వారి తరపున సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా ఇంకా మంచినీటి బోర్లు, నివాసాలు ఏర్పాటు చేసి ప్రజల కష్టాలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ శ్రీ కాడి సుధామనుడు, సైలస్ పాల్, వెంకటేశ్వర్లు ఎలీషా, కెవిన్. తదితరులు పాల్గొన్నారు.

ఉష
వుదయం సాహిత్యం

# నీటి కుండలాంటి మనిషి

# కపట నాగరికతపై ఒక తాత్విక ధిక్కారం

కాలం ఒక కసాయి కత్తిలా మనిషి సున్నితత్వాన్ని కోసేస్తున్న దారుణమైన వర్తమానం మనది. బతుకంటే ఒక వ్యాపారంగా, ప్రాణమంటే కేవలం ఒక ఆర్థిక లెక్కగా మారిపోయిన ఈ కాంక్రీటు అరణ్యంలో మనిషిని మనిషిగా నిలబెట్టే ఒక ఆర్తనాదం, ఒక వెచ్చని ఆలింగనం ఈ కవిత్వం. కవిత్వం కేవలం అక్షరాల గారడీ కాదు, అది ఎండిపోతున్న గుండెల్లోకి జీవజలాన్ని వంపే ఒక నిశ్శబ్ద ప్రక్రియ. ఆ ప్రక్రియకు ప్రాణం పోసిన అక్షర జలపాతమే ఈ "నీటికుండ లాంటి మనిషి". ఈ శీర్షికలోనే ఒక పెద్ద తాత్విక భూకంపం ఉంది. మనిషిని ఉక్కుపాదంలా, దేన్నీ లెక్కచేయని అజేయుడిలా కీర్తించే ఆధునిక భ్రమల నుంచి బయటకు లాగి, వాడి అసలు నైజాన్ని ఒక పగిలిపోయే 'నీటికుండ'తో పోల్చడం వెనుక అపారమైన జీవిత సత్యం దాగి ఉంది. నీటికుండ అంటే ఏమిటి? మట్టిని, మంటను, నీటిని తనలో కలుపుకుని ప్రాణం పోసుకున్న ఒక మట్టి పొర. అది లోపల దాహాన్ని తీరుస్తుంది, చల్లదనాన్ని ఇస్తుంది, కానీ బయటనుంచి ఒక చిన్న రాయి తగిలినా ముక్కలైపోతుంది. ఆధునిక మనిషి బతుకు కూడా సరిగ్గా అంతే! బయటకి కనిపించే బిగువు వెనుక, లోపల ఎప్పుడూ ఛిద్రమైపోవడానికి సిద్ధంగా ఉండే ఒక దయనీయమైన సున్నితత్వం దాగి ఉంది. ఈ కవిత్వం ఆ సున్నితత్వాన్ని పట్టుకుంది. గాయపడిన ఆ నీటికుండ అంచుల్ని తన కవిత్వపు వేళ్ళతో అత్యంత ఆర్ద్రంగా స్పృశించింది.

ఈ అక్షరాల వెనుక ఉన్న సుంకర గోపాలయ్య ఆడంబరాలకు, మేధోపరమైన జిమ్మిక్కులకు పోయిన కవి కాదు. అతను ఎంచుకున్న వస్తువు వెనుక అంతులేని నెత్తుటి తడి ఉంది. కవిగా ఆయన సామాజిక వాస్తవికతను ఒక కఠినమైన న్యాయనిర్ణేతలా కాకుండా, లోతైన మానవత్వపు దయతో చూశాడు. సమాజంలో జరుగుతున్న విధ్వంసాన్ని చూసి అతను వివాదాలు సృష్టించలేదు, కన్నీరు కార్చాడు. అందుకే అతని కలం నుంచి జారే ప్రతి వాక్యం పాఠకుడి నెత్తిమీద పడే కఠినమైన సుత్తి దెబ్బ కాదు, నిద్రపోతున్న గుండె తలుపుల్ని బద్దలుకొట్టే ఒక నిశ్శబ్దపు కేక. ఇందులోని వస్తువు ఒకే మూసలో పోసినది కాదు. అది గాలికీ, నేలకూ మధ్య ఉన్న ఖాళీని పూరించే ఒక నిరంతర అన్వేషణ. ఒకవైపు మాతృత్వాన్ని కేవలం పాలిచ్చి పెంచే యంత్రంగా కాకుండా, బిడ్డ నరాల్లోకి 'ప్రాణాన్ని' ఎక్కించే ఒక అద్భుత శక్తిగా ఆయన దర్శించిన తీరు సామాన్యమైనది కాదు. మరోవైపు, అడవుల్ని, అడవి బిడ్డల స్వేచ్ఛను మింగేస్తున్న వ్యవస్థల పట్ల రగిలే ఆగ్రహం ఇందులో అంతర్లీనంగా ప్రవహిస్తుంటుంది. ఒకప్పుడు యుద్ధం అంటే సరిహద్దుల్లో జరిగేది, కానీ ఇప్పుడు అది మనిషి ఇంటి ముందు, వాడి బతుకులోకి చొరబడి ఒక రోజువారీ 'వ్యాపారం'గా మారిపోయిన వైనాన్ని ఈ కవితలు నగ్నంగా నిలదీస్తాయి.

మనిషి తన మూలాలను, నేల భాషను కోల్పోయి యాంత్రికంగా బతుకుతున్న ఈ వేళ, "నీ లోపల ఒక పచ్చని తోట ఉంది, దాన్ని వెతుక్కో" అని కవి పదే పదే గుర్తుచేస్తాడు. ఇది కేవలం ప్రకృతి వర్ణన కాదు, విధ్వంసం అంచున నిలబడ్డ మానవ ప్రపంచానికి కవి ఇస్తున్న ఒక వాగ్దానం. మనిషి తన తోటి మనిషితో, చెట్టుతో, గాలితో, అడవితో ఎలా బతకాలో నేర్పే ఒక నిశ్శబ్ద పోరాటం. చలం మాటల్లో చెప్పాలంటే, యోగ్యతా పత్రం అనేది కవికి ఇచ్చే సర్టిఫికెట్ కాదు, అది పాఠకుడికి చేసే ఒక హెచ్చరిక. ఈ కవిత్వంలోకి అడుగుపెట్టే ముందు పాఠకుడు తన మెదడుకు పట్టిన తుప్పును వదిలించుకోవాలి. ఎందుకంటే, ఇది ఆవేదనల అడవిలో ఒక కవి చేసిన ఒంటరి స్వగతం కాదు, రేపటి మనిషితనం కోసం అతను పంచుతున్న జీవన రసాయనం. ఒక అద్భుతమైన సౌధానికి పునాది రాళ్లు ఎంత పటిష్టంగా ఉండాలో, ఈ 'నీటి కుండలాంటి మనిషి'లోని ఒక్కో కవిత వెనక ఉన్న తాత్విక పునాది అంత బలంగా ఉంది. ఆ పునాదుల మీదుగా ఉప్పొంగిన కవి భావజాలపు ప్రవాహంలోకి దూకి, ఆ అక్షరాల లోతుల్లో కాసేపు మన ప్రాణాన్ని తడుపుకుందాం!

ఒక శిథిలమైన సమాజంలో మనిషి తనను తాను వెతుక్కోవాలంటే, ముందు తన వేళ్లు ఎక్కడ భూమిలో నాటుకున్నాయో అక్కడికి వెళ్లాలి. మూలాలు తెగిపోయిన వాడు కేవలం ఒక యాంత్రికమైన బొమ్మ. ఈ వెతుకులాటలోనే కవి ఒక మహా ప్రయాణం చేశాడు. ఆధునికత పేరుతో మనం పీకిపారేసిన మన మూలాలను ఆయన ఒక తాత్వికునిలా తన మాతృమూర్తిలో, ప్రకృతిలో దర్శించాడు. 'అమ్మ–అడవి' కవితలో కవి తన అస్తిత్వాన్ని ఎంత బలంగా నేలలో పాతుకుంటాడంటే "ఎప్పుడు తొలకరి తొంగి చూసినా / అమ్మ పుట్టినరోజే అనుకుంటాను / వర్షఋతువు నా రక్త సంబంధి" అంటాడు. వాన చినుకును కేవలం నీటి బిందువుగా కాకుండా తన రక్తసంబంధిగా ఫీల్ అయ్యే ఒక అకల్మషమైన ఆదిమ స్వభావం ఇది. స్త్రీకి, ప్రకృతికి మధ్య ఉన్న సృష్టి రహస్యాన్ని ఒకే దారంతో కుడుతూ "అమ్మలందరూ అడవులే / వాళ్ళ మీదనే / ఋతువులు వెల్లివస్తుంటాయ్" అని ముగించినప్పుడు, కవిత్వం ఒక విశ్వరూపం దాలుస్తుంది. తల్లి అంటే కేవలం మాంసపు ముద్ద కాదు అడవి; అడవి అంటే సహనం, ఆ సహనం నుంచే ప్రాణం ఉద్భవిస్తుంది.

సరిగ్గా ఆ ప్రాణ స్పందన కోసం 'పురుడు పోసుకునే సమయం' కవితలోకి నడిస్తే అక్కడ కవి మనల్ని ఒక మహా నిశ్శబ్దపు ఒడిలో పడుకోబెడతాడు. జననం అంటే ఒక కోలాహలం కాదు, అదొక పవిత్రమైన ఏకాంతం. ఆ ఏకాంతపు అంచుల్ని తాకడానికి కవి పడిన తపన అంతా ఇంతా కాదు. "ఆకురాలు కాలం ముగిసింది / భూమి నిశ్శబ్దంగా చిగురిస్తోంది" అంటూ ఒక అద్భుతమైన ప్రకృతి చిత్రాన్ని గీసి, ఆ వెంటనే "ఇద్దరమే ఉన్నాం / ప్రపంచం పురుడుపోసుకుంటోంది" అనే వాక్యంతో ఒక దైవికమైన తన్మయత్వంలోకి పాఠకుడిని విసిరేస్తాడు. మనిషి తన ఉనికిని, తన మూలాలను ఎంత స్వచ్ఛంగా ప్రేమించాలో, ఏ నిశ్శబ్దంలో తనను తాను కలుసుకోవాలో ఈ పంక్తులు ఒక మంత్రంలా బోధిస్తాయి. కానీ, ఇంత స్వచ్ఛమైన ప్రాణం సమాజం అనే కబేళాలోకి అడుగుపెట్టగానే ఏమవుతుంది? ఆ పచ్చని అడవి మీదికి, ఆ చిన్నారి సంతోషాల మీదికి ఆధిపత్యపు గొడ్డళ్లు దాడి చేసినప్పుడు కవి మౌనంగా ఏడుస్తూ కూర్చోడు. అక్కడ అతని గుండెలోంచి ఒక కరకు టమ్ము దూసుకొస్తుంది. 'రాలిన పూల పాఠం' కవిత ఆధునిక మేధావుల కపటత్వం మీద పడ్డ ఒక చెంపదెబ్బ. జీవితం గురించి, ఆదర్శాల గురించి బహిరంగ వేదికలెక్కి ఉపన్యాసాలు దంచే బూటకపు నాయకులను చూసి కవి అసహ్యించుకుంటాడు. వాస్తవానికి దూరమైన ఆ మేధోవిలాసాలను అసహ్యించుకుంటూ "చిన్న చిన్న సంతోషాలు / ఎలా మనిషిని బతికిస్తాయో / వృద్ధ క్షణాలను ఎలా దగ్ధం చేయాలో / ఇట్లాంటి సంగతుల్ని / పాటలు కట్టి పాడితే బాగుణ్ణు" అని గొంతెత్తుతాడు. కవిత్వం అంటే మేఘాల మీద తేలియాడటం కాదు, నేల మీద నలిగిపోతున్న వాడి గుండె చప్పుడు వినడం. అందుకే, వస్తు వ్యామోహంలో పడి అసలు బతుకును కోల్పోతున్న మనిషిని చూస్తూ "పెరిగిన ధరలు గురించో / విరిగిన వెన్నెముక గురించో తెల్లగుడ్డను టెంటుగా వేసి / ఎర్రగా ధర్నా చేస్తే బాగుణ్ణు" అని ఒక పచ్చి నిజాన్ని నిర్భయంగా ప్రకటిస్తాడు.

ఇంట్లో పుట్టిన ఈ అక్షరం ఆరుబయట అడుగు పెడితే ఏమవుతుంది? ఆధిపత్యపు గొడ్డళ్ల చేతిలో లెక్కలేనన్ని సార్లు నరకబడి, నెత్తురోడిన ఈ భూమి మీద మళ్లీ ఆశల విత్తనం ఎలా మొలకెత్తుతుంది? 'జీవకాంతి' కవితలో ఆ ఆశకు ఒక అద్భుతమైన దృశ్యరూపం ఇస్తాడు కవి. "నాట్లు వేస్తున్న స్త్రీలు / పాటలు పాడుతున్నారు / లెక్కతీయలేనన్ని మార్లు / గాయపడ్డ నేల / మరోమారు పురిటి నొప్పులకు / సిద్ధపడుతోంది" వ్యాపార దాహానికి ఈ నేల ఎన్నిసార్లు గాయపడినా, అది తన సృజనను ఆపదు. శ్రమజీవులైన స్త్రీల పాటల సాక్షిగా ఆ భూమి మళ్లీ పురుడు పోసుకునేందుకు సిద్ధపడుతోంది. మనిషి ఎన్నిసార్లు మరణాన్ని విసిరినా, ప్రకృతి 'జీవకాంతి'ని విసురుతూనే ఉంటుందన్న అపారమైన నమ్మకం, ఒక ధిక్కార స్వరం ఈ కవితలో రగులుతూ ఉంటుంది.

తన మట్టి మీద, తన అడవి మీద, తన తోటి మనిషి మీద నిరంతరం జరుగుతున్న ఈ దాడిని చూస్తూ గోపాలయ్యలోని కవి గుండె రగిలిపోయింది. అక్కడ పుట్టింది అగ్ని! 'చెట్టు చెట్టు రాజుకోవాల' అనే కవిత కవి అంతరంగ ప్రయాణంలో బద్దలైన ఒక అగ్నిపర్వతం. నిన్నటి దాకా పచ్చి బాలింతలా ఉన్న అడవి, నేడు వ్యాపార దాహానికి ఎలా బలైపోయిందో చూసి కవి విలవిల్లాడిపోయాడు. "అడవి మీద ఆవరించిన మేఘాలు / రక్తపురంగు తేలి / కట్లు కట్టిన గాయాల్లా ఉన్నాయ్" అన్న వాక్యం చదివితే మన కళ్ల ముందు ఒక ఎర్రటి నెత్తుటి సముద్రం కదలాడుతుంది. తన తల్లి లాంటి అడవి, బిడ్డల్లాంటి చెట్లు నేల రాలిపోతుంటే కవిత్వం కేవలం ఆవేదనగా మిగలలేదు, అది ఆధిపత్యం మీద ఎక్కుపెట్టిన బాణంగా మారింది. ఈ విధ్వంసక చీకటిని తరిమికొట్టాలంటే కన్నీళ్లు సరిపోవు, ప్రాణం నిలబడాలంటే ఒక తిరుగుబాటు కావాలి! అందుకే "చెట్టు చెట్టు రాజుకోవాల / చెదిరిపోయిన పశువుల్ని కూడేసినట్టు / చిమ్మచీకటిని మలెయ్యాల" అంటూ ఒక విప్లవ శంఖాన్ని పూరిస్తాడు.

తన అస్తిత్వాన్ని, తన మూలాలను చెరిపేయాలని చూసే రాక్షస వ్యవస్థ మీద ఒక 'నీటికుండ లాంటి మనిషి' చేసిన ఒక నెత్తుటి తిరుగుబాటు ఇది. ఒక సున్నితమైన మట్టి పెంకు తనను తాను ఒక పదునైన ఆయుధంగా మలుచుకున్న అద్భుతమైన తాత్విక ఘట్టం ఇది!


అయితే, ఈ బాహ్య ప్రపంచపు యుద్ధం ముగిశాక, నెత్తురోడుతున్న తన పాదాలను తీసుకుని మనిషి ఎక్కడికి వెళ్లాలి? విశ్రమించడానికి వాడికి మిగిలిన చోటు ఎక్కడుంది? సమాధానం కోసం కవి తన లోపలికి తవ్వి చూసుకున్నాడు.

అక్కడ అతనికి నెత్తురోడే గాయాలు కనిపించలేదు, ఒక అద్భుతమైన సృష్టి రహస్యం కనిపించింది. ఆ రహస్యమే 'మన లోపలి తోటల్లోకి'. బయట జరుగుతున్న విధ్వంసానికి విలవిల్లాడిన కవి, ఆ గాయాలకి మందు పూయడానికి మనిషికి వాడి అసలు స్వరూపాన్ని పరిచయం చేస్తున్నాడు. ఇరుకు కాంక్రీటు గోడల మధ్య ఊపిరాడక చస్తున్న ఆధునిక మనిషిని పట్టుకుని, వాడు ఒక యంత్రం కాదని, సృష్టిలో ఒక పచ్చని భాగమని వాడి భుజాలు కుదిపేసి మరీ చెబుతున్నాడు. కత్తి దెబ్బ తిన్న మనిషి సేదదీరాల్సిన ఆ తాత్విక స్థావరాన్ని ఎంత అద్భుతంగా దర్శించాడంటే "మనిషి లోపల తోటొకటుంటుంది / కాసేపు నరాల్లో రక్తానికి బదులు / నీళ్లు వెళ్తున్నాయనుకుంటే / అట్లా ఆ నది మీద / దుఃఖాన్ని దాటించే తెప్పలుంటాయ్" ఎంతటి బరువైన ఊరట ఇది! పగతో, ఆవేశంతో, ఉరుకుల పరుగుల ఒత్తిడితో ఉడికిపోయే రక్తపు స్థానంలో ఒక క్షణం చల్లని నీటి ప్రవాహాన్ని ఊహించుకోమంటున్నాడు. మనిషి దేనికోసం అయితే బయట ప్రపంచంలో అడుక్కుంటున్నాడో, ఆ శాంతి అంతా వాడి లోపల నిద్రపోతున్న ప్రకృతిలోనే ఉందన్న ఒక ప్రగాఢమైన సత్యాన్ని కవి ఇక్కడ ఆవిష్కరించాడు. ఎప్పుడైతే మనిషి తన లోపల ఉన్న ఆ సారవంతమైన మట్టిని గుర్తిస్తాడో అప్పుడిక వాడికి బయటి ప్రపంచం చేసే హింసతో పనిలేదు. అందుకే కవి ఒక మహాద్భుతమైన ధిక్కారంతో ఈ భాగాన్ని ముగిస్తాడు – "సతత హరిత మానవత్వపు గింజలు నాటు / నీడలు నీడలుగా అల్లుకో / పోటెత్తే నీ రక్తమిప్పుడు / యుద్ధాల్ని బహిష్కరిస్తుంది" ఇది మామూలు ముగింపు కాదు, ఒక మహా తాత్విక శిఖరం! బయట జరిగే ఆధిపత్యం మీద గొడ్డలెత్తిన కవి, తన లోపలి మానవత్వపు వికాసంతో ఆ యుద్ధాలన్నింటినీ ఒక బుద్ధుడిలా సామూహికంగా బహిష్కరిస్తున్నాడు. తన మూలాల మీద జరిగిన దాడికి, 'నీటికుండ లాంటి మనిషి' ఇస్తున్న అత్యున్నతమైన, నిశ్శబ్దమైన సమాధానం ఇదే! తన లోపలి పచ్చదనాన్ని మేల్కొల్పి, తన నెత్తురుతో యుద్ధాన్ని బహిష్కరించాలని మనిషి ఎంత శాంతిని కోరుకున్నా ఈ కపట ప్రపంచం వాడిని బతకనివ్వదు. తన చుట్టూ ఇనుప కంచెలు అల్లి, వాడి ప్రాణాన్ని ముక్కలు చేయడానికి కాచుకు కూర్చున్న బూటకపు నాగరికతను చూసి కవిలోని ధిక్కారం పడగ విప్పుతుంది. 'గీతల్లేని లోకం' కవితలో, రాజ్యాల పేరుతో మనిషి గీసుకున్న ఈ కృత్రిమ సరిహద్దుల మీద గోపాలయ్య సంధించిన ప్రశ్న ఒక పిడుగులా పడుతుంది. పక్షులకు లేని సరిహద్దులు, జంతువులకు లేని రాజ్యాలు సకల చరాచర సృష్టిలో ఉన్నతుడిగా ప్రకటించుకున్న మానవుడికి ఎందుకు అవసరమొచ్చాయో నిలదీస్తాడు. "గీతలు గీసుకున్నావ్ సరే / కొలతలు వేసుకున్నావ్ సరే / నీ హద్దుల్లో నువ్ ఉండటానికి మించిన / ప్రపంచశాంతి ఏముంది?" అని సూటిగా ప్రశ్నిస్తాడు కవి. ఇది కేవలం దేశాల మధ్య ఉన్న సరిహద్దుల గురించిన ప్రశ్న కాదు, తోటి మనిషిని చేరదీయకుండా మన మనసుల మధ్య మనం కట్టుకున్న అహంకారపు గోడల గురించిన హెచ్చరిక. మట్టి కింద నీటిచుక్క నిస్వార్థంగా దాహం తీరుస్తున్నప్పుడు, మనిషి ఎందుకు మరో మనిషికి నీటిచుక్క కాలేకపోతున్నాడన్న ఆవేదన ఈ వాక్యాల్లో రగులుతూ ఉంటుంది.

ఈ స్వార్థపు గీతలకు మనిషి పెట్టుకున్న ఒక ముద్దుపేరు 'నాగరికత'. కానీ కవి దృష్టిలో ఈ నాగరికత మనిషిని మనిషిగా బతకనివ్వకుండా చేస్తున్న ఒక శ్మశానం. 'నాగరికత' కవితలో ఈ నేల కింద ఎన్నో రాజ్యాల పతాకాలు, కాలగర్భంలో కలిసిపోయిన మతాల శిథిలాలు ఉన్నాయని గుర్తుచేస్తూ ఇవన్నీ మనిషి అహంకారానికి మిగిలిన ఆనవాళ్లు మాత్రమేనని తేల్చి చెబుతాడు. అసలైన నాగరికత అంటే ప్రాణాన్ని ప్రేమించడం, ఆడుకునే ఆడపిల్ల పాదాల్లో పసిడి కాంతిరేఖలు చూడటం అని చెబుతూ "మనిషి మనిషిగా మెరుగుపడటానికి మించిన / సరికొత్త నాగరికత ఏముంటుంది?" అని ఒక తాత్వికమైన కొరడా ఝుళిపిస్తాడు. ఈ ఒక్క వాక్యంలో మతం, కులం, రాజ్యం అనే ముసుగులన్నీ పటాపంచలైపోతాయి. మనిషి తన తోటి మనిషిని మనిషిగా చూడలేని ఈ కపట నాగరికతను కవి నగ్నంగా నిలబెడతాడు.

అయితే ఈ కపటత్వం కేవలం నమ్మకాల్లోనే లేదు, పాలకుల లెక్కల్లో కూడా దాగి ఉంది. సమాజం ఎదుర్కొంటున్న అతి పెద్ద మోసాన్ని 'బడ్జెట్‌కు ముందే' కవితలో కవి తోలుతీసి చూపిస్తాడు. సామాన్యుడి బతుకు తెల్లారుతుంటే, ఆ బతుకుతో ఆడుకునే పాలకుల అంకెల గారడీని కవి ఎంత అసహ్యించుకుంటాడో ఈ పంక్తులు చెబుతాయి. "కార్పొరేట్ వ్యాపారి దుఃఖాన్ని మొలిపిస్తూ... / నా గుండెల్లో / పగులుతున్న పేదల గుండె చప్పుళ్ళు / ఖాళీబిందెలు కార్చే కన్నీళ్లు" అని ఆవేదన చెందుతాడు. ఈ దేశపు అసలైన వనరులు ఏసీ గదుల్లో కూర్చుని బడ్జెట్ లెక్కలు వేసేవాడి దగ్గర లేవు, అవి ఎండలో చెట్టు కింద సంసారం చేస్తున్న యానాది చెంచయ్య దగ్గర, సన్నకారు రైతుల పగిలిన పాదాల దగ్గర ఉన్నాయన్న పచ్చి నిజాన్ని కవి ఎలుగెత్తి చాటుతాడు. ప్రజల కన్నీళ్ల మీద ఎత్తుకునే ఇళ్లు, ఈ కపట వ్యాఖ్యలు ఇవన్నీ ఒక కవి ముందు దాగవని ఒక హెచ్చరిక బోర్డును నాటుతాడు.

సరిహద్దుల రూపంలో, నాగరికత రూపంలో, అంకెల గారడీ రూపంలో బాహ్య ప్రపంచం చేస్తున్న ఈ విధ్వంసం... చివరికి మనిషిలోని ఆర్ద్రతను ఎలా చంపేసిందో 'కపర కపర చీకటి' కవితలో ఒక విషాద గీతంగా మారుతుంది. బయట జరుగుతున్న కపటత్వం చివరికి బంధుత్వాల దాకా ఎలా పాకిందో, రక్తసంబంధాలను ఎలా మింగేసిందో చూసి కవి తల్లడిల్లిపోతాడు. ఒకప్పుడు పలకరించే అన్నదమ్ములు, నన్ను భుజానెసుకు తిరిగిన మేనత్తలు ఉన్న లోకంలో ఇప్పుడంతా 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్లు మారిపోయిన వైనాన్ని "ఎవరికెవరం ఏమౌతాం / ఏటి చేప యాడికెళ్తుందో / గేలమేసి గుండె నొక్కేస్తే / ప్రాణమేమో పాకమౌతుంది" అని ఎంత గ్రామీణమైన, ఎంత గాఢమైన పదచిత్రంతో వర్ణించాడో! చేపను పట్టుకుని ప్రాణం తీస్తున్నట్లే, బంధాలను మన చేతులతో మనమే ఉక్కిరిబిక్కిరి చేసి చంపుకుంటున్న ఈ కపట చీకటిని కవి కళ్ళకు కడతాడు.బయట రాజ్యాలు గీసుకున్న గీతలు, ఇంటి లోపల బంధాల మధ్య పగుళ్లుగా మారిన ఈ ఆధునిక విషాదాన్ని, ఈ కపటత్వాన్ని గోపాలయ్య కవిత్వం ఒక బాకులా చీల్చి చూపిస్తుంది. ఈ ఛిద్రమైన బతుకుల మధ్య, నిదుర చెదిరిన కవి రాత్రిళ్లు ఎలా గడిచిపోతున్నాయో ఆ 'అలజడి' ని ఇప్పుడు మనం చూడాలి. బయట రాజ్యాలు గీసుకున్న స్వార్థపు గీతలు, లోపల బంధాలను మింగేసిన కపటత్వం ఈ రెండింటి మధ్య నలిగిపోతున్న మనిషి తనను తాను ఎంతగా కోల్పోయాడన్నదే ఈ మూడవ భాగపు అంతస్సూత్రం. అస్థిరమైన ఈ ఆధునిక అరణ్యంలో మనిషి అసలు స్వరూపం ఏమిటి? వాడి మూల స్వభావం ఏమిటి? ఈ ప్రశ్నలకు జవాబు వెతుకుతూ కవి చేసిన ఒక మహా తాత్విక అన్వేషణే ఈ పుస్తకానికి తలమానికమైన "నీటికుండలాంటి మనిషి".




ఇది కేవలం ఒక కవిత కాదు, నాగరికత పేరుతో కలుషితమైపోయిన మానవ చరిత్రకు కవి పడుతున్న ఒక పశ్చాత్తాపం. సమాజం, మతం, డబ్బు అనే జాడ్యాలు అంటకముందు మనిషి ఎంత స్వచ్ఛంగా ఉండేవాడో ఊహించుకుంటూ కవి సృష్టించిన ఈ ప్రత్యామ్నాయ ప్రపంచం అద్భుతమైనది. "మతం లేని మనిషి / ఎలా ఉండి ఉంటాడు / చుట్టూ ఉన్నవాళ్ళందర్నీ చుట్టం లెక్కే / చూసి ఉంటాడు" ఎంతటి ప్రగాఢమైన వాక్యం ఇది! మనిషిని మనిషికి దూరం చేసే మతం అనే కుట్ర లేనప్పుడు, ఈ భూగోళం అంతా ఒకే కుటుంబం అన్న పచ్చి నిజాన్ని కవి ఎంత సరళంగా చెప్పాడో! ఆ స్వచ్ఛమైన కాలంలో మనిషి తోటి మనిషితో ఎలా మెలిగేవాడో చెబుతూ "చేతికి చేయి గుండెతో గుండె కలిపి / దారెంట నమ్మకంగా నడిచే ఉంటాడు / చలివేంద్రపు నీటికుండ మాదిరి / చల్లగా ఉండే ఉంటాడు" అని ఒక అపురూపమైన పదచిత్రాన్ని చెక్కుతాడు కవి. మనిషిని ఒక ఉక్కు మనిషిగానో, జయించలేని వీరుడిగానో కవి వర్ణించలేదు. ఒక 'నీటికుండ'తో పోల్చాడు. ఎందుకంటే, నీటికుండకు కులం లేదు, మతం లేదు. అది తన దగ్గరకు వచ్చిన వాడి దాహాన్ని నిస్వార్థంగా తీరుస్తుంది, చల్లదనాన్ని ఇస్తుంది. కానీ అది మట్టితో చేసినది, అత్యంత సున్నితమైనది. ఒక చిన్న రాయి తగిలినా ముక్కలైపోతుంది. మనిషి ప్రాథమిక స్వభావం కూడా అంతే! కల్మషం లేని ఆ సున్నితత్వాన్ని పాలకుల, వ్యాపారుల రాళ్లు ఎలా పగలగొట్టాయో ఈ "నీటికుండ" అనే రూపకం నిశ్శబ్దంగా వివరిస్తుంది. అందుకే, ధనదాహం ఎరగని ఆ పాత మనిషిని గుర్తుచేసుకుంటూ "డబ్బులు తెలియనికాలంలో / పిట్టలా ఎగిరే ఉంటాడు / గూడు కట్టి గువ్వలని పిలిచే ఉంటాడు" అని స్వేచ్ఛకు అసలైన అర్థాన్ని ఆపాదిస్తాడు.

కానీ ఆ నీటికుండ పగిలిపోయింది. మనిషి తన తోటి గువ్వలను పిలిచే స్వభావాన్ని కోల్పోయాడు. ఆ దయ, ఆ ఆర్ద్రత స్థానంలో ఇప్పుడు కేవలం బతుకు పోరాటం, అనారోగ్యం, చావు భయం మిగిలాయి. ఆ పగిలిన నీటికుండ తాలూకు దుఃఖమే 'రెక్కలు విరిగిన నిద్ర' కవితలో ఒక ఆర్తనాదంగా వినిపిస్తుంది. ఈ కపట ప్రపంచంలో ఏ ఆసరా లేని ఒక సామాన్యుడి రాత్రులు ఎలా గడుస్తున్నాయో కవి గుండెల్ని పిండేసేలా వర్ణిస్తాడు. "పెద్దాసుపత్రి ముందు / రోగుల బంధువుల / కంటి మీదికి / రాలేక రాలేక / దిగులు దిగులుగా / రెక్కలు విరిగి రోదిస్తూ / నిద్ర" నిద్రను ఒక పక్షిలా ఊహించడం సామాన్యం. కానీ ఆ పక్షికి 'రెక్కలు విరిగిపోవడం' అనేది ఆధునిక మనిషి అనుభవిస్తున్న అత్యంత తీవ్రమైన మానసిక వేదనకు అద్దం పడుతుంది. ఆసుపత్రి వరండాల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఎదురుచూసే బంధువుల కళ్ళలోకి నిద్ర రావడానికి కూడా భయపడి ఏడుస్తోందన్న ఈ ఒక్క వాక్యం కవిలోని అపారమైన కరుణకు సజీవ సాక్ష్యం.

సామాన్యుడి కంటికి రెక్కలు విరిగిన నిద్రను మిగిల్చిన ఈ కపట వ్యవస్థల మీద కవికున్న ఆక్రోశం కేవలం వర్తమానానికే పరిమితం కాలేదు. అది వేల ఏళ్ల చరిత్రను తవ్వుకుంటూ 'అశోక దుఃఖం' వైపు నడిచింది. నిన్నటి కళింగ నుంచి నేటి గాజా వరకు, పాలకుల అధికార దాహానికి బలైపోతున్న ప్రాణాలను చూసి కవి గుండె తల్లడిల్లింది. "సారనాథ్‌లో / అశోకుడు కనిపించాడు / గాజా యుద్ధం గురించి అడిగి / తల్లిని కోల్పోయిన / బిడ్డలా ఏడ్చాడు" ఈ వాక్యాల్లో కాలం చెరిగిపోయింది. భౌగోళిక సరిహద్దులు తుడిచి పెట్టుకుపోయాయి. చరిత్రలో యుద్ధాన్ని వదిలేసిన అశోకుడు, నేటి గాజా నెత్తురును చూసి బిడ్డలా ఏడవడం అనే ఊహ వెనుక ఈ ప్రపంచానికి ఇప్పుడు కావాల్సింది ఆయుధాలు కాదు, కన్నీళ్లను తుడిచే ఒక దార్శనికత అన్న స్పష్టమైన తాత్వికత ఉంది. ఆ కన్నీటి చుక్కల రాపిడిలోనే "శాంతి శాంతి శాంతి అని / శబ్దం వినిపిస్తుందగా" ఆ దుఃఖం ముగియడం కవి ఆశిస్తున్న మానవత్వపు అంతిమ గమ్యం.

సరిహద్దుల రూపంలో, నాగరికత రూపంలో, అంకెల గారడీ రూపంలో బాహ్య ప్రపంచం చేస్తున్న ఈ విధ్వంసం... చివరికి మనిషిలోని ఆర్ద్రతను ఎలా చంపేసిందో 'కపర కపర చీకటి' కవితలో ఒక విషాద గీతంగా మారుతుంది. బయట జరుగుతున్న కపటత్వం చివరికి బంధుత్వాల దాకా ఎలా పాకిందో, రక్తసంబంధాలను ఎలా మింగేసిందో చూసి కవి తల్లడిల్లిపోతాడు. ఒకప్పుడు పలకరించే అన్నదమ్ములు, నన్ను భుజానెసుకు తిరిగిన మేనత్తలు ఉన్న లోకంలో ఇప్పుడంతా 'ఎవరికి వారే యమునాతీరే' అన్నట్లు మారిపోయిన వైనాన్ని "ఎవరికెవరం ఏమౌతాం / ఏటి చేప యాడి కెళ్తుందో / గేలమేసి గుండె నొక్కేస్తే / ప్రాణమేమో పాకమౌతుంది" అని ఎంత గ్రామీణమైన, ఎంత గాఢమైన పదచిత్రంతో వర్ణించాడో! చేపను పట్టుకుని ప్రాణం తీస్తున్నట్లే, బంధాలను మన చేతులతో మనమే ఉక్కిరిబిక్కిరి చేసి చంపుకుంటున్న ఈ కపట చీకటిని కవి కళ్ళకు కడతాడు.

కానీ వాస్తవం వేరు. మనిషి ఇప్పుడు శాంతి దూత కాదు. వాడు వెళ్లిన చోటల్లా విధ్వంసమే! ఆ పచ్చి నిజాన్ని 'అలజడి' కవితలో ఒక ఛెల్లుమనే చెంపదెబ్బలా ముగిస్తాడు కవి. రాత్రి పూట ఎవరూ లేని మైదానంలో, ప్రకృతి తన పనుల్లో తాను నిమగ్నమై ప్రశాంతంగా ఉన్నప్పుడు "మనుషులొస్తున్న / అలికిడి / ఒక్కసారిగా మారిన / వాతావరణం / మైదానంలో మట్టి / కల్లోలంగా కదులుతోంది" అని ప్రకటిస్తాడు. ఎంతటి విషాద పరిణామం ఇది! ఒకప్పుడు పదిమంది దాహాన్ని తీర్చే 'చల్లని నీటికుండ' లాంటి మనిషి ఇప్పుడు ప్రకృతిలోకి అడుగుపెడితేనే వాతావరణం భయంతో కల్లోలంగా మారే స్థాయికి దిగజారిపోయాడు. సృష్టిలో అద్భుతమైన ప్రాణిగా పుట్టిన మనిషి, స్వార్థంతో తనను తాను కోల్పోయి, సృష్టికే ఒక 'అలజడి' గా ఎలా మారాడన్న అంతస్సూత్రాన్ని కవి ఈ కవితల ద్వారా అత్యంత ఆర్ద్రంగా, అంతే ఆవేశంగా పాఠకుడి మెదడులోకి సూదిలా గుచ్చారు.

ఈ అలజడి నుంచి బయటపడే మార్గం లేదా? ఈ విధ్వంసాన్ని ఆపేదెవరు? ఆ ఆశ ఎక్కడుందో ఇప్పుడు మనం చూడాలి. సృష్టికే ఒక అలజడిగా మారిన ఆధునిక మనిషి, తన చేతులకు అంటిన ఆ నెత్తుటి మరకలను ఎలా కడుక్కోవాలి? కపటపు గీతల మధ్య ఛిద్రమైన బతుకుకి మళ్లీ ప్రాణం పోసే సంజీవని ఎక్కడుంది? ఈ ప్రశ్నలకు సుంకర గోపాలయ్య దగ్గర ఉన్న ఏకైక, అత్యంత బలమైన సమాధానం "కవిత్వం"! విధ్వంసపు అంచున నిలబడ్డ మనిషికి మిగిలిన ఏకైక ఆయుధం, రేపటి తరానికి వదిలివెళ్లే అంతిమ వారసత్వం అక్షరమే. కవిత్వం అంటే ఏ శూన్యంలోంచో రాలే అక్షరాల గారడీ కాదు. అది పేగులు తెగే శ్రమలోంచి, చెమటలోంచి, దైనందిన జీవితపు నెరదల్లోంచి పుట్టే ఒక జీవనాదం. 'ఆమె+నేను = కవిత' అన్నది కేవలం ఒక శీర్షిక కాదు, అక్షరం ఎలా ప్రాణం పోసుకుంటుందో చెప్పే ఒక తాత్విక సమీకరణం. మేధోపరమైన అహంకారంతో పీఠాలు వేసుకునే వాళ్లకు చెంపపెట్టులా, కవిత్వం ఇంట్లోని వంటగదిలోంచి ఎలా వెలుగులు విరజిమ్ముతుందో కవి చూపిస్తాడు. "ఆమె ఎసరు పొయ్యిమీద పెడుతుంది / అక్షరాల లాంటి బియ్యాన్ని కడిగి... / రాత్రి చీకటికి వెలుగవుతాం / అక్షరాలు కాంతివంతమవుతాయి / కవిత పూర్తవుతుంది" ఈ వాక్యాల్లో ఎంతటి అద్భుతమైన సృష్టి రహస్యం దాగి ఉందో! బతుకు బండిని లాగే ఆడదాని శ్రమ, మేధస్సును పండించే కవి ఆలోచన ఈ రెండూ కలిసినప్పుడే ఆ రాత్రి చీకటిని తరిమికొట్టే వెలుగు (కవిత) పుడుతుందని ఎంత ప్రాక్టికల్ గా, ఎంత ఆర్ద్రంగా చెప్పాడో. ఇక్కడ అక్షరాలు బియ్యపు గింజల్లా కడగబడతాయి, ఆకలి తీర్చే అన్నంలా మారతాయి.

ఇంట్లో పుట్టిన ఈ అక్షరం ఆరుబయట అడుగుపెడితే ఏమవుతుంది? ఆధిపత్యపు గొడ్డళ్ల చేతిలో లెక్కలేనన్ని సార్లు నరకబడి, నెత్తురోడిన ఈ భూమి మీద మళ్లీ ఆశల విత్తనం ఎలా మొలకెత్తుతుంది? 'జీవకాంతి' కవితలో ఆ ఆశకు ఒక అద్భుతమైన దృశ్యరూపం ఇస్తాడు కవి. "నాట్లు వేస్తున్న స్త్రీలు / పాటలు పాడుతున్నారు / లెక్కతీయలేనన్ని మార్లు / గాయపడ్డ నేల / మరోమారు పురిటి నొప్పులకు / సిద్ధపడుతోంది" వ్యాపార దాహానికి ఈ నేల ఎన్నిసార్లు గాయపడినా, అది తన సృజనను ఆపదు. శ్రమజీవులైన స్త్రీల పాటల సాక్షిగా ఆ భూమి మళ్లీ పురుడు పోసుకునేందుకు సిద్ధపడుతోంది. మనిషి ఎన్నిసార్లు మరణాన్ని విసిరినా, ప్రకృతి 'జీవకాంతి'ని విసురుతూనే ఉంటుందన్న అపారమైన నమ్మకం, ఒక ధిక్కార స్వరం ఈ కవితలో రగులుతూ ఉంటుంది.

అందుకే ఈ సృష్టిలో సామ్రాజ్యాలు కూలిపోవచ్చు, బడ్జెట్ లెక్కలు ఆవిరైపోవచ్చు కానీ శ్రమజీవి పెదాల మీది పాట మాత్రం చావదు. 'మరణం లేని పాట' కవితలో కవి చరిత్రను సింధులోయ నుంచి నేటి వరకు తవ్వుకుంటూ వస్తాడు. రాజులు, రాజ్యాల చరిత్ర కాదు మట్టిని పిసికే వాడి, నూలు నేసే వాడి చరిత్ర అసలైనదని ప్రకటిస్తాడు. "మెతుకు చేసిన వ్యవసాయకారుడు / మట్టి మట్టి పిసికి పరికరాలల్లిన మన్మమాంత్రికుడు... / ఎవరైతేనేమి / గీతాలు కొలువుండే హృదయాలు / పాటలు మరణించవు / సూర్యుడై వెలుగుతాయ్" ఈ పాటలకెక్కడి మరణం? ఈ అక్షరాలకెక్కడి ముగింపు? సమాజపు కపటత్వం మీద విసిరిన అక్షరాస్త్రాలు ఎన్నటికీ సూర్యుడిలా వెలుగుతూనే ఉంటాయన్నది కవి ప్రగాఢ విశ్వాసం. మరి ఇంతటి సుదీర్ఘమైన, ఆర్ద్రమైన, నెత్తురోడిన ప్రయాణం చేసిన తర్వాత ఒక "నీటికుండ లాంటి మనిషి" తన తర్వాతి తరానికి దేన్ని ఆస్తిగా వదిలి వెళ్తాడు? బ్యాంకు బ్యాలెన్సులా? కాంక్రీటు భవనాలా? కాదు! వాటన్నింటినీ నిరాకరిస్తూ, ఒక నిఖార్సయిన కవిగా గోపాలయ్య ఎగరేసిన ధిక్కార పతాకమే 'పద్య వారసత్వం'. ఇది ఈ పుస్తకానికే ఒక క్లైమాక్స్ లాంటి మహా కవిత!

ఒక సామాన్యుడిగా పుట్టి, తన చుట్టూ ఉన్న ఆధిపత్యాన్ని, కపటత్వాన్ని ఎదిరిస్తూ, ప్రకృతిని ప్రేమించడం నేర్చుకున్న ఒక తండ్రి తన కొడుక్కి ఇచ్చే వీలునామా ఏమిటో కవి ఉరుములాంటి వాక్యాల్లో ప్రకటిస్తాడు. "నాన్న, నీ కోసం ఏమి వదిలిపెట్టి వెళ్లాడని / ఎవరైనా అడిగితే / ఈ పద్యాన్ని సాక్ష్యంగా ఇస్తాను / ఇదే వీలునామాను / వేయి గొంతులతో / బహిరంగ ప్రకటన చేస్తాను" కవిత్వం ముగిసేది ఇక్కడే! బ్యాంకులు, ఆస్తులు, ఆధిపత్యాలు అన్నీ కాలగర్భంలో కలిసిపోతాయి. కానీ ఒక మనిషి ఎంత స్వచ్ఛంగా బతికాడు, ఎంత ఆర్ద్రంగా కన్నీరు కార్చాడు, ఎంత బలంగా సమాజాన్ని ఎదిరించాడు అని చెప్పడానికి రేపటి తరానికి మిగిలే ఏకైక సాక్ష్యం వాడు రాసుకున్న నెత్తుటి అక్షరమే! "నా పద్యమే నా వీలునామా" అని కవి చేసిన ఈ బహిరంగ ప్రకటన. తెలుగు సాహిత్యంలో ఒక అరుదైన, అత్యంత శక్తివంతమైన అస్తిత్వ ప్రకటన! నాగరికత పేరుతో నెత్తురు తాగుతున్న ఈ యంత్ర యుగంలో, ఒక మనిషి తన పగిలిన గుండె ముక్కలను ఏరుకుని అక్షరాలుగా పేర్చిన నెత్తుటి సంతకం ఈ పుస్తకం. ఇక్కడ వాక్యాలు కాగితం మీద నిద్రపోవు. అవి అక్షరాల రూపంలో పొంచి ఉన్న నిశ్శబ్దపు కేకలు. మనిషి తన అస్తిత్వాన్ని, ఆర్ద్రతను పూర్తిగా కోల్పోయి సృష్టికే ఒక విధ్వంసకారిగా మారుతున్న ఈ భయానక వర్తమానంలో సుంకర గోపాలయ్య గొంతుక ఒక ప్రాణవాయువులా, అదే సమయంలో దిక్కులు పిక్కటిల్లే ఒక ధిక్కార శంఖంలా వినపడుతుంది. కవి ఎంచుకున్న మార్గం పూలబాట కాదు. అది గాయపడ్డ అడవి గుండెల్లోంచి, రెక్కలు విరిగిన నిద్రల దుఃఖంలోంచి, కపట ప్రపంచపు ఇనుప గోడల మధ్య నుంచి సాగిన ఒక ఒంటరి, మహా తాత్విక ప్రస్థానం. ఈ ప్రపంచం మనిషికి గీతలు గీసి, కొలతలు వేసి వాడి సహజత్వాన్ని ఉరితీస్తుంటే కవి దానికి బదులుగా ఒక సున్నితమైన 'నీటికుండ'ను ఆయుధంగా పట్టుకుని యుద్ధరంగానికి వచ్చాడు. ఈ నీటికుండ పగిలిపోవచ్చేమో కానీ, ప్రాణాన్ని కాపాడే దాని మూల స్వభావాన్ని ఏ ఆధిపత్యమూ శాసించలేదు. కఠినమైన బండరాళ్ల లాంటి మనుషుల మధ్య, ముక్కలైనా సరే ఒక ఎండిన గొంతుకను తడిపే ఆ తడినే కవి తన అత్యున్నత తాత్వికతగా, తన ఆత్మగా ప్రకటించాడు.

ఈ 'నీటి కుండ లాంటి మనిషి' కవితా సంపుటి చదివాక ఎవరికైనా అర్థమయ్యే పచ్చి నిజం ఒకటే– కవిత్వం అంటే పదాలతో చేసే వ్యాయామం కాదు, అది ఒక ప్రాణం చెల్లించుకున్న మూల్యం! ఈ పుస్తకాన్ని మూసేసిన తర్వాత పాఠకులు తాను కూర్చున్న కుర్చీలోంచి మామూలుగా లేవలేరు. వాళ్ళ నెత్తి మీద ఎవరో ఒక బరువైన వాస్తవాన్ని మోపినట్లు, వాళ్ళ నరాల్లో ఒక కొత్త నెత్తురు ప్రవహిస్తున్నట్లు, వాడి కళ్ళ ముందున్న అబద్ధపు ప్రపంచం పటాపంచలైపోయినట్లు ఒక భయంకరమైన, అద్భుతమైన ఎరుక కలుగుతుంది. రేపటి నిర్జీవ తరానికి తన అసలు సిసలైన వీలునామాగా కవి మిగిల్చి వెళ్తున్న ఈ గుండె చప్పుడు తెలుగు సాహిత్యపు మట్టి పొరల్లో, కాలం ఉన్నంతవరకు ఇంకిపోని ఒక సజీవ జలధార!

**డా. బండారు విజయ్ కుమార్,**
9866703130

## ఎడారి చీమలు

ఎడారి రహదారుల్లో
ఒక తీతువు పిట్ట
బృందగానం చేస్తుంది
పగిలిన ప్రజాస్వామ్యం
ఫలకలపై ఒక తెల్లకొంగ
రెక్కల్ని చాచి
ఒళ్ళు విరుచుకుంటుంది

అక్కడి చలిచీమలన్నీ
పగలంతా గొంతులు
చించుకుంటున్నాయి
పుట్టలు చెట్లు వదిలి
నక్కల కూతలు
వింటున్నాయి
ఒక్కొక్కటి కలిసి

గుంపులైతున్నయ్

ఇప్పుడు అక్కడి
ప్రతిరాత్రి
ఎన్ని ఊపిరులకు
ఉరి వేస్తుందో
ఎన్ని రక్తపు చుక్కలై
చరిత్ర పేజీలను
తడుపుతుందో
ఎన్ని తలలు
శిలాఫలకలౌతాయో
ఎలా ఊహించడం

ఒక మతిలేని
తెల్లని అహంకారం

స్వార్థం మేకతోలు
కప్పుకొని
ఎడారి ఇసుక తిన్నల మీద
శాంతి వచనాల
పిల్లిమొగ్గలు వేస్తుంది

కూలిన శ్రమ సౌధాల సాక్షిగా
శిథిలాల కింద నలిగిన
ఆత్మాభిమానం సాక్షిగా
అక్కడి ఇసుక ఇప్పుడు
రక్త తిలకం దిద్దుకుంటుంది

రాతిరి మౌనంగా
వాయులీనమై పోవచ్చు
చంద్రుడు మబ్బుల వెనుక
కళ్ళు మూసుకోవచ్చు
కానీ... నీ దౌష్ట్య పర్వంలో
తెగిపడిన
దేహ శకలాలలోంచి
పగనే ఊపిరి చేసుకొని
పుట్టుకొచ్చే ఇనుప పక్షులు
ఏదో ఒకరోజు

నీ ఇంటికప్పు మీద
ఎగురుతాయేమో చూడు


చాచిన రెక్కల కింద
నిప్పుల్ని దాచుకుని
గురి తప్పని లక్ష్యాలై
నీ పొగరు గురుతుల
సౌధాల వైపు ఖచ్చితంగా
దూసుకు వస్తాయి
నిన్నటి కాలం పేజీలు చూడు
నేల రాలిన నీ అహంకారం
మానని గాయమై
తడారి పోకుండా
నిన్నే చూస్తున్నట్టుంది.

## భారతీయ కవిత

## ఒక తప్పుడు సాక్ష్యం ఇచ్చినతను

అవును, నేను
అబద్ధాలాడుతాను
నా అబద్దాలు అభాగ్యుల
జీవితాన్ని
కనీసం ఒక్క రోజైనా
మెరుగు పరచగలవనుకుంటే
నేను లక్షల సార్లు అబద్ధాలా
డుతాను
చనిపోబోతున్న మనిషి
మరణాన్ని

నా అబద్ధాల
పొగడ్తలు
ఒకింత
సునాయాసం
చేయగలవనుకుంటే
నేను అబద్ధాలాడుతాను
నేనెప్పుడూ తప్పుడు
సాక్ష్యాలనిచ్చాను
ఇచ్చిన ప్రతి సారీ ఒక ప్రాణిని
ఉరి నుంచి తప్పించాను



నేను ప్రపంచంలోనే పెద్ద
అబద్ధాలకోరును
అవ్వాలనుకుంటాను
ఖచ్చితంగా!

హిందీ మూలం &
ఆంగ్లానువాదం : అరుణ్ కమల్
తెలుగు సేత: దర్భశయనం శ్రీనివాసాచార్య

# జాతీయం-అంతర్జాతీయం



# 9, 10 తరగతులకు మూడు భాషలను తప్పనిసరి చేసిన సీబీఎస్ఈ









# విజయ్ వద్ద కీలక శాఖలు



# సైకిల్‌పై కార్యాలయానికి కేంద్ర మంత్రి






# రూ. 182 కోట్ల విలువైన మాదక ద్రవ్యాల పట్టివేత





## జర్నలిస్టుల ఐక్యతకు పిలుపు

### జిల్లాలో జోరుగా సాగుతున్న టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు

నల్లగొండ ,మే 17
(వుదయం ప్రతినిధి)

జిల్లాలో టి యు డబ్ల్యూ జె( ఐ జే యు ) సభ్యత్వ నమోదు ముమ్మరంగా కొనసాగుతుంది. జిల్లాలోని అన్ని మండలాలలో, పట్టణాలలో, నియోజకవర్గ కేంద్రాలు, జిల్లా కేంద్రంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు.

అన్ని ప్రధాన పత్రికలతో పాటు, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా, చిన్న పత్రికల ఎడిటర్లు, రిపోర్టర్లు, ఫోటో జర్నలిస్టులు వీడియో జర్నలిస్టులు పెద్ద ఎత్తున సభ్యత్వాలను పొందుతున్నారు. ఈ సందర్భంగా నల్లగొండలో శనివారం సాయంత్రం జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టుల హక్కులను కాపాడుకోవడంతోపాటు, ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం, హెల్త్ కార్డుల వంటి సౌకర్యాలను కల్పించడం కోసం టి యుడబ్ల్యూజే కృషి చేస్తుందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రం తో పాటు, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా యూనియన్ నిరంతరం జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి జర్నలిస్టు కు యూనియన్ అండగా నిలుస్తుందని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ అందించటానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘము బాధ్యులు అబ్బోజు మదనా చారి, పులిమామిడి మహేందర్ రెడ్డి , పిట్టల రామకృష్ణ, దోటి శ్రీనివాస్, పొట్టు ముత్తు అశోక్, కే.జగదీశ్వర చారి, కత్తుల యాదగిరి, మహమ్మద్ గౌస్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల చదువు, క్రమశిక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

### విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దేది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదే కీలకపాత్ర, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు.

మహబూబాబాద్ జిల్లా,
మే17(వుదయం ప్రతినిధి)

మాదకద్రవ్యాలు డ్రగ్స్ చెడు వ్యసనాల బారిన పడకుండా గమనిస్తూ ఉండాలి.*ఇంటర్మీడియట్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత అయిన విద్యార్థులకు తన సొంత డబ్బులతో ఆర్థిక సహాయం ప్రోత్సాహకం అందజేసిన :: జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.ప్రతి వ్యక్తి జీవితంలో కేవలం విద్య మాత్రమే భవిష్యత్తు ప్రణాళికలకు మార్గదర్శకంగా నిలుస్తుంది.జిల్లా కలెక్టర్..జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలు, విద్యా విజయోత్సవం కార్యక్రమం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎ.సత్యనారాయణమూర్తి, అధ్యక్షతన నిర్వహించిన విద్యా విజయోత్సవ సభలో ఎమ్మెల్సీ, కలెక్టర్ , ముఖ్యఅతిథిగా,పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతు జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు, పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల అకడమిక్ పురోగతిలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయం. విద్యా వారోత్సవాలు విద్యార్థుల్లో పోటీ భావన పెంచడమే కాకుండా, ప్రతిభావంతులైన పిల్లలను వెలిగించే వేదిక గా నిలిచాయి అనిఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులు తమ ప్రతిభతో జిల్లా గర్వించేలాగా నిలుస్తున్నారని అన్నారు.జిల్లాలో విద్యా ప్రమాణాలను మరింత ఉన్నతంగా చేరేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను పొందేలా జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని కలెక్టర్ స్పష్టం



చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులకు కలెక్టర్ తన సొంత డబ్బులతో నగదు ప్రోత్సాహకం అందజేసి అభినందించి ప్రతి విద్యార్థిని విద్యార్థి జీవితంలో కేవలం విద్య మాత్రమే తమ తమ జీవితాలను ఉన్నత స్థానాల వైపు మారుస్తుందని ప్రతి ఒక్కరూ విద్యను స్వీకరించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ఉన్నత విలువలతో కూడిన విద్యను ప్రతి ఒక్కరికి అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయిని ఉపాధ్యాయులపై ఉందని ఆమె కోరారు,ఎమ్మెల్సీ శ్రీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు* మాట్లాడుతూపేద బిడ్డలు చదువుకుంటున్నందున ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని ,ఉపాధ్యాయులుకూడా అంకిత భావంతో పనిచేయాల నికోరారు. విద్యార్థులు చిన్నప్పటినుండే కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని అదేవిధంగా విద్యా వైద్యం లాంటి సేవ రంగాల అభివృద్ధి కి మేము రాజకీయాలకి అతీతంగా కృషి చేస్తామని,డ్రగ్స్ గంజాయి లాంటి వాటికి విద్యార్థులు అలవాటు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు.ఈ ఏడాది విద్యా వారోత్సవాలు విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలు, ప్రతిభ, క్రీడా సామర్థ్యాలను వెలికితీయడంలో కీలకపాత్ర పోషించాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాలలో విద్యార్థులు చురుకైన పాల్గొనడం అభినందనీయం అనికొనియాడారు.మహబూబాబాద్ జిల్లాలోని 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేసే విధంగా ప్రతి కళాశాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నది దీని గాను అన్ని కళాశాలలో 4 డిజిటల్ టీవీలను ఏర్పాటు చేయడం జరిగింది అలాగే ప్రతి కళాశాలకు మైనర్ రిపేర్లకు నిధులు మంజూరు చేసి కళాశాల భవనాలను కొత్తవిగా తీర్చిదిద్దడం జరిగింది.జిల్లాలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి, రెండవ సంవత్సరం చదువుతున్న అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు గ్రూప్ కు ఒకటి చొప్పున ఎంపిక చేసి మొత్తం 9 మంది విద్యార్థులను సన్మానించడం జరిగింది. ఇంటర్మీడియట్ విద్యకి ప్రత్యేక చొరవ తీసుకొని స్వయంగా కలెక్టర్ గారు విద్యార్థులకు మనీ ప్రైస్ అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యార్థి సిహెచ్. మదార్ గౌడ్ కలెక్టర్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.ఇంటర్మీడియట్ టాపర్స్అయిన. కీర్తన ,. సంజన . సిరి ఎస్.కె.అఫ్రాతబస్సుం.ఇంటర్మీడియట్ టాపర్స్.కౌశిక్,. వర్ష,. ప్రశాంత్. క్రీడా టాపర్స్ . సహస్ర,. యశ్వంత్, నందిని లను మరియు గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ లలో చదివిన టాపర్స్ లను అభినందించి నగదు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.ప్రమాణాలను మరింతగా పెంచడం కో Zసం ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, ఎంఈఓలు సమిష్టిగా కృషి చేసినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి, స్థానిక వార్డ్ కౌన్సిలర్ నీరుటి హేమ గారు డి ఐ ఈ ఓ మదార్ , ఏసీజీ మందుల శ్రీరాములు ,ఏ ఎఫ్ ఓ శంకర్ ,డి సి బి సెక్రటరీ బాలాజీ , డిఎస్ఓ అప్పారావు, కోఆర్డినేటర్లు పీ పూర్ణచందర్,
జి విజయ కుమారి, వంగ సురేష్, డిసిబి అసిస్టెంట్ సెక్రటరీ ఎస్ సతీష్ కార్యాలయ సూపరిండెంట్ ఉమామ హేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసు ఎస్ బి శ్రీనివాసు, డీఈఓ ఆఫీస్ సిబ్బంది మరియు ఎంఈఓ లు కళాశాలల ప్రిన్సిపల్ లు,హెడ్మాస్టర్లు , ఉపాధ్యాయులు,వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





● మార్నింగ్ వాక్ , మానవహారంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ డా. సత్య శారద

వర్ధన్నపేట మే 17
(వుదయం ప్రతినిధి):

జనగణన (సెన్సెస్)పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో ఆదివారం నిర్వహించిన సెన్సెస్ మార్నింగ్ వాక్, మానవహారం కార్యక్రమాల్లో వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,మున్సిపల్ చైర్పర్సన్ పాలకుర్తి సారంగపాణి, సర్పంచ్ లు జనగణన ర్యాలీ , మానవహారం లో పాల్గొని విజయవంతం చేశారు.అనంతరం ఎంఎం ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సెన్సెస్ పై అవగాహన కార్యక్రమం లో భాగంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు , జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మున్సిపల్ చైర్పర్సన్ పాలకుర్తి సారంగపాణి,మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, అయినవోలు టెంపుల్ చైర్మన్ ప్రభాకర్, పి ఎస్ హెచ్ చైర్మన్ రాజేష్ కన్నా హాజరయ్యారు.ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు మాట్లాడుతూ జనగణన దేశ అభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని తెలిపారు. ప్రభుత్వ పథకాల రూపకల్పన, ప్రజల అవసరాల అంచనా, వనరుల పంపిణీలో జనగణన వివరాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజలు సరైన సమాచారం అందించి జనగణనను విజయవంతం చేయాలని కోరారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రతి కుటుంబం జనగణన సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఖచ్చితమైన సమాచారం అందించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. జనగణనపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లాలో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని చెప్పారు.అనంతరం జనగణన నిర్వహణలో హౌస్ లిస్టింగ్ ప్రక్రియను ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలు సంయుక్తంగా పరిశీలించడమైనది.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, విఆర్ఓ విజయ లక్ష్మి, ఆర్డీవో సుమ , వర్ధన్నపేట తహసిల్దార్ లు విజయ్ సాగర్ , వెంకటస్వామి, శ్రీనివాస్ , మున్సిపల్ కమిషనర్ జోనా, జిల్లా అధికారులు ,సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులు.. ప్రైవేటుకు దీటు



సొంత వేతనంతో విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ, మే 16
(వుదయం జిల్లా ప్రతినిధి) :

విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. “99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక”లో భాగంగా హనుమకొండ ఐడీఓసీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన విద్యా వారోత్సవాల విజయోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కోసం రూ.200 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల కృషి, కలెక్టర్ ప్రోత్సాహంతో గత ఏడాది రాష్ట్రస్థాయిలో 18వ స్థానంలో ఉన్న హనుమకొండ జిల్లా, ఈ ఏడాది (2026) 9వ స్థానానికి ఎగబాకి అత్యుత్తమ ఫలితాలు సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడులు నేడు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా రాణిస్తున్నాయన్నారు.సొంత నిధులతో ప్రత్యేక ప్రోత్సాహం, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు గోసతి సిరి చందన, బొంతల సృజన, అనిశెట్టి రజితలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. వీరికి ప్రభుత్వం తరపున అందించిన రూ.10వేల నగదు బహుమతితో పాటు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తన సొంత వేతనం నుండి అదనంగా మరో రూ.10 వేల చొప్పున అందించి విద్యార్థులను అభినందించడం విశేషం. ఈ కార్యక్రమంలో కనిశెట్టి మధురిమ మెమోరియల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ జగదీశ్వర్ విద్యార్థులకు మెమెంటోలు, డిక్షనరీలను అందజేయ గా, మారి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శాలువాలతో సత్కరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈఓ గిరిరాజ్, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, నగదు బహుమతులు అందజేసిన మంత్రి సీతక్క






ములుగు, మే 17
(వుదయం ప్రతినిధి) :

"సమాజంలోని పేదరికాన్ని రూపుమాపే అత్యంత శక్తివంతమైన ఆయుధం కేవలం విద్య మాత్రమే" అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. 99 రోజుల ప్రజా పాలనప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా, జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 'విద్య విజయోత్సవ దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.రాష్ట్రంలోనే ములుగు ప్రథమ స్థానంపై మంత్రి కొనియాడారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన మౌలిక సదుపాయాలు, డిజిటల్ తరగతులు, ఉపాధ్యాయులుతల్లిదండ్రుల ఉమ్మడి కృషి వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని కొనియాడారు. కష్టపడి చదివితే ఎలాంటి నేపథ్యం ఉన్నవారైనా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెబుతూ.. గ్రూప్1 ద్వారా డీఎస్పీలుగా ఎంపికైన ఏటూరునాగారానికి చెందిన పారిశుధ్య కార్మికుడి కుమారుడు ప్రవీణ్ కుమార్, మల్లంపల్లికి చెందిన టైర్ల షాప్ నిర్వాహకుడి కుమార్తె వృత్తాంతాలను విద్యార్థులకు ఉదాహరణగా వివరించారు.ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు పదో తరగతి, ఇంటర్మీడియట్ మరియు క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంత్రి అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. పరీక్షల్లో ప్రథమ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ. 10,000 నగదు ప్రోత్సాహకాన్ని మంత్రి సీతక్క చేతుల మీదుగా పంపిణీ చేశారు.ప్రత్యేక ఆకర్షణగా 'కంటైనర్ పాఠశాలలు' ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ మాట్లాడుతూ.. మౌలిక వసతులు లేని ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యను అందించేందుకు రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ములుగులో 'కంటైనర్ పాఠశాలలను' ప్రారంభించిన ఘనత మంత్రి సీతక్కదేనని కొనియాడారు. గత ఏడాది ఇంటర్‌లో, ఈ ఏడాది టెన్త్‌లో ములుగు జిల్లా టాప్‌లో నిలవడం జిల్లా గర్వకారణమన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులోనూ ఇదే విజయ స్ఫూర్తిని కొనసాగిస్తూ క్షేత్రస్థాయిలో పాఠశాలలను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, ఇంటర్ విద్యాశాఖ అధికారి వీరేందర్, డీసీఈబీ కార్యదర్శి సూర్యనారాయణ, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



● జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఒక సీసీ సస్పెన్షన్, మరొకరికి చార్జ్ మెమో..
● కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ

జనగామ, మే 17
(వుదయం ప్రతినిధి) :

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. ఆదివారం ఆయన దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి మండలాల్లోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కలెక్టర్ కఠిన చర్యలు తీసుకున్నారు. ఏడునూతుల కేంద్రంలో ఐదు లారీల ధాన్యం వివరాలను ట్రక్ షీట్లో నమోదు చేయని సెంటర్ ఇన్‌చార్జి (సీసీ)ని తక్షణమే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అలాగే, గిర్ని తండా కేంద్రంలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన సీసీకి చార్జ్ మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ముత్తారం గ్రామంలో రైతుల విజ్ఞప్తి మేరకు ధాన్యాన్ని సమీపంలోని రైస్ మిల్‌కు కేటాయించాలని సూచించారు. కలెక్టర్ ముఖ్య ఆదేశాలు జారీ చేశారు. ప్రమాణాలు ధాన్యం కొనుగోళ్లలో ఎఫ్ఏక్యూ (FAQ) ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి. పెండింగ్‌లో ఉన్న ఓపీఎంఎస్ నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి.ధాన్యం తరలింపు: ధాన్యం రవాణాలో జాప్యం జరగకుండా లారీలతో పాటు ట్రాక్టర్లను కూడా ఉపయోగించి బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలి.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు.

# మనోవిజ్ఞాన సేవలకు అంతర్జాతీయ ముద్ర




శ్రీకాంత్ మజ్జిగకు విశిష్ట అవార్డులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
మే 17 (వుదయం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ పంచాయతీ పరిధిలో జన్మించి పెరిగిన శ్రీకాంత్ మజ్జిగ, ప్రస్తుతం సుజాతనగర్ మండలం గరీబ్‌పేట పంచాయతీ లక్ష్మీపురంలో నివసిస్తూ, ప్రస్తుతం హైదరాబాద్ చింతల్ లో ఉంటూ మనోవిజ్ఞాన రంగంలో విశిష్ట సేవలందిస్తున్నారు. చిన్న గ్రామం నుంచి ప్రారంభమైన ఆయన ప్రయాణం నేడు దేశ విదేశాలకు విస్తరించడం స్థానిక ప్రజలకు గర్వకారణంగా మారింది.హైదరాబాద్‌లో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన “టి పి ఏ డేసెనరీ అవార్డ్స్ గాల - 2026” కార్యక్రమంలో శ్రీకాంత్ మజ్జిగ ప్రతిష్ఠాత్మకమైన “డెక్కెడ్ ఆఫ్ సర్వీస్ అవార్డు” “మైండ్, మెరిట్ అవార్డు”లను అందుకున్నారు. ఈ అవార్డులను హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా స్వీకరించడం విశేషం. మనోవిజ్ఞాన శాస్త్రం, మానసిక ఆరోగ్య అవగాహన రంగాల్లో ఆయన అందించిన సేవలు, అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యానికి గుర్తింపుగా ఈ పురస్కారాలు లభించాయి.శ్రీకాంత్ మజ్జిగ గత 10 సంవత్సరాలుగా కౌన్సెలింగ్ సైకాలజిస్టు, సైకోథెరపిస్టు, ఫ్యామిలీ కౌన్సెలర్, లైఫ్ స్కిల్స్ ట్రైనర్‌గా సేవలందిస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎదుర్కొనే భావోద్వేగ, ప్రవర్తనా, విద్యాసంబంధిత సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. భారతదేశంతో పాటు అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, మధ్యప్రాచ్య దేశాల ప్రజలకు కూడా కౌన్సెలింగ్ సేవలు అందిస్తూ అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటుతున్నారు. భిన్న సంస్కృతుల వారితో సులభంగా మమేకమయ్యే ఆయన సామర్థ్యం ఆయన సేవలకు మరింత విశ్వసనీయతను తెచ్చిపెట్టింది.ఎం.ఎస్సి సైకాలజీతో పాటు కౌన్సెలింగ్, రిహాబిలిటేషన్ సైకాలజీలో ప్రత్యేక డిప్లొమాలు పూర్తి చేసిన ఆయన, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బి.ఎడ్ పూర్తి చేశారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ లో శిక్షణ పొందిన ఆయనకు మానసిక ఆరోగ్య రంగానికి చేసిన సేవలకు గాను గౌరవ డాక్టరేట్ కూడా లభించింది.రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా ఉన్న శ్రీకాంత్, “బెస్ట్ సైకాలజిస్ట్ అవార్డు 2023”, “ఇన్స్పైరింగ్ సైకాలజిస్ట్ అవార్డు 2024” వంటి పలు జాతీయ స్థాయి పురస్కారాలను అందుకున్నారు.ప్రస్తుతం హెచ్ టి ఏ తేజస్ కౌన్సిలింగ్ సెంటర్, చింతల్ హైదరాబాదులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో మానసిక స్థైర్యం, భావోద్వేగ సమతుల్యత, సానుకూల జీవన విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.“చిన్న ఊరిలో మొదలైన ప్రయాణం నేడు అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడం యువతకు ఆదర్శం” అని స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.



## తిరుపతమ్మ అమ్మవారికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దంపతుల ప్రత్యేక పూజలు

ఖమ్మం వుదయం బ్యూరో మే 17

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన ధర్మపత్ని విజయలక్ష్మీ ,కుమారులు నిఖిల్ చంద్ర,నాగరాజు, బంధువులు తోట రమేష్,నా నబాల హరీష్ లతో కలిసి ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో కొలువైన శ్రీతిరుపతమ్మ అమ్మ వారి ఆలయాన్ని ఆదివారం సందర్శించారు.ఈ సందర్భంగా వారు దీపాలు వెలిగించి,తమ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు,గోవులకు మేత తినిపించారు. వేదపండితులు సాదరంగా ఆహ్వానించి రవిచంద్ర, నిఖిల్ చంద్ర, నాగరాజులను కండువాలతో సత్కరించి, విజయలక్ష్మీకి చీర,తీర్థ ప్రసాదాలు బహూకరించి,
ఆశీర్వచనాలు పలికారు.

## నకిలీ పత్తి విత్తనాలు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు




జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

జయశంకర్ భూపాలపల్లి మే 17(వుదయం జిల్లా ప్రతినిధి)

భూపాలపల్లి జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు, నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, హెచ్చరించారు ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు, ముఖ్యంగా బి జీ 3 వంటి నిషేధిత విత్తనాల విక్రయం పూర్తిగా చట్టవిరుద్ధమని తెలిపారు. రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు,
నకిలీ ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాలో ఎవరైనా నిషేధిత విత్తనాలు లేదా నకిలీ ఎరువులు విక్రయిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకుని రెండేళ్ల వరకు జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు.జిల్లాలో నకిలీ విత్తనాల అరికట్టటానికి ప్రతి మండలములో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల సమన్వయంతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నకిలీ విత్తనాలు లేదా నకిలీ ఎరువుల విక్రయాల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీస్ అధికారులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

## రైతు కన్నీళ్లకు కారణం ఎవరు..?

యాదాద్రి భువనగిరి / మే 17
(వుదయం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్రంలో రైతుల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు కందాడి మణిపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కష్టపడి పండించిన ధాన్యానికి సరైన ధర లేకపోవడం, కొనుగోలు కేంద్రాల్లో ఆలస్యం, దళారుల దందా కారణంగా అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆరోపించారు. రైతు నాలుగు నెలలు రేయింబవళ్లు శ్రమించి పంట పండిస్తే, అమ్ముకునేందుకు మరో మూడు నెలలు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది అని అన్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని పంట పండించిన రైతుకు న్యాయం చేసే వారు లేకపోవడం దురదృష్టకరం అని మణిపాల్ రెడ్డి పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో దళారుల ఆధిపత్యం పెరిగిపోయిందని .

దీంతో ప్రతి క్వింటాల్ పై రైతుకు సుమారు రూ.600 నష్టం వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట సాగు కోసం రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుంటున్నారని, ఆ అప్పులు . ప్రభుత్వం నుంచి చెల్లింపులు ఆలస్యం కావడం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవినీతి అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు రోజుల తరబడి ధాన్యం కళ్లాల్లోనే నిల్వ ఉంచాల్సి వస్తోందని విమర్శించారు. సరైన రక్షణ లేక ధాన్యం తడిసి నష్టపోతుండగా, రైతుల కళ్లల్లో కన్నీళ్లు మాత్రమే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న రైతు ఆత్మహత్యలు ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమని ఆయన అన్నారు. రైతు ఆత్మహత్య చేసుకుంటే దాన్ని సాధారణ మరణంగా కాకుండా ప్రభుత్వ హత్యగా పరిగణించాలి అని, రైతు బతికితేనే దేశం బతుకుతుంది అని అన్నారు. రైతుల పట్ల ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని, దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేసింది. రైతుకు గిట్టుబాటు ధర, తక్షణ చెల్లింపులు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఎఫ్‌సెట్‌లో రేస్ విద్యార్థుల సత్తా

కోదాడ మే 17(వుదయం)



ఎఫ్‌సెట్ ఫలితాల్లో రేస్ కాలేజీ విద్యార్థులు మెరిశారు. పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. మొక్కా చరణ్ సాయి 380, ఐ.కృష్ణ చరణ్ 440, సిహెచ్ భాను శంకర్ 1775, డి విజయ్ చరణ్ 2135, సిహెచ్ ఉత్తేజ్ 5231, లేఖనా రెడ్డి 6749, కురువ నవీన్ 7354, వంగవీటి అక్షయ 8462, వెంకటదత్త కిరణ్ 9748 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కాలేజీ చైర్మన్ బాణాల వసంత రెడ్డి విద్యార్థులను అభినందించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులకు అభినందనలు

**పెద్దపల్లి, మే 17(ఉదయం ప్రతినిధి)**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన విద్యా వారోత్సవాలు పెద్దపల్లి జిల్లాలో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల చివరి రోజున జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్ (ఐడీఓసీ) కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులను ఘనంగా సన్మానించారు.పదో తరగతి పరీక్షల్లో 550కు పైగా మార్కులు సాధించి ప్రతిభ చాటిన మంథని మండలం ఏక్లాస్‌పూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పుల్లె సాగరిక, నాగుల అంజనీశ్రీలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి శారద మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనే విషయానికి ఈ విద్యార్థుల ఫలితాలే నిదర్శనమన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులతో సమానంగా పోటీ పడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదల, కృషితో ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మంథని మండలం ఏక్లాస్‌పూర్ గ్రామ పాఠశాలలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి వారి ప్రతిభను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొని వారిని అభినందించారు.



కలెక్టర్, ప్రభుత్వ విప్ చేతుల మీదుగా ప్రతిభావంతులకు అభినందనలు

## ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య

### విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





**నిర్మల్ జిల్లా, 17 మే, (ఉదయం ప్రతినిధి)**

ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్, జిల్లాలో విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారని అన్నారు.ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తోందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులు విద్యాబోధన అందిస్తున్నారని చెప్పారు. తాను కూడా ప్రభుత్వ బడుల్లోనే విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నానని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి అనేక మంది ప్రపంచస్థాయిలో ఉన్నత స్థానాలకు చేరుకున్నారని తెలిపారు.విద్యార్థులు చదువుతో పాటు ఆటలు, పాటలు, యానిమేషన్, డాన్స్, పెయింటింగ్ వంటి రంగాల్లోనూ ప్రతిభ కనబర్చాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని కోరారు.ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చారని, ఇది జిల్లాకు గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా నగదు బహుమతులు,ప్రశంసా పత్రాలతో సత్కరించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఏసీజీఈ పరమేశ్వర్, అధికారులు, ఎంఈఓలు, విద్యార్థులు, పోషకులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలి

### అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలి



**పెద్దపల్లి, మే 17(ఉదయం ప్రతినిధి)**

జిల్లాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మండలంలోని మడిపల్లి కాలనీ,గంగారం గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అలాగే వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న వరి ధాన్యం, మక్కల కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం మండలంలోని మంగపేట గ్రామంలో ఉన్న అన్నదాత రైస్ మిల్లును సందర్శించి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా ప్రతి రోజూ లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అధికారులు, మిల్లర్లు పరస్పర సమన్వయంతో పని చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు చేయాలన్నారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ అధికారులు రవీందర్, రాజిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అడ్లూరిని కలిసిన చిలుముల లక్ష్మణ్

### మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకంపై మంత్రికి కృతజ్ఞతలు



**ధర్మపురి,మే17 (ఉదయం ప్రతినిధి):**

ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన నాగారం సర్పంచ్ చిలుముల లక్ష్మణ్ ఆదివారం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి,శాలువతో సన్మానించి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిలుముల లక్ష్మణ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం, విశ్వాసంతో ఈ బాధ్యతను అప్పగించేందుకు సహకరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటానని పేర్కొన్నా రు. మంత్రి ఆశయాలకు అనుగుణంగా, పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు, కార్య కర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ దినేష్, మున్సి పల్ చైర్మన్ నాగలక్ష్మి, ఎఎంసి చైర్మన్ చిలుముల. లావణ్య,అన్ని గ్రామాల సర్పంచ్ లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే గురుతర బాధ్యత గురువులదే

### విద్యా విజయోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే, కలెక్టర్ వెల్లడి

**నిజామాబాద్, మే 17 : (ఉదయం ప్రతినిధి)**



చక్కటి విద్యా బుద్ధులు నేర్పించి భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే గురుతర బాధ్యతను ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించాలని నిజామాబాద్ అర్బన్ శాసన సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో విద్యా విజయోత్సవ దినం నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే, కలెక్టర్ తో పాటు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వారోత్సవాలలో భాగంగా జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాలను, జిల్లా విద్యాశాఖ సాధించిన ప్రగతి గురించి డీ.ఈ.ఓ అశోక్ ముందుగా నివేదిక రూపంలో తెలియజేశారు.

ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ, భావి భారత పౌరులైన విద్యార్థులకు చక్కటి భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత గురువులదేనని, అందుకే సమాజంలో గురువులకు ఎంతో గౌరవం, గొప్ప స్థానం ఉందని గుర్తు చేశారు. 2047 వరకు భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దాలనే ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పాన్ని సాకారం చేసేవిధంగా విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్ళలో అత్యధిక మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచిన విద్యార్థిని, విద్యార్థులకు నగదు పురస్కారాలు, బహుమతులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహూకరించారు. బాల సాహిత్య విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను అతిథులు తిలకించారు. ఈ కార్యక్రమంలో బీ.సీ., మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు నర్సయ్య, కృష్ణవేణి, జిల్లా పౌర సంబంధాల అధికారిణి ఎన్.పద్మశ్రీ, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, జీఈసీఓ భాగ్యలక్ష్మి, ఎం.ఈ.ఓలు, హెచ్.ఎంలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## క్రీడా వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ




**రాజన్న సిరిసిల్ల, మే -17 (ఉదయం ప్రతినిధి)**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 డేస్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఈ నెల 18 వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఇందులో భాగంగా 18వ తేదీన సోమవారం జిల్లాస్థాయిలో ఉదయం ఏడు గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు 2కే రన్ ప్రోగ్రాం జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఏ రాందాసు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.వివిధ పాఠశాలల, కళాశాలల బాల బాలికలు, యువత, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ కోచ్ లు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, క్రీడా అసోసియేషన్ సభ్యులు, ప్రెసిడెంట్లు తరలివచ్చి విజయవంతం చేయాలని రాందాస్ కోరారు. అలాగే ఈ నెల 23వ తేదీన సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్ లో నిర్వహింకానున్న జాబ్ మేళా పోస్టర్లు ఆవిష్కరించారు.

## వ్యవసాయ కార్మిక సంఘం

### మండల అధ్యక్షుడిగా పూసవేర్ల రాజన్న




**జన్నారం, మే 17 (ఉదయం)**

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జన్నారం మండల నూతన కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల అధ్యక్షుడిగా పూసవేర్ల రాజన్న, ప్రధాన కార్యదర్శిగా మగ్గిడి జయ, లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. జన్నారంలో జరిగిన సంఘం సమావేశంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కొండగోర్ల లింగన్న ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.వ్యవసాయ కార్మిక సంఘం ఎల్లప్పుడూ రైతులు, రైతు కూలీల హక్కుల కోసమే నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. నూతన కమిటీతో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రైతులు,కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నూతన కమిటీ పోరాటం చేయాలని, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్కూళ్ళలో మెరుగైన వసతులు

**రాజన్న సిరిసిల్ల, మే -17 (ఉదయం ప్రతినిధి)**

విద్యాభివృద్ధిపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి ముందుకుసాగుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజులకార్యాచరణలోభాగంగా ఈనెల 11 వతేదీనుంచి 17వతేదీవరకువిద్యాశాఖ విజయోత్సవం ముగింపు సందర్భంగా జిల్లా సమీకృత కార్యాల యాల సముదాయంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జయ జయహే తెలంగాణ పాటను వినిపించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పది, ఇంటర్లో ఉత్తమ ప్రతిభ చూపిన. వివిధ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ లో రాణించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు అందజేసి.. అభినందించారు.పదో తరగతి, ఇంటర్ లో 11 మంది విద్యార్థులు మంచి మార్కులు సాధించగా, లక్ష రూపాయలు ప్రోత్సాహం కింద అందజేశారు.బడికి తక్కువ సెలవులు తీసుకుని హాజరు అయిన టీచర్లను సన్మానించారు.

## బడీడు పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో చేరడం ఆందోళనకరం

### సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు

**ఆసిఫాబాద్ ( ఉదయం ప్రతినిధి )**



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం రోజు జరుగుతున్న 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన విద్యా విజయోత్సవంలో పాల్గొని ప్రసంగించిన సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడీడు పిల్లలు మూడింట రెండో వంతు ప్రైవేట్ పాఠశాలల్లో చేరుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నా, మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలతో ప్రభుత్వ పాఠశాలలు పోటీ పడగలిగినప్పుడే ప్రభుత్వ పాఠశాలల మునగడ సాధ్యమవుతుందని తెలిపారు.అనంతరం పది మరియు ఇంటర్ లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిత, అడిషనల్ కలెక్టర్ యువరాజ్ మరమట్, డిఇఒ లలిత, గ్రంధాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, మున్సిపల్ చైర్మన్ ఆకాష్, అలీ బిన్ అహమ్మద్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## బారెగూడలో ఉచిత దంత వైద్య శిబిరం

**బెజ్జూర్ ( ఉదయం ప్రతినిధి )**

కొమరం భీం ఆసిఫాబాద్ తెలంగాణ డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హరీష్ అన్న ఆరోగ్య బాధ్యత ద్వారా జిల్లా సిరిపూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు ప్రోత్సాహంతో తెలంగాణ డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ చైర్మన్ మణిదీప్ బాలుసాని సెక్రెటరీ సామల రసజ్ఞ వారి వైద్య బృందం మరియు కీర్తి డెంటల్ క్లినిక్ వారిచే బెజ్జూర్ మండలం బారెగూడ గ్రామంలో ఆదివారం రోజున ఉచిత దత్త వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని సెక్రెటరీ డాక్టర్ సామల. రసజ్ఞ తెలిపారు.

ఈ కార్యక్రమానికి బారెగూడ గ్రామ సర్పంచ్ తేలి. సుశీల బాపు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజల నుండి విశేష స్పందన లభించిందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వైద్యుల సలహాలు పాటించాలని డాక్టర్ సామల. రసజ్ఞ ,డాక్టర్ కీర్తి సూచించారు .

## ప్రభుత్వ పాఠశాలల ఫలితాలపై విస్తృత ప్రచారం చేయాలి

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్






**జగిత్యాల మే 17 (ఉదయం ప్రతినిధి) :**

ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మంచి ఫలితాలు ప్రతి ఒక్కరికి తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ వయోవృద్ధులు వికలాంగులు ట్రాన్స్ జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు ఆదివారం "99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యా వారోత్సవములు తేదీ 11 5 2026 నుండి 17 5 2026 వరకు నిర్వహిస్తున్న సందర్భంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన విద్యా వారోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కృషి చేస్తుందని తెలిపారు ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఇంత మంచి మార్కులు సాధించడం ఆనందదాయకమని తెలిపారు ఈ ఫలితాల సాధనలో కృషి చేసిన ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులకు (హెడ్ మాస్టర్లకు) కృతజ్ఞతలు తెలిపారు ప్రతి హైస్కూల్ పరిధిలో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇంటర్ చదివే దశలో కొంతమంది విద్యార్థులు చెడు అలవాట్లకు గురయ్యే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు విద్యార్థులు ఎటువంటి చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఎస్ఎస్సిలో రాష్ట్రంలోనే నాలుగవ స్థానాన్ని రెండు సంవత్సరాలుగా నిలుపుకోవడం మంచి పరిణామమని తెలిపారు ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులకు అభినందనలు తెలిపారు విద్యకై రాష్ట్ర ప్రభుత్వం చాలా శ్రద్ధ కనబరుస్తుందని తెలియజేశారు గత ఏడాదితో పోల్చితే ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఇంటర్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని తెలిపారు ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు (హెడ్ మాస్టర్లు) విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు అనంతరం పదవ తరగతిలో మంచి ఫలితాలు ఎస్ఎస్సి లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లాలోని ముగ్గురు టాపర్ లకు జాహ్నవి 580 మార్కులు (మోడల్ స్కూల్ కోరుట్ల) ప్రణీత 578 మార్కులు (జడ్పి హెచ్ఎస్) సాయి చరణ్ 578 (జడ్పీ హెచ్ఎస్ మోహన్ రావు పేట) ఈ విద్యార్థులు ఇతరులకు స్ఫూర్తిగా నిలిచేలా ఎదగాలని ఆకాంక్షించారు జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన గణనీయంగా మెరుగుపడిందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె రాము జిల్లా ఇంటర్మీడియట్ నారాయణ డిఆర్డిఓ రఘువరన్ జిల్లా స్థాయి అధికారులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్ దినేష్ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు వివిధ మండలాల విద్యాధికారులు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘం నాయకులు తల్లిదండ్రులు స్థానిక కౌన్సిలర్ లు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

**బెజ్జూర్ , మే 17, ( ఉదయం ప్రతినిధి )**

విధులలో నిబంధనలు పాటించని పంచాయితీ కార్యదర్శి సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని దహేగాం మండలం బిబ్రా గ్రామపంచాయతీలో సర్పంచ్, ఉప సర్పంచ్ లు కార్యదర్శిపై చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేసిన విచారణలో పంచాయతీ కార్యదర్శి డి.సుమలత గ్రామపంచాయతీ తీర్మానం, సర్పంచ్, ఉపసర్పంచ్ ఆమోదం లేకుండా 1 లక్ష 2 వేల 297 రూపాయల నిధులను నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేశారని, ఇతర చెల్లింపులలో నిబంధనలు పాటించలేదని తేలడంతో సదరు పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు. గ్రామపంచాయతిలో నిధులు చెల్లింపు పారదర్శకంగా చేయాలని, నిబంధనలు అతిక్రమించినా, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

### బెజ్జూర్ లో ఉచిత మెగా వైద్య శిబిరం ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ



**బెజ్జూర్ ( ఉదయం ప్రతినిధి )**

"పోలీసులు మీకోసం" కార్యక్రమంలో భాగంగా బెజ్జూర్ పోలీసుల ఆధ్వర్యంలో, మెడిలైఫ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మంచిర్యాల వారి సహకారంతో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ హాజరై మెగా మెడికల్ క్యాంపును ప్రారంభించారు.ఈ మెడికల్ క్యాంపులో సుమారు 500 మంది ప్రజలు పాల్గొని ఈసీజీ, 2డీ ఇకో, షుగర్ పరీక్షలు, బీపీ చెకప్, కంటి పరీక్షలు వంటి వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జనరల్ మెడిసిన్, పల్మనాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ,రేడియోలజీ, జనరల్ సర్జరీ, న్యూరో ఫిజీషియన్, డెంటల్, ఇ.ఎన్.టి వైద్యులు చికిత్సలు నిర్వహించారు. కంటి అద్దాలు అవసరమైన 50మందికి అందించారు.ఈ సందర్భంగా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ... ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం కోసం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అలాగే ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, ఏ సమస్య వచ్చినా సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా డయల్ 100ను సంప్రదించాలని సూచించారు. పోలీసు శాఖ ప్రజల భద్రతతో పాటు వారి ఆరోగ్య సంక్షేమం పట్ల కూడా బాధ్యతతో పనిచేస్తుందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు .ఈ కార్యక్రమంలో కాగజ్నగర్ డిఎస్పి వాహిదుద్దీన్, కౌటాల సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్, బెజ్జూర్ సబ్ ఇన్స్పెక్టర్ సర్తజ్ పాషా , వైద్య బృందం, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్కెపల్లి చెరువును పరిశీలించిన మంత్రి లక్ష్మణ్ కుమార్



**ధర్మపురి,మే17(ఉదయం ప్రతినిధి):**

ధర్మపురి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సా గుతోందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూ రి.లక్ష్మణ్ స్పష్టం చేశారు.నియోజకవ ర్గంలో నిలిచిపోయిన పెండింగ్ ప్రాజెక్టు లన్నింటినీ ఏడా ది కాలంలోపు పూర్తి చేసి రైతులకు అంకితం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఆదివారం ధర్మపు రి మండలంలోని అక్కెపల్లి చెరు వును ఇరిగేషన్ శాఖ అధికారు లు,స్థానిక ప్రజాప్రతినిధులు ,రైతు లతో కలిసి మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించా రు.త్వరలోనే పనులు ప్రారంభించి, రైతుల సూచనల మేరకు దాదాపు 5 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం. గత పాలకులు అటవీ శాఖ అనుమతులు లేకుండానే రోళ్లవాగు ప్రాజెక్టు పనులు ప్రారంభించా రని మంత్రి అడ్లూరి ఆరోపించారు.ప్రా జెక్టు అంచనా లను భారీగా పెంచి, రైతులకు కనీసం ఒక్క ఎకరానికి కూడా నీరివ్వకుండా మోసం చేశారన్నారు. తాము అటవీ శాఖ అనుమ తులు సాధించి,రోళ్లవాగు ప్రాజెక్టు ను పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.రాబో యే గోదావరి పుష్క రాల నిర్వహణ కోసం ప్రభుత్వం మొదటి విడతగా రూ.118 కోట్లు విడుదల చేసిందని మంత్రి వెల్ల డించారు. వీటికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ త్వరలోనే పూర్తి కానుం దని, అధికారులు, స్థానిక ప్రజాప్రతి నిధులు అన్ని వర్గాల ప్రజలను సమ న్వయం చేసుకుంటూ పుష్క రాల పనులను విజయవం తం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ సంఘనబట్ల. దినేష్, ఎఎంసి చైర్మన్ చిలుముల.లావణ్య, మండల అధ్యక్షుడు చిలుముల.లక్ష్మ ణ్,మాజీ జెడ్పిటిసి బాధినేని.రాజేం దర్,సీనియర్ నాయకులు గడ్డం.భాస్క ర్ రెడ్డి,ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## యువతకు సువర్ణావకాశం

**నేటి నుంచి జిల్లాలో ఘనంగా యూత్ వీక్ సెలబ్రేషన్స్–2026" క్రీడలు..నైపుణ్యాభివృద్ధి.. ఉద్యోగ అవకాశాలతో వారంరోజుల సందడి**

**గద్వాల,మే 17 (వుదయం ప్రతినిధి)**

యువతలో క్రీడాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు జిల్లా యువజన మరియు క్రీడాశాఖ ఆధ్వర్యంలో "యూత్ వీక్ సెలబ్రేషన్స్–2026" కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు రిజ్వాన్ భాష షేక్ తెలిపారు. "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వరకు జిల్లా, మండల స్థాయిల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

వేడుకల్లో భాగంగా ప్రతి రోజూ ప్రత్యేక అంశాలతో కార్యక్రమాలు నిర్వహించను న్నారు. మే 18న "ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ" పేరిట 5కే రన్, మారథాన్, 2 కిలోమీటర్ల వాక్‌థాన్, యోగా, జుంబా, ఫిట్‌నెస్ అవగాహన కార్యక్రమాలు ఉంటాయి. మే 19న "కెరీర్ & స్కిల్ డెవలప్‌మెంట్ డే" సందర్భంగా కెరీర్ గైడెన్స్, నైపుణ్యాభివృద్ధి వర్క్‌షాపులు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవగాహన, పోటీ పరీక్షలపై సూచనలు అందించనున్నారు.మే 20న "యూత్ లీడర్షిప్ సమ్మిట్" నిర్వహించి నాయకత్వ శిక్షణ, మోటివేష నల్ సెషన్లు, యూత్ పార్లమెంట్, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు చేపట్టనున్నారు. మే 21న "ప్లే అండ్ పార్టిసిపేట్ స్పోర్ట్స్ డే"లో భాగంగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ తదితర గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహిస్తారు. మే 22న "సర్వ్ & సపోర్ట్ యూత్ ఫర్ క్లీన్ తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలు, మొక్కల నాటకం, శుభ్రత డ్రైవ్స్, అవగాహన ర్యాలీ లు నిర్వహించనున్నారు. చివరి రోజు మే 23న "కనెక్టింగ్ టాలెంట్ విత్ ఆపర్చు నిటీస్" పేరిట మెగా జాబ్ మేళా, ఉద్యోగ నమోదు, ఇంటర్వ్యూలు,
కెరీర్ కౌన్సిలింగ్, ప్లేస్‌మెంట్ సపోర్ట్ కార్యక్రమాలు చేపట్టను న్నారు. జిల్లాలోని యువత, విద్యార్థులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# సింఫనీ పార్క్ హోమ్స్ స్థలాలను పరిరక్షిస్తాం

- పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి
- కాలనీవాసులతో సమావేశం.. అధైర్యపడవద్దని భరోసా..



**పటాన్చెరు ,మే17(వుదయం ప్రతినిధి):** పటాన్చెరు డివిజన్ పరిధిలోని సింపని పార్క్ హోమ్స్ లో గల కాలనీ స్థలాలను ఆక్రమణలకు గురి కాకుండా పరిరక్షిస్తామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కాలనీవాసులకు భరోసా అందించారు. గజం స్థలం సైతం కబ్జా కానివ్వమని తెలిపారు. కాలనీ ఏర్పాటు చేసిన సమయంలో కాలనీ అవసరాల కోసం ఆరు వేల గజాల స్థలాన్ని సంబంధిత బిల్డర్ కేటాయించడం జరిగిందని.. తదనంతరం బిల్డర్ స్వార్థంతో కొందరు వ్యక్తులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని.. ఈ అంశంపై హైకోర్టులో స్టే ఉన్నప్పటికీ..ఇటీవల కొందరు ఆ భూమి తమకు రిజిస్ట్రేషన్ చేశారంటూ కబ్జా చేసేందుకు ప్రయత్నించడం జరుగుతోందంటూ కాలనీవాసులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై చర్చించేందుకు ఆదివారం ఉదయం సింఫనీ పార్క్ హోమ్స్ కమ్యూనిటీ లో నివసిస్తున్న గృహ యజమానులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగా కాలనీ అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని బిల్డర్ కక్కుర్తి తో ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయడం చట్టపరంగా నేరమని తెలిపారు. చట్టం ప్రకారం ఈ స్థలం కాలనీకి చెందుతుందని తెలిపారు. ఈ అంశంలో ఎవరైనా తమ స్థలం అంటూ బలప్రయోగానికి దిగితే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాలనీ వాసులు ధైర్యంగా ఉండాలని.. ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు.. ఆంజనేయ స్వామి దేవాలయాన్ని పునర్నిర్మించడంతోపాటు రామాలయం, శివాలయం, అమ్మవారి దేవాలయాలను సైతం సొంత నిధులతో నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.2016లో కాలనీ ఏర్పాటైన నుండి నేటి వరకు అన్ని అంశాల్లో అండగా ఉంటూ తమ కాలనీకి కుటుంబ పెద్దగా వ్యవహరిస్తున్న పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి ఎల్లప్పుడు రుణపడి ఉంటామని దిశా కమిటీ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కాసాల సుధాకర్ అన్నారు. కాలనీ అభివృద్ధిలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాత్ర మరువలేనిదని అన్నారు. తాము ఎల్లప్పుడూ ఆయనకు అండగా ఉంటామని తెలిపారు. కాలనీలో మౌలిక వసతుల కోసం కేటాయించిన స్థలం అంశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సహకారానికి కాలనీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, జిహెచ్ఎంసి ఈఈ సురేష్ సిఐ వినాయక్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, హమీద్, డిఈ కృష్ణవేణి, కాలనీ అధ్యక్షులు సత్తిరాజు, సత్య రావు, లింగరాజు, విజయ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా 'హ్యాపీ సండే' వేడుకలు
## భారీగా తరలివచ్చిన జనం

**మహబూబ్ నగర్ ,మే17 (వుదయం ప్రతినిధి)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు మహబూబ్ నగర్ స్టేడియం కమాన్ ప్రధాన రోడ్డు కూడలి వద్ద మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హ్యాపీ సండే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారుల చేత సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు, డాన్స్ ప్రదర్శనలు, మ్యాజిక్ షో, యోగాసనాలు, మిమిక్రీ షో ప్రేక్షకులకు అలరించాయి. సీనియర్ సిటిజన్ల డాన్స్ ప్రదర్శనలు, అలాగే విద్యార్థుల కరాటే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు స్టాళ్లు ఏర్పాటు చేసి వారు తయారు చేసిన పౌష్టికాహార పదార్థాలు ఇతర వస్తువులను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# చదువుతో పాటు విద్యార్థుల్లో మానసిక స్థైర్యం పెంపొందించాలి





**సిద్దిపేట, మే 17 (వుదయం బ్యూరో)**

- కలెక్టర్ కె. హైమావతి
- ఇందిరానగర్ జెడ్పీ హైస్కూల్‌లో ఘనంగా విద్యా వారోత్సవాల ముగింపు
- ప్రతిభ చాటిన విద్యార్థులకు రూ.10 వేల చెక్కులు, ప్రశంసా పత్రాల పంపిణీ
- త్వరలోనే ప్రభుత్వ బడుల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్.. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, జీవితంలో ధైర్యంగా నిలబడడం, మానసిక, శారీరక సామర్థ్యాలను పెంపొందించుకోవడం మరియు నాయకత్వ లక్షణాలతో కూడిన మంచి విలువలను అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఉపాధ్యాయులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ'లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన విద్యా వారోత్సవాల (విద్యా విజయోత్సవం) ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం:**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇప్పటివరకు 10 ప్రత్యేక థీమ్‌లతో వారానికో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిల్లో సభలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల వద్దకే తీసుకెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.


**పరీక్షల్లో కాపీ కొట్టొద్దు.. విలువలే ముఖ్యం!**

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఫలితాలు ఎలా వచ్చినా పర్వాలేదు.. విద్యార్థులను బాగా చదివించండి. కానీ, పరీక్షల్లో కాపీ కొట్టే అలవాటును ప్రోత్సహించవద్దు. విద్యార్థులకు ఉన్నతమైన విలువలను నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంది. పుట్టగానే పిల్లలు తల్లిదండ్రులను, పాఠశాల దశకు రాగానే ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకుంటారని, అందుకే వారి పక్కన ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలబడాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగడానికి పాఠశాల విద్యే బలమైన పునాది (బేసిక్ ఫౌండేషన్) అని స్పష్టం చేశారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో 97 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, దీని వెనుక కృషి చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. పదో తరగతి వరకు సాగినట్లు ఇంటర్ చదువు ఉండదని, ఇంటర్‌లో విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్టుల ఆధారంగా ఇష్టమైన రంగంలో ఉన్నతంగా ఎదగాలని కోరారు. మీరు దేనినైతే నమ్ముతారో, ఎవరినైతే గౌరవిస్తారో.. వాటిని బట్టే సమాజంలో మీకు గుర్తింపు, గౌరవం లభిస్తాయని చెప్పారు. చదువుతో పాటు ఆటలు, యోగా, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవడుతాయని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోబోతుందని కలెక్టర్ వెల్లడించారు. త్వరలోనే మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ (అల్పాహారం) పథకాన్ని అమలు చేయనున్నట్లు, అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సైతం మధ్యాహ్న భోజన వసతిని ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు.

**పోస్టర్ ఆవిష్కరణ.. బహుమతుల ప్రదానం** అనంతరం పదో తరగతిలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.10,000 నగదు చెక్కులను, క్రీడల్లో రాణించిన పలువురు విద్యార్థులకు ప్రశంసా పత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే, మే 18 నుండి 23వ తేదీ వరకు జరగబోయే 'యువత క్రీడల ప్రోత్సాహం' వారోత్సవాలకు సంబంధించిన గోడపత్రికను (పోస్టర్‌ను) ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి (DEO) శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**బీజేపీ రాష్ట్ర చీఫ్‌తో రఘురామయ్య గౌడ్ భేటీ**

## పార్టీని బలోపేతం చేస్తానని ధీమా



**నారాయణపేట ,మే17 (వుదయం ప్రతినిధి)**

ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమించిన సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ .రాంచందర్ రావు ను ఆదివారం కే.రఘు రామయ్య గౌడ్ కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.
పాలమూరు ఎంపీ.డి కే. అరుణమ్మ ,ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ ని కలసి వారిని శాలువాతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రఘు రామయ్య గౌడ్ మాట్లాడుతూ నాపై నమ్మకముంచి రాష్ట్ర మోర్చా కమిటీలో అవకాశం కల్పించి న ఎంపీ. అరుణమ్మ ,రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ పాండు రెడ్డి ,జిల్లా మాజీ అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్,జిల్లా ఇంచార్జి బొక్క బాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీని పటిష్టం చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో మహబూబ్ అలీ,జి.ఆర్ రెడ్డి,పగడాకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**నీట్ రద్దు నిర్ణయంపై మండిపడ్డ కూన వేణుగోపాలకృష్ణ:**



**సంగారెడ్డి, మే 17 (వుదయం ప్రతినిధి)**

నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థుల జీవితాలు నాశనం అవుతున్నాయని యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సంగారెడ్డిలో ఆయన మాట్లాడుతూ, నెలల తరబడి కష్టపడి పరీక్షలకు సిద్ధమైన విద్యార్థులు నీట్ రద్దు కారణంగా తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని అన్నారు.పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతోందని విమర్శించారు. ఇకపై పేపర్ లీకేజీలు జరగకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుని పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.
విద్యార్థుల మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**మెదక్ జిల్లా, మే17(వుదయం ప్రతినిధి):** నిజాంపేట మండల పరిధిలోని రజాక్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల కాసింపూర్ గ్రామానికి చెందిన పంజా మల్లేశం గుండెపోటుతో మరణించడం జరిగింది.ఇట్టి విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కనకరాజు వారి కుటుంబ సభ్యులను పరామర్శించే 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కుంట నర్సింలు, జీడి నారా గౌడ్, కంతుల బిక్షపతి, యాదగిరి, కొ ము ర య్య , శ్రీ శై లం , యాదగిరి,కనకరాజు, జీడి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ వేదికపై తెలుగు వైద్యుడి ప్రతిభ

**అంతర్జాతీయ న్యూరోసర్జికల్ సదస్సుకు హాజరైన ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగార్జున బూత్కూరి**

**వెల్దండ ,మే 17 (వు దయం)**



ముంబైలో న్యూరలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించిన ప్రతిష్టాత్మక అంతర్జాతీయ న్యూరోసర్జికల్ సదస్సు మిషన్ 2026 లో వెల్దండ మండలానికి చెందిన ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ నాగార్జున బూత్‌కూరి పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ న్యూరోసర్జన్లు, అంతర్జాతీయ అధ్యాపక సభ్యులు హాజరైన ఈ సదస్సు, సమకాలీన న్యూరోసర్జికల్ పరిజ్ఞానం మరియు వైద్య సహకారాన్ని పెంపొందించేందుకు కీలక వేదికగా నిలిచింది. సదస్సు సందర్భంగా డాక్టర్ నాగార్జునకు ప్రపంచ ప్రఖ్యాత న్యూరోసర్జన్లు, వైద్య రంగంలోని దిగ్గజాలతో ప్రత్యక్షంగా చర్చించే అవకాశం లభించింది. ముఖ్యంగా సెరెబ్రోవాస్కులర్ మరియు స్కల్ బేస్ న్యూరోసర్జరీలో తన మార్గదర్శక కృషికి అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రముఖ వాస్కులర్ న్యూరోసర్జన్ రాబర్ట్ స్పెట్జ్లర్తో సమావేశమై ఆధునిక మైక్రోసర్జికల్ పద్ధతులు, న్యూరోసర్జరీలో తాజా పురోగతులపై చర్చించారు.అలాగే అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన జర్మన్ న్యూరోసర్జన్, ఇంటర్నేషనల్ న్యూరోసైన్స్ ఇన్స్టిట్యూట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మజీద్ సమీను కూడా డాక్టర్ నాగార్జున కలిశారు. స్కల్ బేస్ న్యూరోసర్జరీలో మార్గదర్శకుడిగా గుర్తింపు పొందిన ప్రొఫెసర్ సమీతో జరిగిన చర్చలు వైద్య రంగంలో విశేష ప్రాధాన్యత సంతరించుకున్నాయి.ఇక వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ న్యూరోసర్జికల్ సొసైటీస్ నాయకత్వ సభ్యులతో పాటు ప్రపంచ న్యూరోసర్జికల్ సమాజానికి చెందిన పలువురు విశిష్ట ప్రతినిధులతో కూడా డాక్టర్ నాగార్జున అభిప్రాయాలు పంచుకున్నారు.మిషన్ 2026లో పాల్గొనడం ద్వారా నిరంతర వైద్య విద్యా నైపుణ్యాల అభివృద్ధి, ఆధునిక న్యూరోసర్జికల్ సాంకేతికతలను రోగులకు అందించాలనే
తన నిబద్ధతను డాక్

**ఆకుతోటపల్లిలో పైప్‌లైన్ పనులకు**

## భూమిపూజ చేసిన వీరేష్ గౌడ్



**రంగారెడ్డి జిల్లా , మే17 (వుదయం ప్రతినిధి)**

రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం ఆకు తోట పల్లి గ్రామ పంచాయతీలో డ్వాక్రా మహిళా బిల్డింగ్ మరియు ఎస్సీ కమ్యూనిటీ హాల్ పక్కన 7,8,9 వా వార్డు ప్రజలందరికీసకాలంలోదాహం తీర్చడానికి గ్రామ సర్పంచ్ మరియుఉ పసర్పంచ్,వార్డ్మెంబర్స్,అలాగే గ్రామ ప్రజలతో కలిసి గ్రామ సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి భూమి పూజ చేశారు, అలాగే బంగారు గడ్డన త్రాగునీరు సమస్య ఉన్నందున పైపులైన్ ద్వారా సమస్యను సర్పంచ్ తీర్చారు, వీరేష్ గౌడ్ కు ఎలాంటి పదవి లేకుండా ఇలా ముందుకు వచ్చి ఫిల్టర్ వాటర్ పెడుతున్నందుకు గ్రామప్రజలందరూ వారికిఅభినందనలుతెలిపారు,
ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ వార్డు మెంబర్స్ నరసింహ గౌడ్,దొడ్డవానికృష్ణయ్య,స్వరూపా క్రిస్టఫర్,కంబాలపల్లి బాలు, మాజీ ఉపసర్పంచ్ శేఖర్ గౌడ్,అండే కార్ రాజు, చంద్రాల ప్రవీణ్,జంగయ్య గౌడ్,అలివేలు,మొగులమ్మ,కలమ్మ, యా ద మ్మ , జం గ మ్మ , వెంకటమ్మ,నర్సమ్మ,వట్టి కోట యాదయ్య,వర్కాల పెద్దయ్య, కంబాలపల్లియాదయ్య
తదితరులు పాల్గొన్నారు

# మొయినాబాద్ జంట హత్యల కేసులో సంచలనం నిందితురాలి ఆత్మహత్యాయత్నంతో ఉత్కంఠ

హైదరాబాద్: మొయినాబాద్ జంట హత్యల కేసులో ప్రధాన నిందితురాలు కరీమాబేగం ఆత్మహత్యాయత్నం ఘటన కలకలం రేపింది. ఆబేదాబేగం, మహబూబాబీ.. తాండూరు పట్టణం ఇందిరమ్మ కాలనీలో ఉండే దంపతులు కరీమాబేగం,
రెహమాన్, వీరి బంధువు నయీంకు వేర్వేరుగా కొంత డబ్బు అప్పుగా ఇచ్చారు. చాలారోజులు అవడంతో డబ్బులు తిరిగివ్వాలని వారిపై మహిళలిద్దరూ ఒత్తిడి తెచ్చారు. దీంతో వారిని చంపేయాలని కరీమాబేగం, రెహమాన్, నయీం పథకం వేశారు. డబ్బు ఇస్తామని నమ్మించి ముందుగా మహబూబాబీని మొయినాబాద్ సమీపంలోని తోల్కట్ట ఫాంహౌస్ వద్దకు తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేసి, అక్కడే గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఆ తరువాత ఆబేదాబేగంను కూడా అక్కడికే తీసుకెళ్లి అదేరీతిలో హత్య చేసి పాతిపెట్టారు. ఈ కేసులో కరీమాబేగంను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆదివారం కరణ్‌కోట్ పీఎస్‌లో విచారిస్తుండగా.. బాత్రూమ్‌కు వెళ్లిన ఆమె ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించారు. హుటాహుటిన ఆమెను చికిత్స కోసం

# వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



**వనపర్తి మే 17 (వుదయం ప్రతినిధి):**
జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా కొనసాగించాలని, అదేవిధంగా గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ వరి కొనుగోళ్ల ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా కొనసాగించాలని, అదేవిధంగా గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైనన్ని లారీలను అందుబాటులో ఉంచి, రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత అవసరాల మేరకు నిర్దేశించిన కొనుగోలు కేంద్రాలకు అదనపు లారీలను పంపాలని ఆదేశించారు. మిల్లుల వద్ద అన్లోడింగ్ కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. . రైతులు తెచ్చిన ధాన్యాన్ని వేగంగా తూకం వేసి కేటాయించిన మిల్లులకు తరలించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, జిల్లా మేనేజర్ ఆంజనేయులు, ఇతర అధికారులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## కళాశాలలో ఘనంగా విద్యా వారోత్సవాలు




**వికారాబాద్మే , 17(వుదయం బొంరాస్ పేట ప్రతినిధి):**
ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా గత వారం రోజులుగా చేపట్టిన విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రోజారాణి అధ్యక్షతన, ముఖ్య అతిథిగా జిల్లా ఇంటర్ మీడియట్ అధికారి శంకర్ నాయక్ పాల్గొనగా ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా 202526 లో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఆయా గ్రూపు లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థినులను DIEO ఘనంగా సన్మానించారు. అనంతరం DIEO మరియు కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఇలాగే కళాశాలకు మరింత గుర్తింపు తెచ్చేలా విద్యార్థులు కృషి చేసి రాణించాలని ఆకాంక్షించారు.

ఈ విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమం లో ప్రభుత్వ జూనియర్ కళాశాల కొడంగల్ ప్రిన్సిపాల్ నరసింహ రెడ్డి, కళాశాల లెక్షరర్లు ఫాతిమా, కీర్తి, సామ్యూల్ మరియు కళాశాల టాపర్ లు పీ. పల్లవి, హారిక, సుష్మిత, భార్గవి, రేఖాశ్రీ, జీ. కీర్తి,MD హసన్ తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోళ్ళను వేగవంతం చేయాలి

**రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను**

**దామరగిద్ద ,మే17 (వుదయం ప్రతినిధి)**



వరి ధాన్యం కొనుగోళ్లను వేగంగా జరపాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను ఆదేశించారు. ఆదివారం ఆయన దామరగిద్ద మండలంలోని ఆశన్ పల్లి, మద్దూరు మండలంలోనిఖాజీపూర్ ,దమ్ గాన్ పూర్ ఐకెపి, పిఎసిఎస్, మెప్మా వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వరిలోని తేమ శాతాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కచ్చితంగా వరిని సేకరించాలని ఆయా కేంద్రాల ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. సేకరించిన వరిని, ట్యాగ్ చేయబడిన రైస్ మిల్లులకు వెంటనే తరలించేలా చూడాలని సూచించారు.అంతేకాకుండా ఓపిఎం ఎస్ లో రోజువారీ ట్యాబ్ ఎంట్రీలను ఎలాంటి ఆలస్యం లేకుండా వేగవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి సైదులు, డీ టి లు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిభకు పురస్కారం

## టెన్త్ టాపర్‌ను అభినందించిన ఎస్పీ పారితోష్ పంకజ్

**మనూరు మండల్/ సంగారెడ్డి మే 17 (వుదయం ప్రతినిధి)**

పదవ తరగతిలో అత్యధిక మార్కులు రావడంతో సంగారెడ్డి జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ ఆమెను సన్మానించారు సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పోలీసు పిల్లలను ఎస్పీ పారితోష్ పంకజ్ అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి విద్యార్థులను సన్మానించారు ఆయన మాట్లాడుతూ ఇలాగే బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు

కానిస్టేబుల్ మాక్సుద్ కూతురు మూర్స అనియా సుల్తానా పదవ తరగతిలో అత్యధిక మార్కులు రావడంతో ఆమెను ఎస్పీ పారితోష్ పంకజ్ మరియు అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి రెడ్డి సన్మానించారు ఈ కార్యక్రమంలో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను సన్మానించారు

# పిడుగుపాటుకు 30 గొర్రెల మృతి

- గొర్రెల కాపరికి త్రుటిలో తప్పిన ప్రమాదం
- గొర్రెల కాపరిని పరామర్శించిన మంత్రి జూపల్లి
- రూ.50 వేల తక్షణ సాయం అందించిన మంత్రి
- మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం పరిశీలన.
- రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా
- ధాన్యం కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు మంత్రి జూపల్లి



**కొల్లాపూర్, మే 17 (వుదయం ప్రతినిధి)**


కొల్లాపూర్ మండలం ఎనబెట్ల గ్రామ శివారులో శనివారం పిడుగుపాటుకు 30 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ప్రమాదంలో గొర్రెల కాపరి త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. విషయం తెలుసుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే స్పందించి, బాధిత గొర్రెల కాపరిని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని ఆయనను ఓదార్చారు. ప్రభుత్వం తరపున పూర్తి అండగా ఉంటామని హామీ ఇస్తూ, తక్షణ సహాయం కింద రూ.50 వేల నగదును అందజేశారు.

**తడిసిన ధాన్యం పరిశీలన..**

అనంతరం మంత్రి జూపల్లి కొల్లాపూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల మార్కెట్ యార్డులో తడిసిన వరి ధాన్యం, మొక్కజొన్న రాశులను ఆయన నిశితంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఉన్న రైతులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల వల్ల ధాన్యం తడిసినప్పటికీ రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, జిల్లా అధికారుల పర్యవేక్షణలో తడిసిన ధాన్యాన్ని సైతం గోదాములకు తరలిస్తున్నామని మంత్రి వెల్లడించారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**సీఎం నిరంతరం పర్యవేక్షణ..**

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కొనుగోళ్ల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో మొక్కజొన్న దిగుబడి ఊహించిన దానికంటే భారీగా పెరగడంతో గోదాములు సరిపోవడం లేదని చెప్పారు. ఈ సమస్యను అధిగమించడానికి కాటన్ గోదాములు, ప్రైవేట్ గోదాములతో పాటు అవసరమైన చోట ఫంక్షన్ హాళ్లను సైతం వినియోగించుకుని నిల్వ చేస్తున్నామని వివరించారు. ధాన్యం రవాణాకు లారీల కొరత లేకుండా జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకుంటోందన్నారు. ఇబ్బందులున్నా అధిక ధరకే కొనుగోలు..కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో కొనుగోలు చేయడం లేదని మంత్రి జూపల్లి విమర్శించారు. దీనివల్ల రైతులు అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితి వస్తోందన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్నకు చాలా తక్కువ ధర ఉన్నప్పటికీ, రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. హమాలీల కొరత, ఆర్థిక ఇబ్బందులు, గోదాముల కొరత వంటి సమస్యలు వేధిస్తున్నప్పటికీ.. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు.



## హాజరై వధూవరులను ఆశీర్వదించిన

# పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి

**కంగ్టి, మండల్ , మే 17 (వుదయం ప్రతినిధి)**

నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల నాగన్ పల్లి గ్రామ ఆప్తులు చంద్ పాషా గారి కూతురి పెళ్లి వేడుక వారి స్వగ్రామం లో పాల్గొని నూతన వధువరులకి ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి * వారితో బాబు పాటిల్ . రాజేందర్ పాటిల్.

రాంచ్చేనాదర్ మాజీ ఎంపీటీసీ. బాణపురం రాజు ముదిరాజ్. కౌన్సిలర్. జైరాజ్ మాజీ సర్పంచ్ .మారుతీ .తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# ఇండికేటర్లు బంద్.. ప్రమాదాలకు ఆటోలే కారణమా..?

**గద్వాల ,మే 17. (వుదయం ప్రతినిధి)**



జోగులాంబ గద్వాల జిల్లాలో ఆటో డ్రైవర్ల నిర్లక్ష్య డ్రైవింగ్‌పై ద్విచక్ర వాహనదారుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నా యి. ముఖ్యంగా హైవేలు, మండల కేంద్రాల పరిధిలోని ప్రధాన రహదారులపై ప్రయాణిం చే ఆటోలు ఎలాంటి సైడ్ సిగ్నల్స్ ఇవ్వకుం డా అకస్మాత్తుగా మలుపులు తిప్పుతున్నా యని ద్విచక్ర వాహనదారులు ఆరోపిస్తున్నా రు. మలుపు తిరిగే సమయంలో కనీసం ఇండికేటర్లు ఉపయోగించకపోవడం, చేతితో కూడా సంకేతాలు ఇవ్వకపోవడం వల్ల వెనుక నుంచి వచ్చే ద్విచక్ర వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఈ నిర్లక్ష్య ధోరణి కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటు న్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి రద్దీ సమయాల్లో ఆటోలు ఒక్కసారిగా దారి మళ్లించడం వల్ల ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ఇండి కేటర్లు తప్పనిసరిగా వినియోగించాలని ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు, నిబంధనలు ఉల్లం ఘించే వారిపై చర్యలు తీసుకోవాలని జోగులాంబ గద్వాల జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# విద్యార్థులను అభినందించిన నిర్మల జగ్గారెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్

## టీ జీ ఐ ఐ సీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ చేతుల మీదుగా ప్రతిభావంతులైన విద్యార్థులకు





**సంగారెడ్డి, మే 17 (వుదయం ప్రతినిధి)**

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా “విద్య విజయోత్సవం” వేడుకలను ఆదివారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.విద్యా, క్రీడా రంగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు చెక్కు, ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అతిథులు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమని అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి సంగారెడ్డి జిల్లాకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు.నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థులు :కుమ్మరి మౌనిక - జడ్పిహెచ్ఎస్ మల్కాపూర్, కొండాపూర్ - పదో తరగతిలో ద్వితీయ ర్యాంక్ (592/600) నంపల్లి ధనలక్ష్మి - జడ్పిహెచ్ఎస్ మల్కాపూర్, కొండాపూర్ - పదో తరగతిలో తృతీయ ర్యాంక్ (588/600)పెద్దపట్నం ధరణి - జడ్పిహెచ్ఎస్ యెద్దుమైలారం, కంది - పదో తరగతిలో తృతీయ ర్యాంక్ (588/600)ఎ. గాయత్రి - గురుకుల బాలికల కళాశాల, జహీరాబాద్ - ఇంటర్మీడియట్‌లో ప్రథమ ర్యాంక్ (992/1000)ఎం. అరవింద - గురుకుల బాలికల కళాశాల, జహీరాబాద్ - ఇంటర్మీడియట్‌లో ప్రథమ ర్యాంక్ (992/1000)బి. నిఖిత - గురుకుల బాలికల కళాశాల, జహీరాబాద్ ఇంటర్మీడియట్‌లో ద్వితీయ ర్యాంక్ (991/1000)కె. రుత్విక రెడ్డి - జడ్పిహెచ్ఎస్ బీరంగూడ, అమీన్‌పూర్ - జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణిఎం. స్మితక - జడ్పిహెచ్ఎస్ కానుకుంట, ఆర్‌సీ పురం వుషు క్రీడలో ముఖ్యమంత్రి కప్2025 విజేతవి. ప్రియాంక - కస్తూర్బా బాలికల విద్యాలయం, పుల్కల్ - జాతీయ స్థాయి ఆత్యా పాత్యా క్రీడాకారిణికమ్మరి పూజ - కస్తూర్బా బాలికల విద్యాలయం, కొండాపూర్ - ఇంటర్మీడియట్(ఎం పి హెచ్ డబ్ల్య లో ఫస్ట్ ర్యాంక్ (965/1000)లక్ష్మి పద్మావతి - తెలంగాణ మోడల్ పాఠశాల, వెలిమల - ఇంటర్మీడియట్ ఎం ఈ సి విభాగంలో ప్రథమ స్థానం (912/1000)అలాగే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి వారిని ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దిన ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బందిని ప్రత్యేకంగా అతిథుల చేతుల మీదుగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలోజిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు, అదనపు సంచాలకులు శంకర్,సమగ్ర శిక్ష సమన్వయకర్తలు, మండల విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యా సమన్వయ మండలి కార్యదర్శి లింబాజీ, బాలయ్య, తాజుద్దీన్, భీమగొండ, వెంకటస్వామి, సిద్ధారెడ్డి, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జిల్లాలో నాలుగో స్థానం సాధించిన

# ధరణికి నగదు బహుమతి

**కంది ,మే 17. (వుదయం ప్రతినిధి)**

సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎద్దుమైలారం విద్యార్థిని పెదపట్నం ధరణి ఎస్సెస్సీ-2026 ఫలితాలలో 588 మార్కులు సాధించి జిల్లాలో నాలుగో స్థానం దక్కించుకుంది. ఆమె ప్రతిభకు గుర్తింపుగా విద్యావారోత్సవాల సందర్భంగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమక్షంలో రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కంది మండల ఎంఈఓ జోగప్ప, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, డీసీఈబీ సెక్రటరీ లింబాజీతో పాటు ఉపాధ్యాయులు శైలజ వాణి, విజయలక్ష్మి, రాహేలమ్మ, నర్సిములు, పద్మావతి, సరస్వతి, గ్లోరీ, వనజ పాల్గొన్నారు.విద్యార్థిని ధరణి సాధించిన ప్రతిభను అధికారులు, ఉపాధ్యాయులు అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఏపీకే ఫైల్స్ తెలియని వెబ్ సైట్లతో జాగ్రత్తగా ఉండాలి ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట టౌన్ మే17 (వుదయం ప్రతినిధి)**



ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతు లను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలందరికీ అవగాహన కల్పిస్తూ అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఒక ప్రకటన తెలియజేశారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవి స్తుందని వాటిని అడ్డుకోవ డానికి అప్రమత్తత ప్రధా నాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్) లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గావ్యవహరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు.జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్ల వద్ద పటిష్ట బందోబస్తు: సీపీ రష్మి పెరుమాళ్

- రైతులకు ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- ఐకేపీ, ప్యాక్స్ కేంద్రాలు, రైస్ మిల్లుల వద్ద నిరంతర నిఘా
- రెవెన్యూ, సివిల్ సప్లైస్ శాఖలతో సమన్వయం.. స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలన

**సిద్దిపేట, మే 16 (వుదయం బ్యూరో ప్రతినిధి)**



ప్రస్తుతం కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, కొనుగోలు, రవాణా మరియు అన్‌లోడింగ్ ప్రక్రియలు సజావుగా సాగేందుకు సిద్ధిపేట జిల్లా వ్యాప్తంగా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు సిద్ధిపేట పోలీస్ కమిషనర్ (సీపీ) రష్మి పెరుమాళ్, ఐపీఎస్ తెలిపారు. శనివారం ఆమె జిల్లాలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రవాణా మార్గాలు మరియు రైస్ మిల్లులను స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఐకేపీ (IKP), ప్యాక్స్ (PACS) కొనుగోలు కేంద్రాలను పోలీసులు నిరంతరం తనిఖీ చేస్తున్నారని, అన్ని కేంద్రాల వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ధాన్యం అన్‌లోడింగ్ జరుగుతున్న రైస్ మిల్లుల వద్ద కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రైతులు ధాన్యం విక్రయించేటప్పుడు, రవాణా మరియు అన్‌లోడింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి అన్నారు. ధాన్యం లారీల వల్ల ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా,

రవాణాలో జాప్యం జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సమర్థవంతమైన భద్రత కోసం రెవెన్యూ, సివిల్ సప్లైస్ (పౌరసరఫరాలు) మరియు ఇతర సంబంధిత శాఖలతో క్షేత్రస్థాయి పోలీసు అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఘర్షణలు లేదా వివాదాలు తలెత్తకుండా ముందస్తుగా పోలీసు నిఘా ఏర్పాటు చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రశాంతంగా, ఎటువంటి ఆటంకాలు లేకుండా ముగియాలని, రైతులకు అన్ని విధాలా సహకారం అందించాలని పోలీస్ అధికారులను సీపీ ఆదేశించారు. ఈ కొనుగోలు సీజన్ అంతా రైతులకు పూర్తి సురక్షిత వాతావరణం కల్పిస్తూ, జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు సిద్ధిపేట పోలీసులు కట్టుబడి ఉన్నారని ఆమె స్పష్టం చేశారు.



## మే 20 న సూదిని రామ్ రెడ్డి అభినందన సన్మాన సభ

**అయిల్ల శ్రీనివాస్ గౌడ్,,**

**రంగారెడ్డి జిల్లా ( వుదయం ప్రతినిధి )**

ఆమనగల్ మున్సిపాలిటీ పట్టణంలో ఈనెల 20వ తేదీన సూదిని రామ్ రెడ్డికి ట్రిబ్యునల్ చైర్మన్ పదవి నియమించినందుకు పట్టణంలోని శ్రీ లక్ష్మి గార్డెన్ లో అభినందన సన్మాన సభ ఉంటుందని టి పి సి సి అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు, నిన్న కళ్యాణ్ గార్డెన్లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించిన అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలకు సముచిత స్థానం దక్కితున్నందున ఆనందంగా ఉందన్నారు, కల్వకుర్తి నియోజకవర్గం లోని మాడుగుల ఆమనగల్ మండలానికి చెందిన మాజీ ఎంపీపీ సూదిని రామ్ రెడ్డికి పంచాయతీరాజ్ చైర్మన్ పదవినియమించినందుకు హర్షం వ్యక్తం చేశారు, ఈ సన్మాన సభకు ఈనెల 20 న కల్వకుర్తి నియోజకవర్గ ప్రాంతంలోని ప్రజలందరూ ప్రజా ప్రతినిధులు యువ నాయకులు మహిళలు కళాకారులు అందరు కలిసి రావాలని కోరారు, ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, మాడుగుల ఆమనగల్ కర్తాల్ మండలాల అధ్యక్షులు బట్టు కిషన్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు జగన్,బిచ్చ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అంజయ్య గుప్తా, వసుప్పుల శ్రీశైలం ,మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి,కో ఆప్షన్స్ సభ్యులు అబ్దుల్ ఖాదర్,ఆకుతోటపల్లి సర్పంచ్ నరేందర్ రెడ్డి, నాయకులు శుద్ధపల్లి వెంకటేష్, పర్వతాలు, సూదిని శ్రీనివాసరెడ్డి సూదిని కొండల్ రెడ్డి,కృష్ణా నాయక్,కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,ఈ రా సింగ్, జవహర్లాల్,కాలే మల్లయ్య, అవ్వారి శివలింగం, ఎంగలి ప్రసాద్,కొండల్ రెడ్డి అన్మా అన్మాస్ పల్లి శంకర్,ఖాదర్ ఖాద్రి, శ్రీధర్ రెడ్డి,మాజీ వార్డ్ నెంబర్ మల్లేష్ నాయక్,పూసల సత్యం,గోల్డ్ రాము, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వసుప్పుల శ్రీకాంత్,ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, రాజేందర్, దేవరశెట్టి మహేష్, శేఖర్ గౌడ్, కుమార్ గౌడ్, శివ, రాజు, తులసీరామ్, రహీం తదితరులు పాల్గొన్నారు

## వరి కొనుగోలు ప్రక్రియ వేగవంతం



**వికారాబాద్ , మే 17 (వుదయం జిల్లా ప్రతినిధి):**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రైస్ మిల్లులు మరియు వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా డి ఎం సి ఎస్ మోహన్ కృష్ణ,డి సి ఓ నాగార్జున తెలిపారు , బొంరాస్ పేట్, శ్రీ సాయి ఇండస్ట్రీస్ గౌరారం,శ్రీ వెంకటేశ్వర బాయిల్డ్ రైస్ మిల్లు కొడంగల్, వరి కొనుగోలు కేంద్రం దౌల్తాబాద్,వివిధ రైస్ మిల్లులు, వరి కొనుగోలు కేంద్రాలను వారు పరిశీలించారు.ఎక్కువ మంది హమాలిలను ఏర్పాటు చేసుకొని రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని తక్షణమే స్వీకరించి, నాణ్యత ప్రమాణాల ప్రకారం మిల్లింగ్ ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని వారు ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు పెరగకుండా మిలర్లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ధాన్యం రవాణా, హమాలి, నిల్వ మరియు మిల్లింగ్ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నామని తెలిపారు . ప్రతి మిల్లు దగ్గర పోలీస్ అధికారులతో పాటు పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగ కుండ పోలీస్ అధికారుల సహకార ముంటుందని తెలిపారు.

ఆయా కేంద్రాల్లో బస్తాల కొరత లేకుండా, వాహనాలు ఏర్పాటు చేసుకొని, హమాలీ లతో అన్లోడింగ్ పూర్తి చేయాలనీ సూచించారు.ఈ పర్యటన లో పౌర సరఫరాల శాఖ అధికారులు, మోహన్ కృష్ణ,సుదర్శన్, డి సి ఓ నాగార్జున, డి టి లు, పోలీస్ అధికారులు ఉన్నారు.

## వజ్రోత్సవ వేడుకల్లో

# ఆకట్టుకున్న మామిడి ప్రదర్శన

**సంగారెడ్డి, మే 17:వుదయం.**

ఉద్యాన శాఖ అందిస్తున్న ప్రోత్సాహక పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని పండ్ల తోటల విస్తీర్ణాన్ని పెంచుతూ అధిక ఆదాయం పొందాలని హార్టికల్చర్ శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష సూచించారు. ఆదివారం సంగారెడ్డిలోని ఫల పరిశోధన కేంద్రంలో నిర్వహించిన వజ్రోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె, కార్యక్రమాన్ని ప్రారంభించి ఏర్పాటు చేసిన మామిడి ప్రదర్శనను పరిశీలించారు.వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన మామిడి ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫల పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో వివిధ రకాల మామిడి పండ్లను ప్రదర్శించగా, మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాల నుంచి అధిక సంఖ్యలో రైతులు పాల్గొని ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష మాట్లాడుతూ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటల విస్తీర్ణం పెంపు కోసం రైతులకు అనేక ప్రోత్సాహక పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉద్యాన పంటల సాగు విస్తరణ ద్వారా అధిక ఆదాయం పొందాలని సూచించారు.జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాలో సుమారు 16 వేల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోందని తెలిపారు. రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులను అనుసరిస్తూ నాణ్యమైన మామిడి పండ్ల ఉత్పత్తి చేపడితే విదేశాలకు ఎగుమతులు చేసి అధిక లాభాలు పొందవచ్చన్నారు.ఉత్తమ దిగుబడుల సాధనకు నాణ్యమైన మొక్కలు ఎంతో అవసరమని పేర్కొంటూ, ఫల పరిశోధన కేంద్రం ప్రతి సంవత్సరం సుమారు రెండు లక్షల నాణ్యమైన మొక్కలను సంగారెడ్డి జిల్లా రైతులకు అందజేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఫల పరిశోధన కేంద్రం ఒక విలువైన ఆస్తిగా నిలుస్తోందని తెలిపారు. ఉత్తమ దిగుబడుల సాధనకు నాణ్యమైన మొక్కలు ఎంతో అవసరమని పేర్కొంటూ ఈ కార్యక్రమంలో పి. సురేష్, డాక్టర్ కె. వెంకటలక్ష్మి, డాక్టర్ బాబు, డాక్టర్ ఏ. కిరణ్ కుమార్, శాస్త్రవేత్తలు మౌనిక, నవీన్, నితీష్ కుమార్, ఉద్యాన అధికారులు,

ఉద్యాన విస్తరణాధికారులు, డ్రిప్ మరియు గోద్రెజ్ ఆగ్రోవేట్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## టీజీ, ఎంసెట్2026 ఫలితాల్లో

# సెయింట్ ఆంథోనీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**సంగారెడ్డి వుదయం**

ఆదివారం వెలువడిన టీజీ ఎంసెట్ 2026 పరీక్షా ఫలితాల్లో సెయింట్ ఆంథోనీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి కళాశాలకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకొచ్చారు. కళాశాలకు చెందిన విద్యార్థిని టి. మౌనిక 6636వ ర్యాంక్, ఎన్. అశ్విని 8110వ ర్యాంక్, నేతల్ 9665వ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటారు. అలాగే 20 వేల లోపు ర్యాంకులు 8 మంది, 30 వేల లోపు ర్యాంకులు 22 మంది విద్యార్థులు సాధించగా, 50 వేల లోపు ర్యాంకులు పదుల సంఖ్యలో సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఈ. సాలోమన్ రెడ్డి, ప్రిన్సిపల్ ఈ. జ్యోతి రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ జయబాల రెడ్డి విద్యార్థులను అభినందించారు.అలాగే విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించడంలో కృషి చేసిన అధ్యాపక బృందాన్ని కూడా కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.



# విశ్వకర్మల హక్కుల సాధనకు ఐక్య పోరాటమే మార్గం

**ఎర్రవల్లి మండల విశ్వకర్మ సంఘ అధ్యక్షుడిగా దివాకర్ ఎన్నిక**

**అలంపూర్ మే 17 (వుదయం ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి మండల కేంద్రంలోని విశ్వకర్మల అభివృద్ధి, హక్కుల సాధన కోసం సంఘటితంగా ముందుకు సాగాలని సంఘ నాయకులు పిలుపు నిచ్చారు. ఎర్రవల్లి శివాలయంలో అడక్ కమిటీ సభ్యుడు ఎర్రవల్లి పరిపూర్ణాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎర్రవల్లి మండల నూతన విశ్వకర్మ సంఘ కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎర్రవల్లి దివాకర్‌ను, ప్రధాన కార్యదర్శిగా ధర్మవరం పెద్దిస్వామిని, కోశాధికారిగా కొండేరు రాజేష్‌ను ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా పుటాన్ దొడ్డి సత్యనారాయణ, గౌరవ సలహాదారుగా వల్లూరు కృష్ణమోహన్‌ను నియమించారు. ఉపాధ్యక్షుడిగా ఎర్రవల్లి రాకేష్, సంయుక్త కార్యదర్శిగా వేముల సురేష్‌బాబును ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా దువాసిపల్లె వెంకటేష్, యక్తాపూర్ సీతారామయ్య, కొండపేట దేవేంద్ర ఆచారి, మీడియా ఇంచార్జిగా ఎర్రవల్లి అశోక్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ విశ్వకర్మల సంక్షేమం కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాల్సిన సమయం వచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యప్రకాశ్, కృష్ణ, వీరయ్య, సర్వేష్, వేణు తదితరులు పాల్గొని నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.

# చక్కని ఆరోగ్యం

## వేసవిలో రోజూ కొబ్బరి నీళ్లను తాగడం వల్ల ఎన్నో లాభాలు..

పొటాషియం సమృద్ధిగా ఉండటం వల్ల కండరాల పనితీరు, నరాల సంకేతాలు, గుండె ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుందని చెబుతున్నారు. శరీరంలో పొటాషియం లోపం ఉన్నవారికి ఇది సహజమైన మద్దతు అందిస్తుందని పేర్కొం



టున్నారు.

కొబ్బరి నీళ్లు తేలికగా జీర్ణమవుతాయి. కొంతమంది రోజూ తాగడం వల్ల కడుపు ఉబ్బరం లేదా భోజనం తరువాత భారంగా అనిపించడం తగ్గినట్టు గమనించవచ్చని నిపుణులు అంటున్నారు. ఇది ఆమ్లత్వం తక్కువగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థపై ఒత్తిడి తగ్గించడంలో సహాయపడుతుందని చెబుతున్నారు. చక్కెర పానీయాలతో పోలిస్తే కొబ్బరి నీళ్లలో సహజ చక్కెర తక్కువగా ఉంటుంది. అందువల్ల శరీరానికి తేలికపాటి శక్తిని అందిస్తూ, ఒక్కసారిగా షుగర్ పెరగకుండా సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల మధ్యాహ్న సమయంలో అలసట తగ్గి శరీరం కొంత ఉత్సాహంగా అనిపించే అవకాశం



ఉంటుందని పేర్కొంటున్నారు. తగినంత హైడ్రేషన్ వల్ల చర్మంపై కూడా ప్రభావం కనిపిస్తుంది. కొబ్బరి నీళ్లు శరీరానికి ద్రవాలను అందించడం ద్వారా చర్మం మసకబారినట్టు కనిపించడం తగ్గించి కొంత తేమగా కనిపించేందుకు సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. కొబ్బరి నీళ్లు పండ్ల రసాలతో పోలిస్తే తక్కువ చక్కెర కలిగి ఉన్నప్పటికీ, పూర్తిగా షుగర్ లేనివి కావని వైద్యులు గుర్తు చేస్తున్నారు. సాధారణ పరిమితిలో రోజుకు ఒకసారి తాగడం ఆరోగ్యవంతులలో రక్తంలో చక్కెర స్థాయిలను పెద్దగా ప్రభావితం చేయకపోవచ్చని చెబుతున్నారు. అయితే మధుమేహం ఉన్నవారు పరిమాణాన్ని నియంత్రించడం మంచిదని సూచిస్తున్నారు. అయితే ప్రతి ఒక్కరికీ ఒకే విధమైన ఫలితాలు కనిపించకపోవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కొందరికి అధికంగా తాగితే పొటాషియం ఎక్కువై కడుపు ఉబ్బరం లేదా అసౌకర్యం కలిగే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. ముఖ్యంగా కిడ్నీ సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా తీసుకోవాలని సూచిస్తున్నారు. రోజూ కొబ్బరి నీళ్లు తాగడం వల్ల అద్భుత మార్పులు జరగకపోయినా, శరీరం తేలికగా, తాజాగా, సమతుల్యంగా అనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు.కొబ్బరి నీళ్లు వేసవిలో శరీరానికి చల్లదనాన్ని ఇచ్చే సహజ పానీయంగా చాలా మంది తాగుతుంటారు. రుచితోపాటు ఆరోగ్య ప్రయోజనాల కారణంగా కూడా ఇవి ప్రజాదరణ పొందాయి. అయితే రోజూ ఒక నెలపాటు కొబ్బరి నీళ్లు తాగితే శరీరంలో కొన్ని నెమ్మదిగా కనిపించే మార్పులు చోటు చేసుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి ఒక్కసారిగా కనిపించకపోయినా, క్రమంగా శరీరానికి ఉపశమనం, సమతుల్యతను అందిస్తాయని అంటున్నారు. కొబ్బరి నీళ్లలో పొటాషియం, సోడియం, మెగ్నీషియం వంటి ఎలక్ట్రోలైట్లు సహజంగా ఉంటాయి. ఇవి శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడటానికి సహాయపడతాయి. ముఖ్యంగా వేడి వాతావరణంలో రోజూ కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శరీరం మరింత హైడ్రేటెడ్‌గా ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

## పిల్లల్లో మలబద్ధకం.. తగ్గాలంటే..!



పిల్లల్లో శారీరక శ్రమ బాగా తగ్గిపోయింది. ఎంతసేపూ కదలకుండా ఒకే చోట కూర్చోవడం, గంటల తరబడి గ్యాడ్జెట్లకు అతుక్కుపోవడం వల్ల స్థూలకాయం వంటి సమస్యలే కాదు.. మలబద్ధకం కూడా వచ్చే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. ప్రస్తుతం చాలామంది చిన్నారుల్లో తలెత్తే ఈ సమస్యకు కారణాలు, వాటి పరిష్కార మార్గాలేంటో తెలుసుకుందాం రండి.. పిల్లల్లో మలబద్ధకం సమస్య రావడానికి కొన్ని కారణాలున్నాయంటున్నారు నిపుణులు.

శారీరక శ్రమ లేకపోవడం / ఆటలాడకపోవడం / ఎక్కువసేపు కదలకుండా ఒకే చోట కూర్చోవడం..

నీళ్లు సరిగ్గా తాగకపోవడం, ద్రవ పదార్థాలు తీసుకోకపోవడం.. జంక్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం

రాత్రిపూట ఆలస్యంగా తినడం

అర్ధరాత్రి వరకు మేల్కోవడం

నిద్రలేమి.. మొదలైనవి.

ఈ చిట్కాలతో మేలు! ఉదయం నిద్ర లేవగానే ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లు పిల్లలతో తాగించాలి. రుచి కోసం అందుల టీస్పూన్ తేనె, నిమ్మరసం కూడా కలిపి అందించచ్చు.

రాత్రి నీటిలో నానబెట్టిన 4–5 ఎండు ద్రాక్షలను పరగడుపునే తినిపించాలి.


గోరువెచ్చని పాలలో అరటీస్పూన్ ఆవు నెయ్యి కలిపి రాత్రిపూట పడుకునే ముందు పిల్లలకు అందించాలి.

పచ్చి ఆహార పదార్థాలను పిల్లలు జీర్ణం చేసుకోలేరు. కాబట్టి వారికి ఉడకబెట్టిన, వండిన ఆహార పదార్థాలనే అందించాలి. పిల్లలకు అందించే ఆహార పదార్థాల్లో చక్కెర, ఉప్పు, నూనెల మోతాదును బాగా తగ్గించాలి.

పీచు పదార్థాలు మలబద్ధకం సమస్యను దూరం చేస్తాయి. అందుకే చిన్నారుల రోజువారీ ఆహారంలో పీచు అధికంగా ఉండేలా చూసుకోవాలి. ఈ క్రమంలో స్ట్రాబెర్రీ, అవకాడో, యాపిల్, నిమ్మజాతి పండ్లు.. వంటివి వారు ఎక్కువగా తినేలా ప్రోత్సహించాలి.

పిల్లలతో వివిధ రకాల వ్యాయామాలు చేయించడంతో పాటు ఆటలాడేలా వారిని ప్రోత్సహించాలి. నడక, పరుగు, జాగింగ్.. వంటివీ మంచివే!

## యుక్త వయస్సులో బరువు వేగంగా పెరిగితే..



యుక్త వయస్సులో వేగంగా బరువు పెరగడం భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని తాజా పరిశోధన హెచ్చరించింది. ముఖ్యంగా టీనేజ్ చివరి దశ నుంచి 20ల వయస్సు వరకు అధిక బరువు పెరిగిన వారిలో అకాల మరణ ప్రమాదం గణనీయంగా పెరుగుతుందని పరిశోధకులు గుర్తించారు. గుండె జబ్బులు, మధుమేహం, రక్తపోటు, స్ట్రోక్ వంటి వ్యాధుల ముప్పు కూడా ఎక్కువవుతుందని అధ్యయనం వెల్లడించింది. స్వీడన్‌లో నిర్వహించిన ఈ అధ్యయనంలో 17 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన 6 లక్షల మందికి పైగా వ్యక్తుల బరువు మార్పులను పరిశీలించారు. బరువు వేగంగా పెరిగినవారిలో మరణాల రేటు ఎక్కువగా కనిపించిందని పరిశోధకులు తెలిపారు. ముఖ్యంగా చిన్న వయస్సులోనే ఊబకాయం ప్రారంభమైతే శరీరం ఎక్కువకాలం మెటబాలిక్ ఒత్తిడికి గురవుతుందని, ఇది గుండె, రక్తనాళాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. 29 ఏళ్ల వయస్సుకల్లా ఊబకాయంతో బాధపడుతున్న వారిలో అకాల మరణ ప్రమాదం 70 నుంచి 84 శాతం వరకు పెరిగినట్లు అధ్యయనం తెలిపింది. మహిళల్లో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉండటం గమనార్హం. గుండెపోటు, స్ట్రోక్, టైప్–2 డయాబెటిస్, హైపర్‌టెన్షన్, ఫ్యాటీ లివర్ వంటి సమస్యలు కూడా వీరిలో అధికంగా కనిపించాయని వెల్లడించారు. పురుషుల్లో చిన్న వయస్సులో బరువు పెరగడం కొన్ని రకాల క్యాన్సర్ల ముప్పును పెంచగా, మహిళల్లో మాత్రం క్యాన్సర్ ప్రమాదంలో అంత స్పష్టమైన మార్పు కనిపించలేదని అధ్యయనం పేర్కొంది. మెనోపాజ్ సమయంలో జరిగే హార్మోన్ల మార్పులు కూడా దీనికి కారణం కావచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. సగటున ప్రతి ఏడాది సుమారు 0.4 కిలోల బరువు పెరిగినప్పటికీ, దీర్ఘకాలంలో అది పెద్ద ప్రభావం చూపుతుందని అధ్యయనం తెలిపింది. 17 నుంచి 30 ఏళ్ల మధ్య దాదాపు 6.5 కిలోల బరువు పెరిగిన వారిలో కూడా మరణ ప్రమాదం పెరిగినట్లు గుర్తించారు

## పుదీనాతో చెమటకు చెక్!

పుదీనాలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మాన్ని డ్యామేజ్ కాకుండా రక్షించడమే కాకుండా, హైడ్రేట్ చేసి తాజాగా ఉండేలా చేస్తాయి. పుదీనాలోని విటమిన్ 'ఏ'



చర్మంలోని జిడ్డును తగ్గించి, చర్మాన్ని బిగుతుగా చేస్తుంది. పుదీనా ఆకుల పేస్ట్, గుడ్డు తెల్లసొన మిశ్రమంతో మాస్క్ వేసుకుంటే చర్మం నిగారిస్తుంది. పుదీనాలోని శాలిసిలిక్ యాసిడ్ మొటిమలను తగ్గిస్తుంది. పుదీనా రసం, పచ్చి బొప్పాయి రసాన్ని కలిపి మచ్చలు, కీటకాలు కుట్టిన చోట లేదా చర్మ ఇన్‌ఫెక్షన్లపై రాస్తే అద్భుతమైన ఫలితం ఉంటుంది. వేసవిలో చన్నీటిలో పుదీనా ఆకులను వేసి ముఖం కడుక్కోవడం వల్ల చర్మం తాజాగా ఉంటుంది. స్నానం చేసే నీటిలో పుదీనా ఆకులు లేదా పుదీనా నూనె వేసుకుంటే అలసట తగ్గి, అధిక చెమట సమస్య నుంచి ఉపశమనం కలుగుతుంది. ముఖంపై మొటిమల వల్ల ఏర్పడే మచ్చల నివారణకు కూడా పుదీనా తోడ్పడుతుంది. సమాన పరిమాణంలో ఎండిన తులసి, వేప, పుదీనా ఆకులను పొడి చేసి పెట్టుకోవాలి. ఒక చెంచా ఈ పొడికి కొంచెం పసుపు, రోజ్ వాటర్ కలిపి పేస్ట్‌లా చేసి మచ్చలపై రాస్తే అవి క్రమంగా తగ్గుతాయి. ఎంత ఖరీదైన ఫేస్ వాష్‌లు వాడినా, ముఖం కడుక్కోవడానికి ఉపయోగించే నీరు బాగుండకపోతే ఆ ప్రయత్నాలన్నీ వృథానే. కొళాయి నీటిలో ఉండే క్లోరిన్, ఇతర మలినాలు, హార్డ్ వాటర్ చర్మాన్ని పొడిగా మార్చడమే కాకుండా, మొటిమలు, అలర్జీలకు దారితీస్తాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రముఖ వెల్‌నెస్ బ్రాండ్ కానోపీ తన సరికొత్త ఫాసెట్ ఫిల్టర్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ ఫిల్టర్ సాధారణ వాటర్ ఫిల్టర్ల లాగా కాకుండా, ప్రత్యేకంగా చర్మ సంరక్షణ కోసం రూపొందించినది. ఇది నీటిలోని క్లోరిన్, ఇతర మలినాలను తొలగించి, నీటిని సున్నితంగా మారుస్తుంది. దీనివల్ల చర్మంపై కలిగే మంట, అలర్జీలు తగ్గుతాయి. మొటిమలు వచ్చే అవకాశం తగ్గుతుంది. చర్మం సహజసిద్ధమైన మెరుపును సంతరించుకుంటుంది. ఈ ఫిల్టర్ కేవలం పనితీరులోనే కాకుండా, చూడటానికి కూడా చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. బాత్రూమ్ ఇంటీరియర్‌కు తగినట్లుగా ఇది లావెండర్, ఇత్తడి, మ్యాట్ బ్లాక్, బ్రష్డ్ నికెల్ వంటి అద్భుతమైన రంగులలో లభిస్తుంది. కానోపీ సంస్థ కేవలం ఫిల్టర్లకే పరిమితం కాకుండా, షవర్ హెడ్‌లు హ్యూమిడిఫైయర్‌లను కూడా సరికొత్త రీతిలో డిజైన్ చేస్తోంది.

## చియా, గుమ్మడి సీడ్స్‌ను రోజులో ఏ సమయంలో తీసుకోవాలి..

నేటి తరుణంలో ఆరోగ్యం మీద అవగాహన రావడంతో చాలా మంది విత్తనాలను ఆహారంగా తీసుకుంటున్నారు. విత్తనాలు చాలా మందికి ఇప్పుడు ఆరోగ్యకరమైన ఆహారంలో ముఖ్యమైన భాగంగా మారిపోయాయని చెప్పవచ్చు. చియా సీడ్స్ నుంచి గుమ్మడి గింజలు, సన్‌ఫ్లవర్ సీడ్స్ వరకు చాలామంది రోజూ తీసుకుంటున్నారు. వీటిలో ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంతో శరీరానికి ఎన్నో ప్రయోజనాలు అందుతాయి. అయితే వీటిని సరైన సమయంలో, సరైన విధంగా తీసుకోకపోతే పూర్తి పోషకాలు శరీరానికి అందకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. చిన్న చిన్న మార్పులతోనే వీటి ప్రయోజనాలను మరింతగా పొందవచ్చని సూచిస్తున్నారు. ఏయే విత్తనాలను ఎలా, ఎప్పుడు తీసుకోవాలో వారు వివరిస్తున్నారు. చియా సీడ్స్ ప్రస్తుతం ఎక్కువగా ఉపయోగిస్తున్న విత్తనాలలో ఒకటి. ఇవి ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు. ఇందులో ఉండే సొల్యూబుల్ ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అలాగే రోజంతా రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడం



లో కూడా ఉపయోగపడుతుంది. ఇది శరీరంలో శక్తి సమతుల్యతకు, కొవ్వు తగ్గించుకోవడానికి తోడ్పడుతుంది. అలాగే చియా సీడ్స్‌ను నేరుగా తినడం కంటే ముందుగా నీటిలో నానబెట్టడం మంచిదని సూచిస్తున్నారు. ఒక గ్లాస్ నీటిలో వేసి కొంతసేపు ఉంచితే అవి విస్తరించి జెల్‌లా మారతాయి. ఆ తరువాత అదే నీటితో కలిసి తీసుకుంటే శరీరం పోషకాలను సులభంగా గ్రహిస్తుంది. సన్‌ఫ్లవర్, గుమ్మడి విత్తనాలను చాలామంది ఎప్పుడైనా స్నాక్‌లా తింటుంటారు. అయితే మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య తీసుకుంటే మరింత ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు. మధ్యాహ్న భోజనంలో ఉండే మంచి కొవ్వులు ఈ విత్తనాల్లోని జింక్, మెగ్నీషియం వంటి ఖనిజాలను శరీరం బాగా గ్రహించేందుకు సహాయపడతాయి. ఈ విత్తనాలను తేలికగా డ్రై రోస్ట్ చేసి తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల వాటి పోషకాలు నిల్వ



ఉండటమే కాకుండా జీర్ణం కావడం కూడా సులభమవుతుంది. అదే విధంగా బేసిల్ సీడ్స్ వేసవిలో ఎక్కువగా ఉపయోగపడే విత్తనాలుగా భావిస్తారు. ఇవి శరీరానికి చల్లదనాన్ని అందించడంలో సహాయపడతాయి. మధ్యాహ్న భోజనం ముందు, అంటే మిడ్ మార్నింగ్ సమయంలో తీసుకుంటే శరీరం పోషకాలను బాగా గ్రహిస్తుందని నిపుణులు చెబుతున్నారు. వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడంలో కూడా బేసిల్ సీడ్స్ కూడా ఉపయోగపడతాయి. ఈ సీడ్స్‌ను కూడా ముందుగా నీటిలో నానబెట్టాలి. అవి విస్తరించిన తర్వాత తీసుకుంటే చల్లదనంతో పాటు హైడ్రేషన్ ప్రయోజనాలు మరింతగా అందుతాయి. విత్తనాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసినా, వాటిని ఎలా తీసుకుంటున్నామన్నది కూడా అంతే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. సరైన సమయంలో తీసుకోవడం, కొన్ని విత్తనాలను నానబెట్టి తీసుకోవడం వల్ల ఫైబర్, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరానికి మెరుగ్గా అందుతాయి. కాబట్టి ఇకపై విత్తనాలను తీసుకునేటప్పుడు సమయం, విధానం రెండింటినీ గమనిస్తే ఆరోగ్య ప్రయోజనాలు మరింతగా పొందవచ్చని వారు సూచిస్తున్నారు.

## జుట్టు ఆరోగ్యానికి మునగాకు లడ్డూ..!

మారుతున్న జీవనశైలి, ఆహారపుటలవాట్లు, కాలుష్యం కారణంగా చాలామంది



మహిళలు.. జుట్టు రాలడం, గోళ్లు పొడిబారడం.. వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొంతమంది ఆరోగ్యపరమైన, జన్యుపరమైన కారణాల వల్ల కూడా ఈ సమస్యలతో బాధపడుతుంటారు. అయితే ఇలాంటి సమస్యలకు సహజసిద్ధమైన పదార్థాలతోనే చెక్ పెట్టొచ్చంటున్నారు పోషకాహార నిపుణులు. ఈ క్రమంలో– మునగాకుతో చేసిన లడ్డూ తినడం వల్ల జుట్టు రాలే సమస్యను తగ్గించవచ్చంటున్నారు. ఇది జుట్టు, గోళ్ల ఆరోగ్యానికి మేలు చేస్తుందని చెబుతున్నారు.

గుమ్మడి గింజలు – 1/3 కప్పు, పిస్తా గింజలు – 1/3 కప్పు, కొబ్బరి పొడి – 2/3 కప్పు, మునగాకు పొడి – 2 టేబుల్ స్పూన్లు, యాలకులు – మూడు, కిస్‌మిస్ – 3/4 కప్పు, తయారీ: ముందుగా ఒక కడాయి తీసుకుని అందులో కొబ్బరి పొడి, పిస్తా గింజలు, గుమ్మడి గింజలు వేసి దోరగా వేయించాలి. ఆ తర్వాత కిస్‌మిస్‌ని కూడా దోరగా వేయించాలి. వీటన్నింటిని మిక్సీ బౌల్‌లోకి తీసుకుని మునగాకు పొడి, యాలకులను జత చేసి మిక్సీ పట్టుకోవాలి. వచ్చిన మిశ్రమాన్ని ఉండల్లా చేసుకుంటే లడ్డూలు రెడీ. ఈ లడ్డూని రోజుకు ఒకటి చొప్పున తీసుకోవాలి. కొబ్బరి పొడిలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి జుట్టు, గోళ్లకు పోషణ అందిస్తాయట. పిస్తాలో బయోటిన్, విటమిన్–ఈతో పాటు ఒమేగా–6 ఫ్యాటీ ఆమ్లాలు మెండుగా ఉంటాయి. ఇవి జుట్టు కుదుళ్లను దృఢంగా చేసి, పెరుగుదలను ప్రేరేపించడంలో సహాయపడతాయట. కిస్‌మిస్‌లో ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. మునగాకుల్లో విటమిన్ ఎ, సి, విటమిన్ బి కాంప్లెక్స్, అమైనో యాసిడ్స్, ఐరన్, జింక్, క్యాల్షియం, కాపర్, పొటాషియం, మెగ్నీషియం, మాంగనీసు, సిలికాలు ఉంటాయి. ఇవి చర్మం, జుట్టు, గోళ్ల ఆరోగ్యానికి ఎంతో సహాయపడతాయట.

## చల్లగా బ్రేక్‌ఫాస్ట్ చేద్దామా!

ఒకప్పుడు ఉదయాన్నే అల్పాహారం అంటే వేడివేడి ఇడ్లీ, దోశనో ఉండాల్సిందే. కానీ, ఇప్పుడు ట్రెండ్ మారింది. ముఖ్యంగా జెన్‌జీలు, టీనేజర్లు స్టవ్ వెలిగించే పని లేకుండా రాత్రంతా నానిన అల్పాహారాల 'కోల్డ్ బ్రేక్‌ఫాస్ట్' వైపు మారుతున్నారు. ఓవర్‌నైట్ ఓట్స్, స్మూతీ బౌల్స్, చియా సీడ్ పుడ్డింగ్, సలాడ్స్ వంటివన్నీ ఈ తరహానే. పాలల్లో ఓట్స్, పండ్లు, డ్రైఫ్రూట్స్ కలిపి రాత్రంతా ఫ్రిజ్‌లో ఉంచి ఉదయాన్నే తినడం, పండ్లు, నట్స్, కూరగాయలను కలిపి స్మూతీలా చేసుకోవడం, పాలల్లో ఫ్రూట్ జ్యూస్‌ల్లో నానబెట్టిన చియాసీడ్స్‌ని తీసుకోవడం వంటి వెరైటీలెన్నో వీటిల్లో ఉన్నాయి. టీనేజర్లకు ఇది కేవలం ఆహారం మాత్రమే కాదు, ఒక సోషల్ మీడియా స్టేటస్ కూడా! అంతేకాదు, చాక్లెట్ రుచి కోసం కోకో పౌడర్, తియ్యదనానికి తేనె, బెల్లం వంటివీ, నచ్చిన పండ్లనూ చేర్చుకుని కస్టమైజేషన్ చేసుకోవచ్చు. నిజానికి డైటింగ్ అనే పదానికంటే, వెల్‌నెస్ అనే పదానికి టీనేజర్లు విలువిస్తున్నారు. ఫైబర్, ప్రొటీన్ పుష్కలంగా ఉండే ఈ ఆహారం మెదడును చురుగ్గా ఉంచుతుందని వారు నమ్ముతున్నారు. ఈ చల్లటి అల్పాహారాల్లో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీనివల్ల పదే పదే తినాలనే కోరిక తగ్గుతుంది. పైగా తేలిగ్గానూ జీర్ణమవుతుంది. కాబట్టి బరువు పెరిగే సమస్యే రాదని ఫీలవుతున్నారు.



వుదయం సినిమా MOVIE TIME!

## హబీబ్స్ న్యూ ప్రీమియం సెలూన్ ప్రారంభం

హైదరాబాద్‌లోని బాచుపల్లి మియాపూర్ రోడ్‌లో ప్రముఖ హెయిర్ అండ్ బ్యూటీ బ్రాండ్ 'హబీబ్స్' నూతన ప్రీమియం సెలూన్ శాఖ అత్యంత వైభవంగా ప్రారంభమైంది. బాచుపల్లి లహరి ట్విన్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లో (రత్నదీప్ సూపర్ మార్కెట్ సమీపంలో, కేఎస్ బేకర్స్ పక్కన) ఏర్పాటు చేసిన ఈ అత్యాధునిక సెలూన్‌ను ముఖ్య అతిథి, ప్రముఖ సినీ, టెలివిజన్ నటి వర్ష రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలనతో ఘనంగా ప్రారంభించారు. హబీబ్స్ ప్రతినిధి ఎండీ అమన్ హబీబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు పలువురు ప్రముఖులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.





# #Chiru Bobby2

## మే 21న ఘనంగా ప్రారంభం

మెగాస్టార్ చిరంజీవి మరోసారి సక్సెస్‌ఫుల్ దర్శకుడు బాబీ కొల్లితో చేతులు కలుపుతున్నారు. ప్రతిష్టాత్మక కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్ #ChiruBobby2 / #Chiru158 మే 21న ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది.

ఈ ప్రకటనను చిరంజీవి స్వయంగా ఒక పవర్‌ఫుల్ జిమ్ వీడియో ద్వారా రివిల్ చేశారు. ఆ వీడియోలో ఆయన చూపించిన డెడికేషన్, ఇంటెన్స్ వర్కౌట్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. కొత్త లుక్ కోసం ఆయన పడుతున్న కష్టం, ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్ కోసం చేస్తున్న ట్రైనింగ్ ఈ సినిమాలో ఉండబోయే హైవోల్టేజ్ యాక్షన్‌కు హింట్ ఇస్తోంది.


వీడియోలో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ... గెట్టింగ్ రెడీ ఫర్ 158.. బాబీ.. మే 21 ముహూర్తం.. కెవిఎన్ ప్రొడక్షన్స్ వారిది..అంటే ఇంకో నాలుగైదు రోజుల్లో కలుస్తున్నాం. గెట్ రెడీ''.

ఎక్స్ ప్లోసివ్ పవర్, ఫంక్షనల్ స్ట్రెంగ్త్, స్టామినా మీద ఫోకస్ చేసిన ఆ ట్రైనింగ్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఈ వీడియో చూసిన తర్వాత సినిమాలపై చిరంజీవి గారి ప్యాషన్ మరోసారి స్పష్టమౌతోంది. ప్రతి వర్కౌట్‌లో కనిపిస్తున్న ఆ ఇంటన్సిటీ, తెరపై మరొకసారి ఎలక్ట్రిఫై చేసే పెర్ఫార్మెన్స్ ఇవ్వాలనే ఆయన తపన ఇంకా పెరిగిందనే విషయం స్పష్టంగా తెలుస్తోంది.

**ఇప్పటికే మేకర్స్ విడుదల చేసిన కాన్సెప్ట్ పోస్టర్, లుక్ టెస్ట్ ఇమేజ్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి-బాబీ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. మాస్ ఎలిమెంట్‌స్‌తో కథలను పవర్‌ఫుల్‌గా తెరకెక్కించడంలో పేరున్న బాబీ కొల్లి, ఈసారి చిరంజీవిని మరింత ఇంటెన్స్, పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో చూపించబోతున్నారు. ఈ చిత్రం భారీ యాక్షన్ ఎపిసోడ్స్, ఎలక్ట్రిఫై చేసే ఎలివేషన్స్, అభిమానులను అలరించే మాస్ మూమెంట్స్ తో ఉండబోతోంది.**

## ఐక్య ధైర్య సేన సమితి ప్రారంభం



తన పుట్టినరోజు సందర్భంగా 'రా కింగ్' మనోజ్ మంచు , ఆయన భార్య మౌనిక భూమా మంచు కలిసి హైదరాబాద్‌లో కూకట్‌పల్లి లో రక్తదాన శిబిరం మరియు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, తమ కొత్త సామాజిక సేవా సంస్థ "ఐక్య ధైర్య సేన సమితి"ను అధికారికంగా ప్రారంభించారు. "Unity, Courage, Service, Impact" అనే నినాదంతో ప్రారంభమైన ఈ సంస్థ ఆవిష్కరణ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, అభిమానులు, వాలంటీర్లు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభను ఉద్దేశించి మాట్లాడిన 'రా కింగ్' మనోజ్ మంచు భావోద్వేగంతో అందరికీ స్వాగతం పలుకుతూ, తాము చిన్నప్పటి నుంచి సేవాభావాన్ని కుటుంబ సభ్యుల నుంచి నేర్చుకున్నామని తెలిపారు. ఈ సంస్థ ఆలోచన ఎలా వచ్చిందో వివరిస్తూ, సమాజానికి సేవ చేయాలనే ఆలోచన కలిగిన వారందరికీ ఒక వేదికను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఈ ట్రస్ట్‌ను ప్రారంభించామని చెప్పారు.

## రామ్ చరణ్ తో చేయడం నా అదృష్టం

నిర్మాత వెంకట సతీష్ కిలారు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇప్పటికే చార్ట్ బస్టర్ పాటలు, అద్భుతమైన గ్లింప్స్ తో సినిమాపై అంచనాలు భారీ స్థాయికి చేరుకున్నాయి. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత వెంకట సతీష్ కిలారు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. రామ్ చరణ్ గారు సినిమా ఇవ్వడం నా అదృష్టం. ఆయన ఒప్పుకుంటేనే ఇది సాధ్యపడింది. ఈ సందర్భంగా రామ్ చరణ్ గారికి ధన్యవాదాలు.

## బ్లాక్ మెయిల్ ప్రారంభం



వరుణ్ సందేశ్, జెమిని సురేష్ ప్రధాన పాత్రలలో హనుమాన్ ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్ పై అవినాష్ కూనపరెడ్డి నిర్మాతగా శ్రీనివాస్ గుండ్రెడ్డి రచన దర్శకత్వంలో ప్రారంభమైన చిత్రం బ్లాక్ మెయిల్. పూజా కార్యక్రమాలతో నేడు హైదరాబాద్ లోని ప్రసాద్ లో ఈ చిత్ర ప్రారంభం ఘనంగా జరిగింది. పృథ్వీరాజ్, సమ్మెట గాంధీ, నాగ మహేష్ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించనున్నారు. జి ఎస్ చక్రవర్తి రెడ్డి సినిమాటోగ్రఫీ చేస్తున్న ఈ చిత్రానికి రాఘవేంద్ర రెడ్డి ఎడిటర్ గా చేస్తుండగా, ఎస్ వి మల్లిక్ తేజ సంగీత దర్శకుడుగా పనిచేస్తున్నారు. ఈ చిత్ర స్క్రిప్ట్ నిర్మాతల చేతుల మీదుగా దర్శకునికి అందించగా ప్రముఖ రచయిత, నిర్మాత కోన వెంకట గారు మొదటి క్లాప్ కొట్టారు. సీనియర్ నిర్మాత భరద్వాజ్ గారు కెమెరా స్విచ్ ఆన్ చేయగా జెమిని సురేష్ గారి తల్లి ఎం వెంకట సుబ్బ లక్ష్మి గారు మొదటి షాట్ దర్శకత్వం చేశారు. ఈ కార్యక్రమానికి నటుడు రక్షిత్ అట్లూరి, నటి శ్రీలు తదితరులు హాజరై తమ శుభాకాంక్షలు తెలిపారు.

## పురుష ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు 'పురుష:' సినిమాను నిర్మించారు. ఈ మూవీకి వీరు వులవల దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజ్ కుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ మూవీని మే 22న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, పాటలు, గ్లింప్స్, టీజర్ ఇలా అన్నీ అందరినీ ఆకట్టుకున్నాయి. ' సినిమాని ఇప్పటి వరకు చూసిన వారంతా మెచ్చుకున్నారు. కచ్చితంగా విజయం సాధిస్తుందని అన్నారు. ఈ సినిమా ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుంది. ఈ చిత్రం విడుదలైన తరువాత తదుపరి ప్రాజెక్ట్ గురించి ఆలోచిస్తాను.




## 20న డేవిడ్ రెడ్డి టీజర్ రిలీజ్

'రా కింగ్' మంచు మనోజ్ నటిస్తున్న కొత్త సినిమా "డేవిడ్ రెడ్డి". ఈ సినిమాను వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్స్ పై నల్లగంగుల వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ హనుమా రెడ్డి యక్కంటి రూపొందిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి బ్యాక్ డ్రాప్ తో ఇంటెన్స్ యాక్షన్ డ్రామా కథతో భారీ పాన్ ఇండియా చిత్రంగా "డేవిడ్ రెడ్డి" సినిమా తెరకెక్కుతోంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడలో రూపొందుతున్న ఈ చిత్రం నుంచి క్రేజీ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ నెల 20న మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా "డేవిడ్ రెడ్డి" సినిమా టీజర్ ను రిలీజ్ చేయబోతున్నారు. అలాగే ఇప్పటిదాకా రాకింగ్ స్టార్ గా పిలవబడుతున్న మంచు మనోజ్ ఇకపై రా కింగ్ మంచు మనోజ్ ట్యాగ్ తో మన ముందుకు రాబోతున్నారు. "డేవిడ్ రెడ్డి" టీజర్ పై భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి. బ్రిటీష్ సామ్రాజ్యానికి ఎదురు నిలిచిన ఒక యోధుడి తిరుగుబాటు కథగా రూపొందుతున్న "డేవిడ్ రెడ్డి " చిత్రంలో మంచు మనోజ్ కొత్త అవతార్ లో కనిపించనున్నారు. ఇప్పటికే "డేవిడ్ రెడ్డి" సినిమా నుంచి రిలీజ్ చేసిన గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్స్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా మనోజ్ కు ఒక మంచి కమ్ బ్యాక్ అవుతుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి.



## అదొక మెమరబుల్ మూమెంట్

### నటుడు ప్రదీప్ కొట్టె

న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్‌తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్‌పై నిర్మించిన సినిమా 'తిమ్మరాజుపల్లి టీవీ'. ఈ మూవీకి తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమయ్యారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే పీరియాడిక్ డ్రామా మంచి విజయాన్ని అందుకుంది. 'తిమ్మరాజుపల్లి టీవీ' సినిమా ఈ నెల 15వ తేదీ నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కు రాబోతోంది. ఈ సందర్భంగా నటుడు ప్రదీప్ కొట్టె తన సినీ జర్నీ గురించి విశేషాలను పంచుకున్నారు. నేను యాక్టింగ్ సైడ్ ఉన్నానని మా ఇంట్లో ఎవ్వరికీ తెలీదు. కాస్తో కూస్తో మా అక్కకి తెలుసంతే. మా అమ్మనాన్నలకు చెప్పకుండా షూటింగ్‌కి తీసుకు వచ్చింది మా అక్క. అలా మా పేరెంట్స్‌ని అలా చూడటం, వారు నన్ను అలా చూడటం అదొక మెమరబుల్ మూమెంట్.

## 29న త్రికాల

భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న రహస్యాలను ఆధారంగా చేసుకుని రూపొందిన మైథలాజికల్ ఫిక్షనల్ థ్రిల్లర్ 'త్రికాల' మే 29న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. హీరోయిన్ శ్రద్ధదాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో మాస్టర్ ఫేమ్ మహేంద్రన్, అజయ్, సీనియర్ నటి ఆమని కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి మణి తెల్లగూటి కథ, దర్శకత్వం వహించగా, రాధిక-శ్రీనివాస్ నిర్మించారు. ఈ సినిమా నచ్చడంతో చాగంటి ప్రొడక్షన్ ఎల్ ఎల్ పి ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నది.




Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.